
ILLUSTRATED WEEKLY



29-4-

25 నయాపైసలు


ఆంధ్రసచిత్రవారపత్రిక




సూర్యశక్తి

[శ్రీకాకుళం జిల్లాలోని సాలెహుండాం గ్రామంలో బయల్పడిన ప్రాచీన బౌద్ధశిథిల శిల్పానికి పూర్ణ ప్రతికృతి]

చిత్రకారుడు : వ. పాపయ్య.




ఈ నెల 14 వ తేదీన గిండీ, గాంధీమండపందగ్గిర్లో బాలలక్రీడావనం ప్రారంభోత్సవంచేస్తూ, జ్యోతి వెలిగిస్తున్న ప్రధాని నెహ్రూ.



ఎలియట్స్‌రోడ్ బీచ్ వద్ద శ్రీ నెహ్రూ ఆవిష్కరించిన గాంధీజీ కాంస్య ప్రతిమ. ప్రముఖశిల్పి శ్రీ రాయ్‌చౌధురి దీన్ని తయారుచేశారు.

మద్రాసులో ప్రధాని నెహ్రూ

గిండీలోని మద్రాస్ రైడింగ్ క్లబ్బును దర్శించినసందర్భంలో ఖులాసాగా గుర్రపుస్వారీచేస్తున్న శ్రీ నెహ్రూ.



ఆంధ్ర సచిత్ర వారపత్రిక

సంవత్సర చందా
రు 13—0—0
విడిప్రతిక 25 న.పై

Founder: K. NAGESWARA RAO

వికారి చైత్ర బహుళ సప్తమి: బు వారం


సంపుటము 53
సంచిక 31
29-4-59

వి ష యా ను క్ర మ ణి క

ముఖచిత్రం:
నవశక్తి ఫిలింస్ వారి 'మాయింటిమహాలక్ష్మి' లో
గి రి జ



రాజధాని కబుర్లు




'ప్రవీణ్'

మారిషస్ దీవుల్లో మన వాళ్లు

తెలుగువాళ్ళు దేశం విడిచి బయటకు పోలేరని, దేశం విడిచి వెళ్ళిన తెలుగువారు తెలుగుదనం నిలుపుకోలేరని ఒక అపవాదు ఉంది. అపవాదులు రెక్కలు కట్టుకు ఎగురుతాయి. కొత్త ఢిల్లీలో కూడా ఇదే అభిప్రాయం ఉన్నట్లుంది. దేశాంతరవాసులైన భారతీయులందరికీ వారి వారి భాషల్లో కార్యక్రమాలు ప్రసారం చేసే ఆకాశవాణి తెలుగుకు సంబంధించినంతవరకు అట్టి కార్యక్రమాలు అనవసరమనే నిర్ణయానికి వచ్చింది.

అందాకా ఎందుకు? మొన్న మొన్నటివరకు తంతి తపాలాశాఖల బోర్డులన్నీ కన్నడ లిపిలో నేగదా ఉన్నది? ఇప్పుడు మనిఆర్డర్ ఫారాలు, కార్డులు, కవరు హిందీ అక్షరాలతోనే వస్తున్నాయిగదా? దీనికి కేంద్రప్రభుత్వాన్ని ఏ విధంగా నిందించగలం? ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిద్ర మేల్కొంచవలసిన సమయం ఇంకా రాలేదా?

ప్రభుత్వ కార్యక్రమాలను తెలుగులో నడిపించవలసిన ఆవశ్యకతను స్పష్టీకరిస్తూ శాసనసభలో శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య ఒక తీర్మానం తెచ్చారు. ముఖ్యమంత్రి ఈవిషయం పరిశీలించడానికి ఒక ప్రత్యేకాధికారిని నియమిస్తున్నామన్నారు. కొన్ని నెలలతర్వాత వావిలాలవారు ఈ ప్రసక్తి తెస్తే, ముఖ్యమంత్రి ప్రత్యేకాధికారిని నియమించినట్లే జ్ఞాపకం అన్నారు. తరువాత ఒక మహమ్మదీయ సోదరుడిని తెలుగు సమస్య విషయం పరిశీలించడానికి నియమించడం జరిగింది.



శ్రీపండిట్ రామ్మూర్తి అప్పన్న

తెలుగు సమస్య విషయంలో రాష్ట్రప్రభుత్వానికి శ్రద్ధ లేకపోడాన్ని గురించి కొన్ని మాసాల క్రితం 'టైమ్స్ ఆఫ్ ఇండియా' పత్రిక తీవ్రంగా విమర్శించింది. మన ప్రభుత్వానికి శ్రద్ధ లేనప్పుడు కేంద్రాన్ని విమర్శించి ప్రయోజనం లేదు. ఈలోగా దేశం వెలుపల నివసిస్తూన్న లక్షలాది తెలుగువారు తెలుగుభాష నేర్వడానికి, వినడానికి, పలకడానికి, రాయడానికి తహతహలాడుతున్నారు.

* * *

హిందూమహాసముద్రంలో మడగాస్కర్ దీవికి చేరువలో ఉన్నాయి మారిషస్ దీవులు. ఈదీవుల్లో ఉన్న జనాభా సంఖ్య ఐదులక్షలు. ఐదింట మూడులక్షలు పోర్టులూయిస్ నగరంలో ఉన్నారు. ఐదు లక్షల జనాభాలో తెలుగువారు నలభైఐదు వేలు. 1860 సంవత్సరం తర్వాత తెలుగుదేశంనుంచి జీవనోపాధికై వెళ్లిన వారు వీరిలో ఎక్కువ. తమలో తెలుగుదనాన్ని నిలుపుకోడం కోసం 1946 వ సంవత్సరంలో మారిషస్ ఆంధ్ర మహాసభను స్థాపించుకున్నారు వీరు.

ఈ మారిషస్ ఆంధ్ర మహాసభ ప్రతినిధిగా శ్రీ రామ్మూర్తి అప్పన్న గతవారం హైదరాబాదు చేరుకున్నారు. ఏప్రిల్ 4 వ తేదీ శనివారం సికిందరాబాద్ బూరుగు మహాదేవ్ హాలులో సభాపతి శ్రీ కాశీశ్వరరావు అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో పాల్గొన్నారు. మారిషస్ ఆంధ్రుల సమస్యల్ని వివరించి చెప్పారు.

మారిషస్ ఆంధ్ర మహాసభ అక్కడి ఆంధ్రుల నైతిక, ఆధ్యాత్మిక సాంస్కృతికాభివృద్ధికై కృషిచేస్తూంది. ఈ మహాసభ శాఖలు నలభైఐదు దీవులంతటా ఇతోధికంగా కృషి చేస్తున్నాయి. తెలుగువారి అధీనంలో 26 దేవాలయాలున్నాయి. ఈ దేవాలయప్రాంగణాలలో హిందూ ధర్మబోధ జరుగుతుంది. హిందీ, తెలుగుభాషాబోధన జరుగుతూంది. శ్రీ రామమూర్తి అప్పన్న ఈ దేవాలయ పాఠశాలలకు ఆచార్యులుగా పనిచేస్తున్నారు.

మారిషస్ ప్రభుత్వం తెలుగును బోధనాభాషగా గుర్తించింది. కాని బోధించడానికి పాఠ్యగ్రంథాలు లేవు. మాతృభాషాప్రాంతంలోని జీవభాషను బోధించగల ఉపాధ్యాయులు లేరు. తెలుగు సంగీతాన్ని విందామంటే, తెలుగు చిత్రాలు అటుపోవు. తెలుగు గ్రామఫోన్ రికార్డులు విని ఆనందించే భాగ్యం వారికిలేదు. మాతృదేశంనుంచి ఉపాధ్యాయులను పిలిపించుకొని ప్రయోజనాన్ని పొందగల ఆర్థిక స్తోమతు ఆంధ్ర మహాసభకిలేదు. భారత ప్రభుత్వ ప్రతినిధి సౌజన్యంతో అందచేయబడే 'ఆంధ్ర పత్రిక', 'భారతి' తెలుగుదేశపు సమకాలీన చరిత్రను చెబుతూంటాయి మారిషస్ ఆంధ్రులకి.

ఇట్టి సంస్థలకి సహాయం చేయజాలకపోతే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అంటూ వేరే దేనికి మనకి? ఎవరిని ఉద్ధరించడానికి? ఇతర దేశాల్లో సంస్థలకు సహాయం చేయడం రాష్ట్రప్రభుత్వానికి



ప్రపంచ ఆరోగ్య దినోత్సవాలను పురస్కరించుకొని, యీనెల 7 వ తారీకున హైద్రాబాద్ పురవీధుల్లో పెద్ద ఊరేగింపు జరిగింది. (కుడివైపు) ఈ సందర్భంలో ఏర్పాటైన బహిరంగసభలో రాష్ట్ర నీటివసరుల శాఖమంత్రి శ్రీ జె. వి. నరసింగరావు ఉపన్యసించారు.

★ రాజధాని కబుర్లు ★

తగదని వాదించే వ్యక్తులు, ఈ సమస్యను పునః పరిశీలనం చేయాలి.

శ్రీ అప్పన్న ఒకసంవత్సరం వరకు తెలుగుదేశంలో పర్యటించవచ్చు. పర్యటించి, మారిషస్ ఆంధ్రులకి మన సానుభూతి సహకారాలను అంద చేయవచ్చు. అకాడమీ సభ్యుల ప్రయాణపు బత్తేలతో నిరతము సతమత మౌతున్న విద్యాశాఖ సహాయం చేయక పోయినా, మారిషస్ ఆంధ్రులకు అండగా నిలవవలసిన బాధ్యత ఆంధ్రులు విస్మరించరాగు. రాజమండ్రి, కాకినాడ, విజయనగరం, విశాఖపట్నం, బందరు, బెజవాడ గుంటూరు, నెల్లూరు ముందుకు రావాలి.

విశాఖపట్టణం అదృష్టం

ఇంతవరకు హోంశాఖలో డిప్యూటీ కార్యదర్శిగా పనిచేస్తున్న శ్రీ పర్నా వెంకటేశ్వరరావు విశాఖ జిల్లా కలెక్టరు పి. ఏ. గా నియమితులయ్యారు. ఉన్నతాధికారిని ఒకర్ని తెచ్చి, క్రింది పదవికి అకారణంగా నియమించిన ప్రభుత్వానికి విశాఖజిల్లా వాసులు కృతజ్ఞతలు చెప్పుకోవాలి.

హైదరాబాదు ప్రభుత్వకాలంలో శ్రీ పర్నా సమర్థులూ, సౌమ్యులు ఐన అధికారిగా గుర్తింపబడ్డారు. నల్లగొండజిల్లాకలెక్టరుగా పనిచేశారు. రామకృష్ణరావు మంత్రివర్గం కాలంలోనే ఐ. ఏ. ఎస్. శ్రేణిలో తీసుకోనబడవలసింది. మంత్రివర్గ రాజకీయాలను అర్థం చేసుకోడం కష్టం—అప్పటికీ, ఇప్పటికి కూడా.

రాజధాని సాంస్కృతిక కార్యక్రమాలలో శ్రీ పర్నా విశిష్టమైన పాత్ర నిర్వహించారు. దేవాలయాల పునరుద్ధరణ కార్యక్రమంలో శ్రద్ధచూపించారు. డిప్యూటీ సెక్రటరీగా వీరిపైన ఆరోపణలు ఏమీలేవు. అంతకుముందూ లేవు. మరి అకారణంగా క్రింది పదవికి పంపడానికి కారణాలేవో ప్రభుత్వం తెలుపుకోవాలి.

జిల్లాబోర్డు అధ్యక్షుల ఇంటికి కూరగాయలు కొనిపోని ఉపాధ్యాయులను పల్లెటూళ్ళకు బదిలీ చేసేవారు పూర్వం. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఆ స్థాయికి దిగజారితే ఏం చెప్పాలి?

ఐతే—విశాఖజిల్లాలో ఏదో ఉపద్రవకరమైన పరిస్థితి ఉండుండాలి. కలెక్టరు శ్రీ ఐ. జె. నాయుడు సమర్థులు. వారొక్కరు అక్కడ చాలకనే ప్రభుత్వం ఈ నియామకం చేసిందేమో! ఏది ఎట్లా ఉన్నా, హైదరాబాదు దురదృష్టం, శ్రీపర్నా దురదృష్టం - విశాఖపట్టణం అదృష్టంగా పరిణమించింది. ★

రాజనీతినిపుణుడు డలెస్

అమెరికా విదేశాంగ మంత్రి పదవికి అనారోగ్యకారణంవల్ల రాజీనామా ఇచ్చిన జాన్ ఫాస్టర్ డల్లెస్ గడిచిన 50 సంవత్సరాలుగా అంతర్జాతీయ వ్యవహారాలలో సుదీర్ఘానుభవంగల వ్యక్తి. ఈ అర్ధశతాబ్దంలోనూ ఆయన అత్యంత ఆసక్తితో ప్రపంచ వ్యవహారాలలో పాల్గొంటున్నారు. 1953 నుంచీ ఇప్పటివరకూ అమెరికా విదేశాంగ మంత్రిగా దేశపు విదేశాంగ వ్యవహారాలలో కీలకశక్తిగా ఉంటూ వచ్చారు.

"శాంతియుత ప్రపంచం అంటే అభిప్రాయ భేదాలను సహించగల ప్రపంచం గాని, వాటిని దౌర్జన్యపూరితంగా తొలగించజూచే ప్రపంచం కాదు" అన్నది శ్రీ డలెస్ విశ్వాసం. ఆయన 1950 లో వ్రాసిన "యుద్ధము లేక శాంతి" (వార్ ఆర్ పీస్) అన్న గ్రంథంలో తన ఈ ప్రబల విశ్వాసాన్ని వ్యక్తపరిచారు. విదేశాంగమంత్రిగా ఎన్నో ప్రపంచ సమస్యలకు శాంతియుత పరిష్కారాల కోసం ఆయన కృషిచేశారు. ప్రెసిడెంట్ ఐసెన్‌హోవర్ శ్రీ డలెస్ రాజీనామా విషయం ప్రపంచానికి వెల్లడిస్తూ ఆయన "శాంతి ప్రియుడు" అని పేర్కొన్నారు.

విదేశాంగ మంత్రిగా శ్రీ డలెస్ ప్రపంచ శాంతికి విరామమెరుగని కృషి చేశారు. 1958 లో జబ్బుపడే నాటివరకు ముఖ్య అంతర్జాతీయ సమావేశాలన్నిటిలోనూ అమెరికా పక్షాన ఆయనే పాల్గొంటూ వచ్చారు. జెనీవాలో 1955 లో అధినాయక సమావేశం జరిగినప్పుడు ప్రెసిడెంట్ ఐసెన్‌హోవర్‌కు శ్రీ డలెస్ ప్రధానసలహాదారుగా పనిచేశారు. పెనామాలో 1956 లో జరిగిన అమెరికన్ రిపబ్లిక్‌ల అధ్యక్షుల సమావేశంలో కూడా డల్లెస్ ఈవిధి నిర్వహించారు. 1957 లో ఉత్తర అట్లాంటిక్ సంధి రాజ్యాల ప్రభుత్వాధినేతల సమావేశంలో కూడా ప్రెసిడెంట్‌కు ఈయన సలహాదారుగా వ్యవహరించారు. 1958 జనవరిలో జరిగిన బాగ్దాద్ సంధి రాజ్యాల సమావేశంలో అమెరికా తరఫున పరిశీలకుడుగా శ్రీ డలెస్ పాల్గొన్నారు.

మారుతున్న ప్రపంచంలో, శాంతికి మార్గం అన్వేషించే ప్రయత్నాలలో ఆయా ప్రభుత్వ నాయకులను స్వయంగా కలుసుకొని అంతర్జాతీయ వ్యవహారాలు ముఖాముఖిని చర్చించి, తద్వారా మరింత అవ



గాహనను, ఒప్పందాన్ని సాధించే పద్ధతిననుసరించారీయన. ఈ విధంగా రాజకీయ సంభాషణ, సంప్రతింపుల నిమిత్తమై ఆయన అయిదు లక్షల మైళ్ళు ఎప్పుడైనాగాని ప్రయాణంచేసి ఉంటారు. అమెరికా విదేశాంగ మంత్రులలో ముందెవ్వరూ ఇంతగా తిరిగి ఉండలేదు. తనకు ముందు విదేశాంగ మంత్రులుగా ఉన్నవారెవరూ చూడని ప్రదేశాలెన్నిటికో ఆయన ఇట్లా వెళ్ళ వచ్చారు.

తన 30 వ ఏటనే ఆయన గొప్ప ప్లీడరుగా అంతర్జాతీయ ఖ్యాతి సంపాదించారు. మొదటి ప్రపంచ యుద్ధానంతరం 1919 లో వెర్సెయిల్సు శాంతి మహాసభలో ప్రెసిడెంట్ విల్సన్‌కు సలహాదారులుగా వెళ్ళిన అయిదుగురిలో ఈయన ఒకరు. రాజకీయ వ్యవహారాలకోసం అమెరికా ప్రభుత్వం ఈయనను ఇట్లా తన ప్రాక్టీసు అవతల పెట్టించి తీసుకువెళ్ళిన సందర్భాలు ఎన్నో వున్నవి.

1945 లో శాన్ ఫ్రాన్సిస్కోలో ఐక్యరాజ్య సమితి స్థాపన సందర్భంగా జరిగిన సమావేశానికి అమెరికా ప్రతినిధి వర్గంలో శ్రీ డల్లెస్ ఒక సభ్యుడుగా ఉన్నారు. 1946, 1947, 1948, 1950 సంవత్సరాలలో సమితికి అమెరికా ప్రతినిధి వర్గాలలో ఆయన ఉన్నారు. 1948 లో ఆయన అమెరికా ప్రతినిధి వర్గానికి తాత్కాలిక నాయకుడుగా పనిచేశారు. తనకంటే ముందు అమెరికా విదేశాంగ మంత్రులుగా ఉన్నవారికి ముగ్గురికి ఆయన సలహాదారుగా పనిచేశారు. 1945 లో బైరన్సుకీ, 1947లో మార్షల్‌కీ, 1949 లో ఎచిసన్‌కీ సలహాదారుగా పనిచేశారు.

అమెరికా విదేశాంగశాఖకు ఒక సంవత్సరంపాటు సలహాదారుగా పనిచేసిన తరువాత, 1951 లో జపాన్‌శాంతి సంధి సంప్రతింపులు జరపటానికి రాయబారి హోదాలో ప్రత్యేక ప్రతినిధిగా నియమితులైనారు. ఆ ఏడాది సెప్టెంబరు నెలలో శాన్ ఫ్రాన్సిస్కోలో ఈ శాంతి ఒప్పందంమీద సంతకాలు జరిగినవి.

"యుద్ధం అనివార్యం ఏమీ కాదు. అందుకు ఏదో ఒకటి చెయవచ్చును," అని ఒక సందర్భంలో శ్రీ డల్లెస్ వ్రాశారు. ఆయన జీవితచరిత్ర పరిశీలిస్తే శాంతికోసం ఆ ఏదో ఒకటి చేయటానికి ఆయన తనను తాను అంకితం చేసుకొన్నాడని విదితమవుతుంది. ★

విశాఖపట్నం విశేషాలు

రోగులకు రంగునీళ్లు

'ఇది కింగ్ జార్జి ఆసుపత్రి కాదు. ఇది కింగ్ జార్జి గేవ్ యారు' అని కింగ్ జార్జి ఆస్పత్రిలో ఒక ప్రత్యేక శాఖకు ఆధిపత్యము వహిస్తూన్న ఒక డాక్టరుగారు అన్నారు.

విశాఖపట్నం ఆసుపత్రికి ఏంబులెన్స్ కారులు వున్నాయి. ఆ ఏంబులెన్స్ కారులు ఏ సమయంలో పిలిచినా, రోగులకు అందుబాటులో వుండాలి. అయితే ఓనాడు సాయంత్రము ఒకరికి యాంబులెన్స్ కావలసి వచ్చి పిలిస్తే 'ఒకంట అయింది. సూపరింటెండెంటుగారు ఇప్పుడే ఏవో సామానులు తీసుకురావటమునకు వాలేరు స్టేషనుకు పంపించా'రన్నారు. మరోమాటు – రాత్రి ఫోను చేస్తే ఫోను దగ్గరవున్న ఆంగ్లో ఇండియన్ దొరసాని, "డ్రైవరు ఎల్లమ్మతోటలో నిద్రపోతూంటాడు. అతని దగ్గరకు పంపేందుకు మనిషి లేడు" అని జవాబు చెప్పింది. ఇది ఏంబులెన్స్ సుస్థితి.

కొంతకాలం కిందట ఓమాటు ఆసుపత్రిలో మైక్రోస్కోపులు ఊళ్లో మెడికల్ షాపులో దొరికాయన్నారు పోలీసువారు. ఈ మెడికల్ షాపులోకి ఆసుపత్రిలో మందులన్నీ తక్కువ డబ్బులకు రవాణా! అవుటు పేషంట్లకు ఇచ్చేది రంగునీళ్ళు. ప్రయివేటు డాక్టరు దగ్గరకు వెళ్లినా, ఆసుపత్రికి వెళ్ళినా, ఖర్చు ఒకటే. సరిఅయిన తనిఖీ కావాలంటే ఇంటికి వెళ్ళాలిసిందే. [ఇంటి దగ్గర డాక్టర్లు డబ్బు తీసుకోవచ్చును.] డబ్బు రూ. 25 చెల్లించు. ప్రిస్క్రిప్షను ఒస్తుంది. ఆ తరువాత మందు శ్రద్ధగా ఊరికే వస్తుంది.


స్పెషలు వార్డులో చేరితే రోజుకి ఎనిమిది రూపాయలు తీసుకుంటారు. ఈ మధ్య ఓ ఆయన తన భార్యను స్పెషల్ వార్డులో చేర్చాడు. తన అన్నం తను తెచ్చుకుంటున్నాడు. పళ్ళు కూడా మీరే తెచ్చుకోండి, అని అక్కడ నర్సు చెప్పింది.

వాస్తవానికి, రోజుకి రూ. 5 ఖరీదు చేసే భోజనమూ, పండ్లూ స్పెషల్ వార్డు పేషంటులకు ఇయ్యాలి. రెండు రోజులకి డాక్టరు వచ్చి కోప్పడితే, పళ్ళు అన్నిటిలోకి తక్కువ ఖరీదువి, చిన్నపళ్ళు ఏరి పేషంటుకి ఇయ్యటం మొదలుపెట్టారు.


పెద్ద పెద్ద ఉద్యోగస్థుల భార్యలకన్న ఇక్కడ వున్న నర్సులు ఆరోగ్యంగా వుంటున్నారంటే ఆశ్చర్యం ఏమిటి?

కాలేజీ వ్యవహారాలు

ఇక్కడి మిసెస్ ఏ. వి. యన్. కాలేజీ చాలా పురాతనమైనది. వంశానుగతంగా, తమ పూర్వికులే ఈ కాలేజీని స్థాపించారు కనుక శ్రీ అంకితం భానోజీరావుగారు ఈ కాలేజికి ట్రస్టీలలో ఒకరు. ఎవరు ట్రస్టీ



సంస్కృతి సంఘాధ్యక్షులు శ్రీ జి. మంగరాజు.



సంఘ ప్రధాన కార్యదర్శి శ్రీ ఎం.జి.కె. మూర్తి, సహాయకార్యదర్శి శ్రీ మణి.

అయినా కాకపోయినా జిల్లా కలక్టరు కమిటీ అధ్యక్షులుగా – వుండితీరవలసిందే.

ఈ కాలేజి ఈ మధ్యన రోడ్డెక్కింది. కాలేజి తెలుగుశాఖ విషయమూ, అందులో జరుగుతూన్న అవకతవకల విషయమూ, సెనేటులో తీర్మానరూపంగా పెడితే— అప్పటిలో ఉపాధ్యక్షులు, తాము అన్ని విషయాలూ విచారించి క్రమపద్ధతి ఏర్పాటు చేస్తామన్నారు.

కాలేజి హాస్టలులో వార్డెనులు "వంకాయకూర' దగ్గరనుంచీ అపహరిస్తున్నారనే ఫిర్యాదులూ, హాస్టలు డబ్బుతో ధనవంతులైనారనే ఫిర్యాదులు అధ్యక్షులు కలక్టరుగారికి వచ్చాయి.

అంతేకాదు. కాలేజీలో సీటులు కొంత వచ్చినవారికియ్యకుండా వారి ఇష్టమువచ్చిన వారికి ఇచ్చుకుంటున్నారట.

కొంతధనం కాలేజీ అధికారులు అపహరించారని ఒకరిమీద ఒకరు ఫిర్యాదులు చేసుకోవటం అదంతా ఒక అపభ్రంశం కింద దిగింది.

ఈ అపభ్రంశాలకి కారణం తమ కాలేజీ పరిపాలనావిధానాలలో ఉన్న లోపాలే అని మేనేజింగ్ కమిటీసభ్యులు గ్రహించారో లేదో తెలియదు.

కమిటీని త్రోసిరాజని, విశ్వకళాపరిషత్తు సిండికేటూ, ఉపాధ్యక్షులూ ఈ విషయాలు పరిశీలించవచ్చుగదా!

ఓమాటు 'ఈ అపభ్రంశాలు ఎందుకు విచారించరని అడిగితే, శ్రీ లక్కరాజు సుబ్బారావుగారు–కలక్టరు అధ్యక్షుడు–ఆయన చేయలేనిది లేదు – ఆయనకి చెప్పండి' అన్నారు.

అయితే విశ్వకళాపరిషత్తుకు బాధ్యత లేదా ఈ కాలేజీ విషయం?

సంస్కృతి అంటే నాటకాలేనా?

త్రాము సాహిత్యక రంగము– అ సేదృష్టి నటీనటులు మానుకోవలసిన అగత్యం, ఆంధ్రదేశములో నాటక ప్రదర్శనములు ఇవ్వటము వృత్తిగా పెట్టుకున్న నటీనటులు అందరిలోనూ కనిపిస్తూనేవుంది. ఈ విషయము మొన్న ఇక్కడ జరిగిన సంస్కృతి ఉత్సవ సందర్భములో ప్రదర్శించిన నాటకములలో మరింత ద్యోతకమయింది.

నాటకకర్త రాసిన సంభాషణలు మార్చివేసి, స్వకపోల కల్పిత సంభాషణలు నాటకములో ప్రవేశపెట్టటం, తమ చమత్కృతి చూపించటం, పద్మశ్రీ స్థానం నరసింహారావు గారి మొదలు, బి. ఎ., బి. ఎల్., శ్రీ కనక లింగేశ్వరరావుగారి వరకూ పలువురికి అలవాటు వుంది. స్థానం నరసింహారావు గారికి ప్రక్క నటుడికింటె మెరిసిపోవాలనే దృష్టితో చమత్కార స్వకపోల కల్పితములు విసరడం ఓ అలవాటు.

దృశ్యకావ్య లక్షణములేవో, శ్రవ్యకావ్య లక్షణములేవో మర్చిపోయి, శ్రీ పానుగంటి లక్ష్మీ నరసింహారావుగారి— "పాదుకా పట్టాభిషేకము" లో



"విప్రనారాయణ" నాటకంలో దేవదేవిగా నటించిన శ్రీమతి పూర్ణిమ, వెటరినరీ కాలేజీ ప్రిన్సిపాలుగారి భార్య శ్రీమతి పాండురంగ రజితపాత్ర బహూకరిస్తున్న దృశ్యం.

మందరములో వ్రాసిన పద్యాలు చదువుతూ భరతుడిగా కనక లింగేశ్వరరావుగారు రంగస్థలముమీదికి రావటం, కైక తనవాక్ చాతుర్యముచూపడం, నాటకం అపభ్రంశమవడం జరిగింది.

కొందరు నటులు తాము వేతనము పుచ్చుకుంటూన్నందుకైనా, కవిరాసిన పోర్షను తిన్నంగా చదువుకునివస్తే సదస్యులు ఆనందించగలరు. మొన్న జరిగిన "విప్రనారాయణ" ప్రదర్శనములో—విప్రనారాయణ వేషధారిలో ఈలోటు కనిపించింది.

నాటక ప్రదర్శనమునకు హావభావ ప్రదర్శనమూ, వాచికాభినయమూ ముఖ్యము.

(64-వ పేజీ చూడండి)

ఊహాసౌధాల యధార్థదృశ్యాలు

- వి. గాయత్రి -

[మామిడి తోట. అతడు టక్ అప్ చేసికొని టై వేసుకుని నోట్లో సిగరెట్టుతో, జేబులో చెయ్యిపెట్టుకొని, కాచుకొని ఉంటాడు. ఆమె వగులు జరీ, నీలిరంగు జార్జెట్టు చీరా, నడుమూ మెడా వీలైనంత వరకూ బయటికి కనిపించే జాకెట్టూ వేసుకొని మందగమనంతో వస్తుంది.]

అతడు : (చటుక్కున సిగరెట్టు పారేసి) హలో...

ఆమె : (అతడు సిగరెట్టు పారేయడం గుర్తించి, పైట కొంగునిండా కప్పుకొంటు న్నట్లు నటిస్తూ వయ్యారంగా) నమస్తే...

అ : (ఆమె కప్పుకోవడం నటనే నని గుర్తించి) మీరు వస్తారో రారో అనుకొన్నాను.

ఆ : మీరు అతిముఖ్యమైన విషయా లేవో మాట్లాడాలంటే...

అ : నన్ను అపార్థం చేసికోకుండా వచ్చి నందుకు చాలా థాంక్స్. మనం విద్యావంతులం కనుక, జీవితమంతా గడపవలసిన భాగస్వామిని ఎన్నుకొనేటప్పుడు, ఏదో పెద్దలు నిశ్చయించారు కదా అని ఊరుకోకుండా పరస్పరం అభిప్రాయాలూ ఆశయాలూ తెలుసుకోవడం అవసరమని నా నమ్మకం. పాశ్చాత్యులు ఎన్నో రోజులు ఒకరితో ఒకరు కలిసిమెలిసి ఉండి పరస్పరం అర్థం చేసికొంటేనే గాని పెళ్ళిమాట తలపెట్టరు.

ఆ : కాని మన సమాజంలో పెళ్ళికాని స్త్రీపురుషులు మర్యాదగా కలుసుకొనే అవకాశాలేవీ? నా స్నేహితురాళ్ళలో ఒకరిద్దరికి పెళ్ళికి ముందు వారి భర్తలతో పరిచయం కలిగిందని విన్నా కూడా నాకు అటువంటి అవకాశం లభిస్తుందని నేను కలలో కూడా అనుకోలేదు.. మరి... నే నలాగ వచ్చినట్లు ఎవరికైనా తెలిస్తే బాగుండదు.

అ : మిమ్మల్ని ఎక్కువసేపు ఉంచడం నాకూ ఇష్టంలేదు. అటు ఆ చెట్టు క్రింద కూర్చుని మాట్లాడుకొందాం రండి.

అ : (మౌనం)

ఆ : (మౌనం)

అ : (గొంతు సవరించుకొని) మీరు నన్ను అపార్థం చేసుకోకండి, ఏవో షరతులు పెడుతున్నానని అనకోవద్దు. నా జీవిత సహధర్మచారిణి ఏలాగ ఉండాలని నా ఉద్దేశమో నేను చెప్తాను .. ... మీకు తెలుసునను కొంటాను. నేను కొద్దిగా చిత్రాలు వేస్తాను.

ఆ : "కొద్దిగా" అని చెప్పుకోవడం వినయమనుకొంటాను. మీ ప్రసిద్ధ చిత్రాలు పత్రికల్లో చూసి నేనెంతో తన్మయత్వం చెందాను. చిత్రకళలో మంచిచెడ్డలు నాకు తెలియవనుకోండి. అయినా మీ చిత్రాలు నాకు చాలా ఇష్టం

అ : నా జీవితంలో భగవంతుడిచ్చిన ఈ గిఫ్టు వృధా కాకూడదనీ, సాధ్యమైనంతవరకూ అభివృద్ధికి రావాలనీ నా ఉద్దేశం. నా ఈ జీవితాశయంతో నా సహధర్మచారిణి సహకరించి, నాలో నిరుత్సాహం ప్రబలితే దాన్ని పోగొట్టి, ఉత్సాహపరిచి కర్తవ్యం వైపు నన్ను నడిపించాలని నా ఆశ.

ఆ : చిత్రకళలో లోతుపాతులు నాకు అట్టే తెలియవు కనుక, మిమ్మల్ని ఎలాగ ఉత్సాహపరచగలనో నేను చెప్పలేను కాని, నిరుత్సాహపరచి మీ జీవితశయం నుండి ప్రక్కదారులు మాత్రం పట్టించనని నిశ్చయంగా చెప్పగలను. మీ సాంగత్యంవల్ల చిత్రకళలో అభిరుచి నా కేర్పడగలదని నమ్ముతున్నాను.

అ : మరొకటి... చిత్రకారులు సాధారణంగా అందంగా నాజూగ్గా ఉండే భార్యలనే ఎందుకు కోరుతారో మీకు తెలిసే ఉంటుంది......

ఆ : (సిగ్గుపడుతూ) అంటే ... మోడల్సుగా ఒకొక్కసారి..

అ : నా ఉద్దేశం సరిగ్గా గ్రహించారు. కొందరు విద్యావతులు తమ చిత్రాలు ప్రపంచానికి వెల్లడి అవడం ఆత్మాభిమానం కోల్పోవడంగా భావిసారు.. మీ కటువంటి అభి ప్రాయాలూ అవీ..... (నవ్వేస్తాడు.)

ఆ : దానికేముందీ?.. మీరు పైకి రావడానికి నేనొక కారణాన్ని అయితే అంతకంటే కావలసినదేముందీ? ఐనా మీ పిచ్చి



కాని భర్త పైకి రావాలని ఏ భార్య అనుకోదూ.. ప్రతి భారతీయవనితా తన శక్తి వంచన లేకుండా కష్టపడుతుంది భర్తా బిడ్డలూ పైకి రావడానికి.

అ : మీరు సహృదయులు. నా ఆశలకు తగిన వ్యక్తి లభించడం నా అదృష్టం.

ఆ : (పొంగిపోతూ) మీరు చెప్పేరు కనుక నేనూ ఒక విషయాన్ని చెప్తాను... నాకు కథలు వ్రాయడం అంటే చాలా ఇష్టం.

అ : అవును. మొన్న పత్రికలో మీరు వ్రాసిన కథ ఒకటి చూశాను.

ఆ : చదివారా? ఏమైనా లోటుపాటులున్నాయా? ఏదైనా బాగా లేకపోతే, చెప్తే దిద్దుకొంటాను.

అ : బాగాలేకేం. బాగుంది. పెళ్ళి చదువూ, పెళ్ళి సంగీతాల్లాగ కాకుండా మీ రిది బాగా వృద్ధిచేసుకోవాలని నాకోరిక.

ఆ : నేనూ అదే కోరేది. మగవారు ఎలాగైనా వాళ్ళకి కావలసినవి చెయ్యగలరు. స్త్రీకి తగిన ప్రోత్సాహం లేకపోతే వెనకబడి పోతుంది.

అ : ఓ. దానికేం. తప్పకుండా తర్వాత, మీకు డబ్బూ హోదా మొదలైన వానిమీద వ్యామోహం లేదని భావిస్తాను. ఎవరి పనులు వారు చేసుకోవడం డిగ్నిటీకి భంగం అనుకోరని ఆశిస్తాను. ఏమంటే పనివాళ్ళని పెట్టి చేయించే అంత పెద్ద ఉద్యోగం కాదు నాది.

ఆ : మా ఇంట్లో మా పని మేము చేసుకోవడం లేదూ. ఇంతగా చెప్పాలా మీరూ... అన్నట్లు సినిమాలకి వెడతారా మీరూ? అసలు తెలుగు సినిమాలు చూడడం ఇష్టమేనా?

అ : మంచి ప్రశ్నే వేశారు, సినిమాలంటే నాకు వెర్రివ్యామోహం లేదు. సాధారణంగా తెలుగు సినిమాలు మంచివిరావు. కనుక తెలుగు కంటే నాకు హిందీ, ఇంగ్లీషూ అంటే ఇష్టం. అలాగ అని మంచిదైతే తెలుగు సినిమా అని మానేస్తాననుకోకండి.

ఆ : మంచిదైతే రెండుమూడు సారయినా నాకు విసుగుండదు కాని, చెత్త సినిమా ఒక్కసారి కూడా నేనూ చూడలేను. ఎందుకడిగానంటే మా అన్నయ్యకి తెలుగు అనగానే బాగుండదని ఒక అపోహ. దాని వల్ల, ఎంతమంచిది అవనివ్వండి చూడడు...

. (దూరంగా చూస్తూ) సూర్యాస్తమయం చూడండి ఎంత అందంగా ఉందో! చెట్ల ఆకుల్లోంచి మనతో దోబూచులాడుతున్నట్లు......

అ : ఓహ్! మీకూ ప్రకృతి దృశ్యాలంటే ఇష్టమేనా? ఇటువంటి సుందర ప్రకృతి గంటల తరబడి చూస్తూ నన్ను నేను మరచిపోయి ఆనందించడం అంటే నాకెంతో ఇష్టం. చిత్రకారుణ్ణి అవడం వల్ల



★ ఊహాసౌధాల యథార్థదృశ్యాలు ★

శా అభిరుచి ఇలాగ ఉందేమో అనుకొన్నాను. రచయిత్రి అయిన మీకూ ఇదే ఇష్టమని గుర్తించలేక పోయాను. నిజంగా భగవంతుడు మనిద్దరినీ ఒకరికోసం ఒకరిని పుట్టించాడనుకొంటాను. లేక పోతే ఆదర్శాలూ, ఆశయాలూ, అభిరుచులూ ఇలా కలవడం బహుకష్టం.

ఆ: మనిద్దరం ఈడూజోడూ బాగుందని ఇంట్లో అనుకొంటూ ఉంటే రూపంలో ఒకలాగ ఉన్నామని సంతోషపడ్డాను. మన అభిప్రాయాలూ, అవీ కూడా ఒకటవడం చాలా ఆశ్చర్యంగా ఉంది.

అ: అంతేకాక సిగ్గుపడి ఊరుకోకుండా మీ అభిప్రాయాలు దాపరికం లేకుండా వెల్లడి చెయ్యడం నాకు చాలా ఆనందాన్ని కలుగజేసింది.

ఆ: నాకు మనస్సులో ఒకటీ పైకి మరొకటీ చెప్పడం అసహ్యం. ఈ విషయంలో కూడా మనిద్దరి అభిప్రాయాలూ ఒకటవడం ఆశ్చర్యమే!

అ. నేను చాలా అదృష్టవంతుణ్ణి. అసలు మీరు నాకోరిక మన్నించి ఇక్కడ ఇలాగ కలుసుకోగలరని......

ఆ: ఇంక చీకటి పడుతోంది. పెళ్ళి అయ్యే ఈ పదిరోజుల్లోగా...ఇక తొందర పడకండి. మనం ఇలాగ కలుసుకొన్న సంగతి పెద్దలకి తెలిస్తే బాగుండదు.

అ. చెప్పానుకదూ! మీ ఉద్దేశా లెలాగ ఉంటాయో తెలుసుకోవాలనీ, ఏదో భగవంతుడూ, విధీ అని గుడ్డిగా నమ్మేయకుండా జీవితాంతం ఉండే ఈ సంబంధం ఏర్పరచుకొనే ముందు ఒకరి నొకరు అర్థం చేసుకోవాలన్న ఉద్దేశంతో సాహసించాను.

ఆ: అందుకే మీ సాహసాన్ని ఆమోదించి నేనూ ఇలాగ రాగలిగాను. ఇంక నాకు సెలవిప్పిస్తారా?.. నమస్తే!

అ: ఇక పదిరోజుల్లో మనం ఎలాంటి జంకూ లేకుండా స్వేచ్ఛగా కలుసుకోగలమని ఆశిస్తున్నాను. గుడ్ నైట్. (ఆమె కొంచెం దూరం వెళ్ళేక) స్వీట్ డ్రీమ్స్! [అని చెయ్యి ఊపుతూ ఆమె కనిపించే వరకూ చూసి, తర్వాత ఈల వేసుకొంటూ జేబులోంచి సిగరెట్టుతీసి షోగ్గా కాలుస్తూ వెళ్ళిపోతాడు.]

2వ దృశ్యం

[6 నెలల తరువాత ... సా॥ 5 గంటలు]

అ: లక్ష్మీ! లక్ష్మీ! (తలుపు తడుతూ)

ఆ: ఆఁ...వస్తున్నా (తలుపు తీస్తుంది)

అ: (ఉస్సూరుమని పడకకుర్చీలో కూలబడి) అబ్బబ్బ. కాఫీ అయిందా?

ఆ· అయిపోయింది. ఐదు నిముషాలు ఆగండి, తెస్తున్నా (అంటూ లోపలికి పోబోతుంది.)

అ: (విసుగ్గా) లక్షసార్లు చెప్పేను. నేను వచ్చేసరికి కాఫీ రెడీగా ఉంచమని. పంచభక్ష్యపరమాన్నాలు చేసిపెట్టమని కోరలేదు. చచ్చిచచ్చి వచ్చేవాడికి రాగానే గుక్కెడు కాఫీ పొయ్యడానికి గింజుకు పోవడం...

ఆ: (లోపలికి పోబోయేది వెనక్కి తిరిగి విసురుగా) గింజుకుపోవడమట. ఏం? స్టౌవ్ కొని ఇచ్చారా? ఫ్లాస్కు కొనమని రెండు నెలలుగా మొత్తుకొంటున్నాను. కాఫీ చేసి పెట్టేసి మళ్లీ వెచ్చబెడితే వాసనా...పాలు ఎక్కువ మరిగితే కంపూ...మీ డిపోవాడు ఐదుగంటలకి కొని పాలే తేడూ. కొంచెం పాలుపొంగురావాలా? రాగానే కలిపి ఇస్తాను. మరీ నోట్లోమాట నోట్లో ఉండగానే అవాలంటే ఎలాగండీ?

(53-వ పేజీ చూడండి)

ఇంటింటా దేవతలను వెలయించిన

ప్రతిభాశాలి రవివర్మ

రామ పరిత్యక్తయై వనవాసం చేస్తున్న సీత, హంసకు సందేశ వాక్కులు చెబుతున్న దమయంతి, పద్మపత్రంపై ప్రేమలేఖ రాస్తున్న శకుంతల, పురూరవుణ్ణి విరహంలో ముంచి వెళ్లిపోతున్న ఊర్వశి, విశ్వామిత్రునికి తపోభంగం కావించిన మేనక, చదువులతల్లి సరస్వతి, ఆశ్రితకల్పవల్లి లక్ష్మి ఇంకా ఎందరో పురాణకథానాయికలు, దేవీమూర్తులు; గంగావతరణం, శివధనుర్భంగం వంటి మహత్తర దృశ్యాలు; మలయాళ, తమిళ సుందరీ మూర్తి చిత్రాలు—ఇలా ఎన్నైనా చెప్పుకుపోవచ్చు రవివర్మ కుంచెనుంచి పుంఖానుపుంఖంగా వెలువడిన వర్ణచిత్రాలను. కొన్ని దశాబ్దాలపాటు భారతీయచిత్రకళా రంగాన్ని ఏలిన ఏకైక చిత్రకారుడు రవివర్మ. ఒకప్పుడు ఈయన వేసిన చిత్రాలులేనిగృహం భారత దేశంలో ఉండేది కాదనటం అతిశయోక్తి కాదు. ఏ ఇంట చూచినా లక్ష్మి పటమో, సరస్వతిపటమో, సతీసుత సమేతుడైన శివునిపటమో ఏదో ఒకటి ఉండేది. ఒక్కొక్క బొమ్మ కేసి, అపూర్వవర్ణ సమ్మేళనం కేసి, చక్కని దృశ్యాలకేసి చూస్తుంటే పెద్దలకేమిటి, పిల్లలకేమిటి ఆలోచనకు, పారవశ్యానికి, కావలసినంత మేత దొరికేది.



భారతదేశపు మైకెల్ ఏంజిలో అనిపించుకున్న రాజా రవివర్మ (29 ఏప్రిల్ 1848 - 5 అక్టోబరు 1906)

దేవతలను, దానవులను, మానవులను లెక్కలేకుండా, లెక్కలేనన్ని రకాలుగా చిత్రించి దేశం మీదికి విరజిమ్మి కీర్తి లక్ష్మినీ, ధనలక్ష్మినీ కైవసం చేసుకున్న ఈ చిత్రకారుడు 111 ఏళ్ళక్రితం ఇప్పటి కేరళ రాష్ట్రంలోని కొట్టాయం పట్టణానికి 24 మైళ్ళ దూరానఉన్న కిలిమన్నూర్ అనే గ్రామంలో కులీన కుటుంబంలో జన్మించాడు. ఆ గ్రామం రవివర్మ వంశీయులదే. తిరువాన్కూరు మహారాజుల కన్యలను కిలిమన్నూర్ వంశీయులకే ఇచ్చి వివాహం చేయటం పరిపాటి. ఆ విధంగా రవివర్మవంశానికీ తిరువాన్కూరు రాజవంశానికీ రెండు శతాబ్దాలకుపైగా బంధుత్వం ఉన్నది.

ఈ ప్రభువంశంలో చిత్రకారులకు, కవులకు కొదవ లేదు. పువ్వు పుట్టగానే పరిమళించినట్లు రవివర్మ చిన్ననాటినుంచే చిత్రకళమీద ఆసక్తి చూపించేవాడు. అయిదో ఏట బళ్ళోవేస్తే అక్షరాలు రాసేబదులు బొమ్మలుగీస్తూ కూర్చునేవాడు. కాలక్రమాన బడిలో పంతుళ్ళకేకాక, ఇంట్లో పెద్దలకు కూడా తలనొప్పిగా తయారయ్యాడు. శుభ్రమైన గోడలనిండా సుద్దబొమ్మలే, బొగ్గుబొమ్మలే. ఇలాబొమ్మలు వెయ్యటం పురుషలక్షణంకాదని రవివర్మను యోధుడుగా తయారు చెయ్యాలని పెద్దలు ప్రయత్నించారు.

కాని రవివర్మ పినతండ్రి రాజా రాజవర్మ అనే ఆయన స్వతహాగా చిత్రకారుడు కావటం రవివర్మకు చాలా సహాయకారి అయింది. ఆయన ఇతనిపక్షం వహించి ప్రోత్సహించాడు తనకు తెలిసిన విద్యఅంతా బోధించాడు. ఒకసారి తనతోపాటు త్రివేంద్రం తీసుకునివెళ్ళి మహారాజాకు పరిచయంచేశాడు. అప్పటికి రవి వర్మకు 14 ఏళ్లు. అతనిబొమ్మలు చూసి ప్రాయంలో చిన్నవాడైనా అభిప్రాయంలో పెద్దవాడే నని మహారాజా ఆశ్చర్యపడి, ఆనందపడి తన ఆస్థానంలో ఉండిపొమ్మని కోరారు.

తిరువాన్కూరు సంస్థానంఅంటే కళలకు కాణాచి. అక్కడ చాలామంది చిత్రకారులుండేవారు. వారిలో కొందరు రవివర్మను

కె. ఆర్. ఎస్. స్వామి



రామపరిత్యక్తయై వనవాసంచేస్తున్న సీత.
(మద్రాసు మ్యూజియంలోని చిత్రం).

★ ప్రతిభాశాలి రవివర్మ ★

అతని బొమ్మల్ని ఈసడించేవారు. ముఖ్యంగా రామస్వామి నాయుడనే ప్రముఖచిత్రకారుడికీ, రవివర్మకీ ఒక్క క్షణం పడేదికాదు. మహారాజా చాలాసార్లు జోక్యంచేసుకుని వారికి రాజీకుదిర్చేవారు.

1866 లో రవివర్మ మహారాజా కడగొట్టుచెల్లెల్ని వివాహమాడాడు. ఈ బంధుత్వంతో రాజాస్థానంలో అతని పలుకుబడి హెచ్చింది.

1868 లో థియొడోర్ జెన్సన్ అనే ఇంగ్లీషు చిత్రకారుడు మహారాజాకు కొన్ని చిత్రాలు వేసివ్వటానికి త్రివేంద్రం వచ్చాడు. అతడు చిత్రాలువేస్తుంటే రవివర్మ చూస్తూకూర్చునేవాడు. తైలవర్ణాలతో చిత్రాలు లిఖించేపద్ధతి మొదటిసారిగా చూసి రవివర్మ ముగ్ధుడైపోయాడు. తనకా కళ నేర్పమని ఇంగ్లీషుచిత్రకారుణ్ణి కోరాడు. కాని 'ఈకుర్రాడికి బొమ్మలువెయ్యటం నేర్పటమేనా నాపని'అని జెన్సన్ తిరస్కరించాడు. 'నా స్టూడియోలోకి రావ'ద్దని కసిరికొట్టాడు. అప్పుడు మహారాజా మళ్ళీ కలగజేసుకోవటంతో, తను చిత్రాలు వేస్తుంటే చూస్తూఉండటాని కతడు అనుమతించాడు.

ఆనాటినుంచీ రవివర్మ చిత్రకళాజీవితం ప్రారంభమైంది. జెన్సన్ త్రివేంద్రంనుంచి వెళ్ళిపోయాక అతడు తైలవర్ణాలతో ఎన్నో రకాలుగా బొమ్మలు వేయనారంభించాడు. 1873 లో తిరువేంద్రంలోని బ్రిటిష్ రెసిడెంట్ సలహామీద మద్రాసులో జరుగుతున్న ఒక చిత్రప్రదర్శనానికి రవివర్మ తాను వేసిన "నాయర్ వనిత" చిత్రాన్ని పంపించాడు. దానికా ప్రదర్శనంలో మొదటిబహుమతిగా 'గవర్నర్సు మెడల్' వచ్చింది. గవర్నరు ఆ చిత్రం చూసి రవివర్మను గవర్నమెంట్ భవనానికి పిలిపించి స్వయంగా మెచ్చుకున్నాడు. తరవాత రవివర్మ ఆ చిత్రాన్ని వియన్నాలో లలితకళా ప్రదర్శనానికి పంపించాడు. అక్కడా దానికి అమోఘప్రశంసవచ్చింది. ఆ తరవాత రవివర్మ "తమిళవనిత" అనే చిత్రం వేశాడు. ఈ రెండుచిత్రాల్ని తిరువాన్కూరు మహారాజా 1875 లో త్రివేంద్రం దర్శించిన ప్రిన్సాఫ్ వేల్సుకు బహూకరించారు.

చాలామంది చిత్రకారులకు ఉండేది ధనమల్లా కళాధనమే. కాని రవివర్మకు కళ, ధనం రెండూ స్వతహాగా లభించటం అతని విజయానికి ఎంతో దోహదమైంది.

ఆతరవాత అతడిక వరసగా బొమ్మలు గీయటమే పనిగా పెట్టుకున్నాడు. 'ఏం గీయాలి' అని ఆలోచించటానికి నిమిషమైనా వ్యవధి ఇవ్వని పురాణకథలమీద, కావ్యకథలమీద పడ్డాడు ఈ వరసలో అతడు రచించిన మొట్టమొదటిచిత్రం శకుంతల దుష్యంతుడికి ప్రేమలేఖ రాస్తున్న మనోహరఘట్టం. ఈచిత్రం 1878 నాటిది. దీన్ని బకింగ్ హాం ప్రభువు కొనుక్కున్నారు. అంతకుముందు బకింగ్ హాం ప్రభువు తన రూపచిత్రాన్ని వేయమని ఒక ఇంగ్లీషు చిత్రకారుణ్ణి పురమాయించాడు. ఆ ఇంగ్లీషాయన 18 సిటింగ్సు తీసుకునికూడా చిత్రం సరిగా వేయలేకపోయాడు. బకింగ్ హామ్‌కు విసుగుపుట్టి రవివర్మను పురమాయించాడు. రవివర్మ ఒక్క సిటింగ్‌లోనే ఆ ప్రభువుకు నచ్చేవిధంగా రూపచిత్రం పూర్తిచేసిఇచ్చాడు.

ఆ తరవాత తిరువాన్కూరు మహారాజా కోరికపై రవివర్మ సీతావనవాసచిత్రం రచించాడు. ఆ చిత్రం ఎంత అందమైనది అంటే చూసీచూడగానే అప్పటి బొంబాయి గవర్నర్ సర్ జేమ్స్ ఫెర్గుసన్ దాని ప్రతికృతి ఒకటి తనకు కావాలని కోరాడు.

ఆ పిమ్మట రవివర్మ బరోడా మహారాజా కోరికపై బరోడావెళ్ళి అక్కడ ఎన్నో చిత్రాలు లిఖించాడు. తరవాత మైసూరు మహారాజా కోరికపై మైసూరులో ఉండి 9 చిత్రాలు వేసిఇచ్చాడు. మహారాజా కృతజ్ఞతా సూచకంగా ఎన్నో ఖరీదైన బహుమతులు, రెండు ఏనుగులు రవివర్మకు బహూకరించాడు.

అప్పటికి రవివర్మ ఖ్యాతి దేశమంతటా, దేశం బయటా విస్తరించింది. అతని చిత్రాలను దూరంనుంచి చూసి ఆనందించటంతో తృప్తిపడక, తమహక్కు భుక్తాలతో ఉంచుకోవాలని ఉబలాటపడేవారు మహారాజాల్లోనూ, గవర్నర్లలోనేకాక, సామాన్యుల్లో కూడా ఎక్కువయ్యారు. అయితే ఒక్క చిత్రకారుడు ఎంతమందిని తృప్తిపరచగలడు? ఎన్ని బొమ్మలు వేసి ఎందరి కివ్వగలడు! దీని కేమిటి ఉపాయం? అప్పటి బరోడా దివాను సర్ మాధవరావు ఆ ఉపాయమేదో సూచించాడు. మంచివనుకున్న చిత్రాలు కొన్నిటిని యూరప్ పంపించి ఆలియోగ్రాఫ్ చేయించి తెప్పించమని, 'అవిధంగా నీకేకాక, నీ దేశానికే పేరుతెచ్చిపెట్టినవాడివవుతా'వని ఆయన సలహా ఇచ్చాడు. ఆ సలహాతో రవివర్మకు ఒకఉపాయం తట్టింది. బొంబాయిలో యూరపియన్ పర్యవేక్షణ క్రింద ఒక ఆలియోగ్రాఫిక్ ప్రింటింగ్ ప్రెస్ స్థాపించాడు. ఆ ప్రెస్‌నుంచి ఎక్స్‌ప్రెస్ వేగంతో రవివర్మచిత్రాలు వెలువడి వెల్లువగా దేశాన్ని ముంచెత్తాయి.

రవివర్మకుమారుడు శ్రీ రామవర్మ రాజా చెప్పినదాన్ని బట్టి ఆయన ఒక్కొక్క నిలువెత్తు రూపచిత్రానికి రూ. 1500 నుంచి 2000 వరకూ పుచ్చుకు నేవాడట.

రవివర్మవేసిన చిత్రాల ఒరిజినల్స్ ఆయన స్వగ్రామమైన కిలిమన్నూర్‌లో చాలా ఉన్నాయి. త్రివేంద్రంచిత్రాలయంలో, బరోడా, మైసూరు, ఉదయపూర్ రాజభవనాలలో, హైదరాబాదు సాలార్‌జంగ్ మ్యూజియంలో, న్యూఢిల్లీ నేషనల్ గాలరీ ఆఫ్ మోడరన్ ఆర్ట్‌లో ఇంకా ఎన్నో చోట్ల పదిలపరచబడిఉన్నాయి. కాని వీటన్నిటిలో శకుంతల ప్రేమలేఖా చిత్రమూ, "దారిద్ర్యం" అనే మరొక చిత్రమూ ఉత్తమమైనవని చిత్రకళా విమర్శకులు పేర్కొన్నారు.

రవివర్మ కీర్తి ఉచ్ఛదశలోఉన్న రోజుల్లో ఆయన్నిగూర్చి బోలెడుకథలు చెప్పుకునేవారు. ఆయనకి దేవతలు ప్రత్యక్షమయ్యేవారనీ, అందుచేతే అంత సునాయాసంగా, అనితరసాధ్యమైన మార్గంలో దేవతాచిత్రాలు వేయగలిగేవాడనీ జనం అనుకునేవారు. ఇది కట్టుకథగా త్రోసిపుచ్చినా ఒకటిమాత్రం నిజం. ఒక వయస్సులో ఉన్న జనం రవివర్మచిత్రాలు చూస్తూ దేవతలంతే ఇలాగే ఉంటారని అనుకునేవారు; దేవతారూపాల్నిగూర్చి వారిభావన ఆ చిత్రాల దగ్గిరకొచ్చి ఆగిపోయేది.



వధువు అలంకరణం.

మాట్లాడని మల్లెమొగ్గ

"నువ్విన్ని చెప్పినా నాన్నా, నాకా పిల్ల నచ్చలేదు. నువ్వు వెంటనే వాళ్ళకి ఉత్తరం వ్రాసేయడం మంచిది', అన్నాడు రంగనాథం

'ఆ పిల్లకేం తక్కువొచ్చిందని? అందానికేం లోటులేదు, అడిగినంత కట్నమిస్తానన్నారు. అయినా, నీకింత మూర్ఖపు పట్టుదల కూడదురా. మీ అమ్మేమో మంచం పట్టింది. కోడలు త్వరగా రావాలన్న బెంగ తప్ప, దానికింకే కోరికా లేదు. నీ పెళ్ళి ఎంత త్వరగా అయితే అంత మంచిది. అటుపైన నీ యిష్టం' అన్నాడు గంగాధరం గారు.

'నీ మాటను వ్యేగాని, నా మాట వినిపించుకోకపోతే ఎలా నాన్నా? పిల్లయితే బాగానే ఉంది. నేకాదనటల్లేదు గా. కాని కంఠం అచ్చు మొగవాడి గొంతుకలా ఉంటుంది. ఆడుదన్న తర్వాత, కంఠస్వరం కాస్తయినా శ్రావ్యంగా లేకపోతే ఎంత ఏవగింపుగా ఉంటుందో ఆలోచించావా?'

'లేకపోతే, మధుర గానాలు చేసే అమ్మాయిలు కావాలంటే, ఎలా వస్తార్రా?' గంగాధరం గారు కొంచెం చిరాకుగా అన్నారు.

'అక్కడే నువ్వు పొరబడుతున్నావ్ నాన్నా. పాట రావాలని నేననలేదే. కంఠస్వరం సున్నితంగా ఉంటే చాలన్నాను. అయినా, ఎందుకిన్ని మాటలు? ఈ సంబంధం విషయంలో మటుకు నన్ను క్షమించు'.

'సరే! నీకు నచ్చిన పిల్లను నువ్వే చూసుకో. పెళ్ళికి నేనభ్యంతరం పెట్టను. కాని వీలయినంత త్వరలో నువ్వో యింటివాడివయితే నీ తల్లిహృదయం సంతోషిస్తుంది'.

* * *

"గవర్నరుపేటలో..... కృష్ణమూర్తిగారమ్మాయిట. నాకు నచ్చింది నాన్నా. నువ్వెళ్ళి సంబంధం స్థిరపఱచుకొని వస్తే మంచిది" అన్నాడు, ఓరోజున రంగనాథం. ఆపిల్ల తల్లిదండ్రులు తన దగ్గరకు రావాలన్న పట్టింపు లేకపోవడంవల్ల గంగాధరం గారు వెంటనే బయలుదేరారు. 'ఆ పిల్ల గొంతుక

"పూరణ్"

పాట......' కొస్త హేళనగానే అన్నారు గంగాధరం గారు వెళ్ళేముందు.

అవును! తనకేం తెలుసు? ఆ పిల్ల కంఠస్వరం ఎలా వుంటుంది? పార్కులో చూశాడు. చాలా అందంగా ఉంది. మనసైంది. పార్కు జవాన్ని అడిగాడు ......

'కృష్ణమూర్తిగారమ్మాయండి,' అన్నాడు అంతకంటే, ఆ పిల్లని గూర్చి తనకేమి తెలియదే! 'ఒకవేళ ఈ అమ్మాయి కంఠస్వరం కూడా విన సొంపుగా లేకపోతే, నాన్న ఏమనుకొంటాడు?' రంగనాథం కొంచెంగా మథనపడ్డాడు. అంతలోనే, 'ఆఁ, పర్వాలేదు. గొంతుక బాగానే ఉండి ఉంటుంది' అని సర్దుకు పోయాడు.

* * *

పెళ్ళయిన తర్వాత తెలిసింది, పిల్ల మూగదని. 'వాడి ఖర్మ! వాడు అంతే పెట్టి పుట్టాడు' అనుకొన్నారు గంగాధరం గారు. కోడలు గడపలో కాలుపెట్టినా, 'అత్తయ్యా' అని నోరారా పిలించుకొనే అదృష్టం లేనందుకు, మరింత కృశించి పోయింది, మంచం పట్టిన రంగనాథం తల్లి.

తనకు తగిన శాస్తి జరిగిందని సరిపెట్టుకొన్నా, తల్లి హృదయాన్ని వ్యథపఱచినందుకు, ఇప్పటికీ బాధపడుతూనే ఉన్నాడు రంగనాథం. అయితే కొంతమంది స్నేహితులుమటుకు అంటూంటారు. 'రంగనాథం! నీ జీవితమే హాయిరా, నీ మాటకెదురుండదు. నీ భార్య ఒక మాట్లాడని మల్లెమొగ్గ' అని ★


ఆల్జీబ్రా

ఓ చిరుతపులి కళ్ళడాక్టరువద్దకెళ్ళింది.

"బాబూ – నా కళ్ళకేదో వచ్చినట్టుందండీ. మా ఆవిడవైపు చూస్తే కళ్ళముందు మచ్చలు కనబడుతున్నాయండీ"

డాక్టరు: అదేవిటయ్యా! చిరుతపులి పెళ్ళాం వైపు చూస్తే మచ్చలు కాపోతే ఇంకేం కనిపిస్తాయనుకున్నావ్?

చిరుతపులి: మా ఆవిడ చిరుతపులి కాదండీ. జీబ్రా!



గోడ మీద తాతలనాటి పాత గడియారం ఎల్లాగో ఓపిక తెచ్చుకొని మూడుసార్లు మొరిగింది. పక్కలో వున్న చంటిబిడ్డ పాల కోసం కెవ్వున అరిచింది. శారద ఉలిక్కిపడి లేచింది. పందిర మంచం మీదకు దృక్కులు సారించింది. శూన్యం! అంతా శూన్యం! వేసిన దుప్పటి వేసినట్లే వుంది. చల్లిన మల్లెపూలు చల్లినట్లే వున్నాయి. పర్చిన తలగడాలు పర్చినట్లే వున్నాయి.

పిల్లాడికి పాలిచ్చి మెల్లగా లేచింది నులక మంచం మీదనుంచి. కిటికీ తలుపులు తెరచి బయటకు చూసింది ...... అంతా చీకటి! చిక్కని చీకటి! కాటుకలాంటి చీకటి......

"ఏం మగాళ్ళు! రాత్రి మూడోఝాము అయింది. ఇంకా ఇంటిపట్టుకి చేరలేదు. ఏమనుకోవాలి? తప్పకుండా సినీమాకి తీసుకెడతానని చెప్పారు. 'ఐదు నిమిషాల్లో క్లబ్బులో పని తెముల్చుకువచ్చేస్తాను. రెడీగా వుండు' అన్నారు. ఐదునిమిషాలు కాదు, ఐదు గంటలైనా అజా పజా లేరు మనిషి... ఏదో నా వెర్రికాని, ఇలా ఎన్నిసార్లు మోసం చెయ్యలేదూ! ఎప్పటికప్పుడే కొత్త నాకు...అసలు ఆయన్ని నమ్మమని యెవరు చెప్పారు?

ఇద్దరం కలిసి సినీమాకి వెడతాం కదా అని సంబరపడిపోయాను. ఆయనకిష్టం కదా అని, ఈ షిఫానుచీర కట్టుకున్నాను ... నా మతి మండ, దీనితోనే నిద్రపోయాను. ఆయన కోసం నిరీక్షిస్తూంటే, ఎప్పుడు పట్టేసిందో పాడునిద్ర.

తంగిరాల సుబ్బారావు

ఈ జాకెట్టు మనసుపడి కుట్టించుకున్నాను. మోచేతులు దిగేవరకూ పొడుగ్గా కుట్టించుకోవాలనీ, అది ఈ రోజుల్లో ఫేషననీ మరీమరీ చెప్పారాయన. ఈపాడు ఫేషన్నంటే నాకు మహాచెడ్డ చిరాకు. 'వద్దూరు కట్టు'ల్లా ఏం బావుంటుందిట? బిగుసుకుపోయింటుంది చచ్చేట్లా. హాస్పటల్ కు వెడితే, జాకెట్టుమీదనుంచే ఇంజెక్షన్ చేయించుకోడం...అబ్బ రోత... అయినా సరే ఆయన ఆనందం కోసం రెండు జాకెట్లు అలాగే కుట్టించుకున్నాను.

సాయంకాలం రెండువందల మల్లెపూలు కొనుక్కున్నాను. అవి చాలక మళ్ళీ ఓ యాభై చామంతిపూలు, అరడజను ఎర్ర గులాబీలు, ఓ దవనం కట్టా — పుచ్చుకున్నాను. ఆయన జేబులో పెట్టుకుని మురిసిపోతారు కదా అని రెండు సంపెంగ పూలు కూడా తీసుకున్నాను.... అరె! ఆ పువ్వులన్నీ టేబిలుమీదే వుండిపోయాయే! వాడ తగులడ్డాయి కాబోలు. కాసిని నీళ్ళు చుక్కలుపోసి పళ్ళెంలో నేనా వేశాను గాదు, మతిమాలినదాన్ని...అయినా యీ మనిషి యిలా చేస్తారని ఎవరికి తెలుసు? 'తొమ్మిదిన్నరకల్లా వచ్చేస్తాను, సినీమాకి వెడదాం, తయారుగా వుండు!' అన్న పెద్దమనిషి, ఛళ్ళున తెల్లారుతున్నా దిక్కూ మొక్కూ లేరు. ఏమనుకోవాలి?

అస్తమానం, నా జుట్టును తెగపొగుడుతారాయన! ఈవేళ తలంటు కూడా పోసుకున్నాను. ఈ పువ్వులన్నీ అలంకరించుకోవాలనుకున్నాను. మల్లెపువ్వులన్నీ మాల గుచ్చుకున్నాను. చామంతిపూలు చెండు కట్టుకుందామనుకుంటూంటే చిట్టిబాబు ఏడ్చాడు. పాలిచ్చి వద్దాంకదా అని వాడి పక్కన పడుకున్నాను. ఎప్పుడు నిద్రపట్టేసిందో తెలియదు....కలలో...ఆయన ఇంటికి వచ్చి నన్ను లేపినట్టూ, ఎర్రగులాబీలు ఆయనే స్వయంగా నాసిగలో తురిమినట్టూ, రిక్షాలో ఇరుగ్గా కూర్చుని ఇద్దరం కలిసి సినీమాకి వెళ్ళినట్టూ, సినీమాహాల్లో చీకటిలో ఒకరి సరసన ఒకరు కూర్చుని సినీమా చూస్తున్నట్టూ ఆయన నా భుజాన్ని తట్టుతూ "చూడు చూడు! 'అంజలి' ఎంతబాగా నటిస్తోందో!" అంటున్నట్టూ—అబ్బ! ఎంత తియ్యటికల!

(63 వ పేజీ చూడండి)

అంతరంగ సంఘర్షణ

"చూడండీ! మొన్న ప్రక్కింటావిడ పేరంటానికి కట్టుకొచ్చిందండీ చక్కటి జరీ చీర! కెంపులాంటి ఎఱ్ఱటి రంగు! దానిమీద జరీ కళ్ళు చెదిరేట్టు ఎలా మెరుస్తున్నదనుకున్నారూ? అట్టే ఖరీదు కూడా లేదండీ! పాతిక రూపాయిలేనట! నాకలాటిది ఒకటి కొనియ్యరూ?" మెల్లగా గోముగా జంకుతూ అడిగింది వనజ.

సురేష్ వనజకేసి తీవ్రంగా చూశాడు. "మీ ఆడవాళ్ళకు ఎంతసేపూ ఇదేపని! ఆ అచ్చమ్మ మంచి చీరకట్టుకుని రావడం భయం ఈ పిచ్చమ్మకొత్తనగ వేసుకోవటం భయం మా మొగవాళ్ళ మీదికి వచ్చి విఱుచుకు పడతారు. మొగవాళ్లను వేధించటం తప్ప మీకేం పనిలేదు! పాతిక రూపాయిలు నీ కంటికి మహా చవగ్గా కన్పిస్తున్నాయి కాబోలు, నాదగ్గఱ ఇప్పుడు కాని కూడా లేదు- నేనిప్పట్లో ఏ చీరాకొనను, కొన దలచుకోలేను!" అని సిగరెట్టునుసి దులుపుతు సురేష్ ఖచ్చితంగా చెప్పాడు.

వనజ చిన్నబోయింది. అభిమానంతో, రోషంతో కళ్ళంట నీళ్ళు తిరిగాయి. తనే మంత పట్టుచీరలు కొనమన్నదని? వందలు పెట్టి కొనమన్నదా, వేలు పెట్టి కొనమన్నదా విసుక్కోవటానికి? అడుగులకు మడుగు లొత్తుతున్నా, మగవాళ్ళు అధికారం చెలాయించి, ఈసడించి కొడుతూనే వుంటారు! తన సరదాలను తీర్చమని భర్తను కాకపోతే మరెవరి నడుగుతుంది? వాళ్ళ కిష్టమైన వాటి కన్నిటికీ బాగానే ఖర్చు పెట్టుకుంటారు! ఇవతల వాళ్ళకూ కూడా వాళ్ళలానే సరదాలుంటాయని ఎందుకనుకోరో మరి? ఆర్థిక స్వాతంత్ర్యం లేక పొబ్బట్టేగా ఆడదానికిన్ని తిప్పలూ మొగవాళ్లు కసిరి కొట్టటమూనూ— ప్రతి చిన్న విషయానికి చేతులు సాచవలసి రావటంవల్లనేగా మగవాళ్ళ కింత అలుసు! హాయిగా చదువుకుని వుద్యోగం చేసుకుంటే బాగుండిపోను!

వనజ కళ్ళంట నీళ్లు పెట్టుకుంటూ గిరుక్కున ఇంట్లోకి వెళ్ళిపోయింది. మంచం మీద బోర్లా పడుకుని మనస్సుకు శాంతి లభించేంత వరకూ కన్నీళ్ళు కార్చింది. వ్యథా పూరితమైన మనస్సుతో అలా ఎంత సేపు ఏడుస్తూ పడుకుందో! అత్తగారి కేక విని వనజ త్రుళ్ళిపడి లేచింది.

"బాగుందమ్మా! ఇలా నువ్విక్కడ మంచం ఎక్కి కూర్చుంటే అవతల వంటంతా ఎవరు చేస్తారనుకున్నావు తల్లీ? ఈ నాజూకులు మా ఇంటిదగ్గఱ పనికి రావమ్మా లేలే!"

వనజ మనసు తిరుగుబాటు చేసింది. మాట్లాడకుండా లేచి తనపెట్టె గబగబా సర్దుకుని వీధి గుమ్మంలోకి వెళ్ళి రిక్షాను పిలిచింది. అత్తగారు తెల్లబోయి చూస్తూ నించుంది కాస్సేపటికి తెప్పరిల్లి "అబ్బాయి! చూశావురా, కోడలు ఎంతవరకు తెగించిందో"! అంది. సురేష్ తనగదిలోంచి బయటికొచ్చాడు. వనజ ప్రయాణ సన్నాహంచూసి విస్మితుడయ్యాడు. "ఇప్పుడు నేనేం అన్నానని ఆగ్రహంతో పుట్టింటికి వెళ్ళాలని చూస్తున్నావు వనజా!" అందామనుకున్నాడు కానీ, అంతట్లోనే అభిమానం ముంచుకొచ్చింది! ఈ ఆడవాళ్ళు సామాన్యులా? కనికరిస్తే కంట్లో వ్రేలు పెడదామని చూస్తారు.

మందరపు పద్మ, లలిత

"వెళితే వెళ్ళనియ్యమ్మా! ఆవిడ ఇక్కడ వుండి మనల్నేం వుద్ధరించాలి గనుక!" అంటూ గిరుక్కున తిరిగి తన గదిలోకి వెళ్ళిపోయాడు.

వనజ వుబికివస్తున్న కళ్ళ నీళ్ళ నాపుకుంటూ వెళ్ళి రిక్షాలో కూర్చున్నది. రైల్లో ప్రయాణం చేస్తున్నంతసేపూ సురేష్ మాటలు జ్ఞాపకంవచ్చి వనజకు గుండెల్లో సూదులు పొడుస్తున్నట్లనిపించింది. ఇంటికి వెళ్ళాక వనజ తండ్రిని చూసి బావురుమని ఏడ్చింది. "నా తోటివాళ్ళంతా చక్కగా చదువుకుని సుఖపడుతుంటే పద్నాలుగేళ్ళకే ఏం కొంప ముంచుకుపోయిందని పెళ్ళిచేశావు నాన్నా? ఈ మూడేళ్ళ కాపురంలో నేను సుఖపడ్డదేం లేదు. అత్తగారి దెప్పులూ, అయ్యగారి ఆగ్రహం తప్ప మరేంలేదు నాన్నా!" అంది.

భూషణం వనజ ఏకరువు పెట్టిన కష్టాలన్నింటినీ ఆత్రుతగా విన్నాడు. కోపంతో కళ్లు ఎర్రగా చింతనిప్పల్లా అయిపోయాయి. "ఏమిటే! నీచేత ఇంటెడు చాకిరీచేయిస్తూ పైగా నిన్ను నానా మాటలు అంటున్నారా? ఇంత డబ్బూ ముఖానపోసి వాడి కంటగట్టిన దెంగుకూ, ఒక చీరాకొనక, ఒక నగా చేయించకపోయాక! బుద్ధి గడ్డితిని నీకు పెళ్ళి చేశానమ్మా! ఇప్పటికైనా మించిపోయిందిలేదు! నువ్వు ఎంతవరకు చదువుకుంటానంటే అంతవరకూ చెప్పిస్తా. ఆ దరిద్రుడి ముఖం మాత్రం చూడకు!" అన్నాడు.

వనజ కలకబారిన మనస్సుతో చాలసేపు ఆ విషయమే ఆలోచించుకుంటూ కూర్చున్నది.

*　　　*　　　*

రోజులు గడుస్తున్నకొద్దీ వనజ ఆగ్రహం మెల్లమెల్లగా చల్లారుతూ వచ్చింది. ఏ క్షణంలోనైనా సురేష్ తనను తీసుకెళ్ళటానికి వస్తాడేమోనని వళ్లంతా కళ్ళుచేసుకుని చూడసాగింది. కానీ...లొంగిన కొద్దీ మొత్తుతూనే వుంటారు మొగవాళ్ళు! తను బింకంగా వుండకపోతే లాభంలేదుమరి! వనజ మనస్సుమాత్రం సురేష్‌కోసం తహతహలాడసాగింది. "ఏమో పాపం! నిజంగానే చేతిలో డబ్బులేదేమో, వుంటే ఎందుకు కొనివ్వరూ?" అనుకుంది ప్రేమగా! తనను నవ్విస్తూ కవ్విస్తూ ఎంత సరదాగా వుండేవాడు! మళ్ళా సురేష్ దగ్గఱకు వెళ్ళగలిగితే బాగుండును! ఆ తీయని వాక్కుల కోసం తన మనస్సు పలవరిస్తున్నది— అయినా అంతలోనే అభిమానం అడ్డు తగిలింది! ఇన్నాళ్ళై పుట్టింటిలోవున్నా ఒక సారైనా వచ్చాడా? తనేగుంగ ఆనరాని



★ అంతంలేని పంతం ★

మాటలు అనేసిందని అంత కోపం రావటానికి! తనను వచ్చి తీసుకెళితే అతని సామ్రాజ్యం పోయింది? తనతో అతనికంత అవసరం లేనప్పుడు తనెందుకు 'నువ్వుతప్ప నాకు గతిలేదు' అంటూ పరుగెత్తుకుని అక్కడికి పోవాలీ అని రోషం తెచ్చుకుని వూరుకుంది.

సురేష్‌కూడా వనజమీదికి మనస్సు పోసాగింది. "పాపం! మనస్సుంచబట్టలేక కావాలని నోరుతెరిచి అడిగితే కళిరేశాను. ఇంకెప్పుడైనా కొంటానని మెల్లిగా చెప్పాల్సింది!" అనుకున్నాడు జాలిగా పశ్చాత్తాపంతో.

"వనజ రేనిదే ఏంతోచటం లేదు, వెళ్ళి తీసుకొస్తే బాగుండును!" అనుకుని మళ్ళా అంతలోనే "ఆడదానికే అంత తలబిరుసుగా వుంటే డబ్బు గడించే మొగవాడిని నాకెంత వుండాలి?" అని బిగిసి కూర్చున్నాడు. పుట్టింటికి వెళ్ళింది వెళ్ళినట్టు తిరిగిరాలేదూ? తను అక్కడ దిగబెట్టాడు గనుకనా, మళ్ళీ వచ్చి తీసుకురావటానికి? ఆవిడ అలకలు తీర్చి, భుజాన్నెక్కించుకుని తీసుకొచ్చేంత అవసరం తనకేంలేదు. వచ్చినప్పుడే వస్తుంది. రాకపోతే అక్కడే వుంటుంది! "నా అవసరం ఆవిడకు లేనప్పుడు ఆవిడతో నేనా నాకవసరం?" అంటూ కోపంతో బింకంగా కూర్చున్నాడు సురేష్.

రోజులు గడుస్తున్నకొద్దీ ఇద్దరికీ కోపం ఎంత చల్లారుతున్నదో, పట్టుదలా అంత పెరుగుతున్నది. సురేష్‌ను తల్లి అప్పుడప్పుడు మందలిస్తూనే వున్నది. "పోయి కోడల్ని తీసుకురారా? ఎన్నాళ్ళు దాన్ని అక్కడే అట్టే పెడతావ్? మొగుడూ పెళ్ళాలన్న తర్వాత పోట్లాటలు రాకుండా పోతాయా? మెల్లగా సర్దేసుకుని పోవాలిగాని ఇలా కాపురాలు మానుకుంటారటరా? ముసలిదాన్నయిపోయానా, ఇంటిపనంతా ఎన్నాళ్ళని నేను సవరించుకుని రాగలనురా? కోడలుమీద భారంవేసి హాయిగా రామా, కృష్ణా అంటూ కూర్చోవలసిన దాన్ని!"

కాని సురేష్ తన పంతం మానలేదు. ఈ పంతాలమధ్యా, పౌరుషాల మధ్యా ఒక ఏడాది యిట్టే గడిచిపోయింది. ఇరుపక్షాల నుంచీ సంధి ప్రయత్నాలేం జరుగలేదు!


వనజ మనస్సు రాయిచేసుకుని చదువులో పడ్డది ఉన్నట్టుండి హఠాత్తుగా ఒకరోజు సురేష్ తల్లి బండిలోంచి దిగింది. వనజ తండ్రి భూషణం ఆవిడను చూసి ముఖం ముడుచుకున్నాడు. వనజ మనస్సులో మాత్రం చిన్న ఆశారేఖ మెరిసింది! సురేష్ తల్లి వస్తూనే "బాగున్నావా అమ్మా వనజా" అంటూ పలకరించి దగ్గరకొచ్చి కూర్చున్నది. "నిన్ను తీసుకెళ్దామని వచ్చానమ్మా!" అంది వనజను పరికించి చూస్తూ. వనజ మాట్లాడే అవకాశం యివ్వకుండానే భూషణం "అమ్మాయిని తీసుకెళ్ళటానికి నువ్వు వస్తావటమ్మా? అమ్మాయిమీద అంత అభిమానం ఏడిస్తే మీ అబ్బాయే వచ్చునుగా? సుఖంగావున్న దాన్ని మళ్ళా ఆ నరకంలోకి ఈడ్చుకెళ్ళాలనా మీ తాపత్రయం? ఆలనాపాలనా లేని కొంపలో అదేం సుఖపడుతుంది? నా యింట్లోనే వుంటుంది—నాతోనే తింటుంది!" అన్నాడు దురుసుగా.

సురేష్ తల్లి తెల్లబోతూ "పెద్దవారు! మీరుకూడా అలా అంటే ఎలా అన్నయ్యగారూ? చిన్నవాళ్ళ పట్టుదలకూ, పంతాలకూ పోయి కూర్చుంటే, పెద్దవాళ్ళు మనం వాళ్ళకు సర్దిచెప్పి కాపురం నిలబెట్టాలంటారా, లేదంటారా?" అంది.

"ఇంతకీ నేను కాపురం చెడగొట్టేవాడినీ, మీరు నిలబెట్టేవారునా? సురేష్‌నే వచ్చి తీసుకెళ్ళమనండి! ఆ పంతం ఏమిటో నేనూ చూస్తాను! వాడు వస్తేనేగాని అమ్మాయిని పంపేది లేదు!" అన్నాడు ఖచ్చితంగా.

సురేష్‌తల్లి చాపమీదనుంచి లేస్తూ "వనజా నీకు కాపురం నిలబెట్టుకోవాలంటే పంతానికిపోకుండా నీ అంతట నీవైనా వచ్చేయమ్మా" అంది.

భూషణం మండిపడ్డాడు. "బాగానేవుంది పొయ్యండి! దాని జీవితాన్ని సరిదిద్దేవాడిని నేనుండగా మీరెందుకు మధ్యలో కలుగ



జేసుకోవటం?"అని వనజవేపు తిరిగి "వనజా! ఆ గడపత్రొక్కావా మళ్ళా జన్మలో నీ ముఖం చూసేది లేదు!" అన్నాడు.

వనజ అత్తగారితోపాటూ వెళ్ళిపోవాలనే అనుకుంది. అయినా ఆగ్రహంతో మండిపడుతున్న తండ్రిముఖంచూసి అంతపని చేయటానికి సాహసించలేకపోయింది.

తర్వాత కొన్నాళ్ళు గడిచాక తండ్రితో మెల్లిగా ఆ విషయం కదిపింది.

"నీ చదువు మధ్యలో పాడుచేయటానికమ్మా ఈ ఎత్తంతా! అటు నిన్ను చదువుకూ కాకుండా, ఇటు కాపురానికీ కాకుండా చేయాలని వాళ్ళ సంకల్పం! నా మాట విని వాడి పేరెత్తక చక్కగా చదువు పూర్తిచేసుకో! ఏదో ఒకటి నిశ్చయం చేసుకో అక్కడికి వెళ్ళావా ఎలాగోలా ని కాపురం నీవే చక్కబెట్టుకుని అక్కడపడుండు. లేదా హాయిగా చదువు చెప్పిస్తాను. వుద్యోగం చేసుకో! ఆ దరిద్రుడి పేరెత్తితేనే నాకు వళ్ళుమండుతున్నది. ఏడాదై పుట్టింటిలోవుంటే ఒకసారైనా చచ్చిందీ, బ్రతికిందీ కనుక్కున్నాడా? అలాంటి వాడింటికిపోయి ఏం సుఖపడతావు చెప్పు" అని భూషణం వనజతో అన్నాడు నచ్చజెప్పేధోరణిలో.

వనజ, తండ్రిమాట కాదని తెగించి సురేష్ దగ్గరకెళ్ళటానికి జంకింది. ఇదమిద్ధంగా ఏదీ తేల్చుకోలేక గాఢంగా నిట్టూర్చింది. ఆ క్షణంలో సురేష్ దగ్గరకు పరుగెత్తుకునిపోయి అతని పాదాలకు ప్రణమిల్లితే బాగుండుననిపించింది వనజకు. తండ్రికి అసలే పట్టుదల! తను ఈ ఊబిలోనుంచి ఎప్పటికీ బయటపడలేకపోతేనో?

* * *

సురేష్, మామగారింట్లో తల్లికి జరిగిన గౌరవ మర్యాదలు గురించి విన్నాడు. ఆడపిల్లనుకన్న అభాగ్యుడికే అంతపట్టుదలైతే తనేనా తక్కువవాడు? వనజను తను స్వయంగా ఎందుకు తీసుకురావాలి? తప్పు చేసివుంటే కుమార్పణ కోరినా అందం! డబ్బుంటేమాత్రం అంత అహంకారమా? తన కూతుర్ని తను దిగబెట్టి వెళ్ళ లేడూ? పొరబాటున చేసుకున్నాడీ సంబంధం!.

సురేష్కు ఆలోచిస్తున్నకొద్దీ వనజ తండ్రిమీదా తత్ఫలితంగా వనజమీదా బాగా ద్వేషం పెరిగిపోయింది. చివరకు ఆ ద్వేషం వనజమీద విడాకులకోసం దావా వేయటం వరకూ వచ్చింది. వనజ ఈ సంగతి విని చాలా గాబరాపడింది. ఏడుస్తూ మూటా, ముల్లెకట్టుకుని ప్రయాణానికి సిద్ధమయ్యింది. రిక్షా బయల్దేరే సమయంలో భూషణంకూడా వనజతో ప్రయాణం అయ్యాడు. వనజను బుజ్జగిస్తూ "విడాకులిస్తే పీడా వదిలిందనుకోమ్మా! నికేం భయంలేదు! నీకు ఇంకో



ఉగాది ఉత్సవాల సందర్భంలో చెన్నపురి ఆంధ్ర మహాసభవారు జరిపిన నాటికల పోటీలలో, శ్రీ గన్నిశెట్టి వేంకటేశ్వరరావు రచించిన "ఏమి జీవితాలు" నాటికలో సుబ్బారావు పాత్ర ధరించి ఉత్తమనటుడుగా ఎన్నికైన విల్లివాకం ఆంధ్ర సంఘ కార్యదర్శి శ్రీ బి. రామకృష్ణ.

పెళ్ళి చేస్తాను, చూస్తూండు!" అన్నాడు.

వనజ అదిరిపడి చూసిందే తప్ప ఏమనలేకపోయింది. "ఇంటికిపోదాం పదమ్మా! వాడికసలే నీమీద కోపం! నువ్వు ఇప్పుడు అక్కడ వెళ్ళావంటే పీకపిసికి చంపుతాడుకూడా! మరేం భయంలేదమ్మా! నీ జీవితాన్ని సరియైన దారిలో నేను పెడతానుకదా తల్లీ!" అంటూ సముదాయించాడు.

రిక్షా వెనక్కుమళ్ళింది. వనజ ఏదో మాట్లాడాలని గింజుకుంది. కాని ఒక్కమాటా పెదిమలుదాటిరాలేదు. కన్నీరు కారుస్తూ నిరాశగా, నిస్పృహగా రిక్షాకు నీరసంగా జారగిలబడింది వనజ.

* * *

వనజ ఎం. బి. బి. యస్. పూర్తి చేసింది.

తండ్రి భూషణం వనజ దగ్గరే వుంటున్నాడు. వనజకు మళ్ళా పెళ్ళిచేసుకోవాలనే వుద్దేశ్యం వుందో, లేదో కాని తండ్రిమాత్రం వనజకు మళ్ళా పెళ్ళి చెయ్యాలని శతవిధాలా ప్రయత్నం చేస్తున్నాడు. భూషణం ఎక్కని గుమ్మం లేకుండా పోయింది. ఎక్కడ చూసినా నిరాశే ఎదురౌతున్నది గానీ ఫలితం లేకపోతున్నది. ఆడపిల్లకు పెళ్ళి చేయటమే బ్రహ్మాండం! అందులో రెండో పెళ్ళి, మూడు నాలుగేళ్ళు కాపురం చేసిన దానిని పెళ్ళి చేసుకునేంత వుదారులు విదేశాల్లో తప్ప మన దేశంలో లేరేమో!

ఎవరో ఇంజనీర్ గారికి పెళ్ళికుమార్తె కోసం గాలిస్తున్నారు! వాళ్ళది ఆదర్శకుటుంబమని పేరు. ఇంజనీర్ అన్నగారు వితంతు వివాహం చేసుకున్నారు. భూషణం ఆశతో వాళ్ళింటికి వెళ్ళాడు. ఆ ఇంజనీర్ గారి తండ్రి భూషణం సంగతి ఇదివరకే విన్నాడు. విడాకులు జరిగిన తర్వాత భూషణం పేరు నలుగురి నోళ్ళలోకీ బాగా ప్రాకిపోయింది. కూతురు కాపురం చేజేతులా చెడగొట్టాడని నలుగురూ నానా మాటలూ ఆడారు. అయినా భూషణం లోకానికేం వెఱువలేదు!

ఇంజనీర్ తండ్రి సంగతంతా విని "బాబూ! అయితే వారికి విడాకులిచ్చినట్టే మాకు మాత్రం మీరు విడాకులివ్వరని ఏం నమ్మకం? మీతో పేచీలు పడటానికి మాకేం ఓపిక లేదండీ?" అన్నాడు.

దాంతో భూషణం తలవంచుకుని బైటికి చక్కగా వచ్చేశాడు. ఈ సంగతి చూచాయగా తెలిసి వనజకంటికీ, మంటికీ ఏకధారగా ఏడ్చింది. అనుకోకుండా ఎంత పొరబాటు పనిచేసింది తనూ?

ఇంకో పెళ్ళికొడుకు "రెండో పెళ్ళంటున్నారుకదా! పదివేలు కట్నమైనా ఇవ్వరా?" అనడిగాడు.

వనజ మనస్సులో ఎంతో బాధపడింది. ఆడదాని బ్రతుకెంత నికృష్టం!

వనజకు లేడీ డాక్టరుగా వైజాగ్లో పోస్టింగు వచ్చింది. ఉన్నది ఇద్దరే కాబట్టి, తోడుకోసం ఒకరి ఇంట్లో భాగం అద్దెకుతీసుకున్నది. ఆ ఇల్లు గలావిడ శకుంతల చాలా మంచి మనిషి. వనజతో ఆప్యాయంగా మనసువిప్పి మాట్లాడుతుంది. వనజ శకుంత

(47-వ పేజీ చూడండి)

హిరణ్యాక్ష వరం

ఒకాయన బాగా అలసిపోయి కాళ్ళీడ్చుకుంటూ మంగలిషాపులోకివచ్చి కుర్చీలోకూలబడ్డాడు.

గడ్డం చెయ్యమన్నాడు.

"బాగా కిందకున్నారు— కొంచెం పైకికూచుంటే గడ్డం చెయ్యడానికి వీలుగావుంటుంది" అన్నాడు మంగలి.

"ఓపికలేదు—అయితే క్షవరమే చేసెయ్."



బంగారం సింగారం 4
బాపు బొమ్మల కథ -
ఇంకో గంట తరవాత సింగారం కూడా - తన జతగాళ్ళు వరాలు, అప్పారావులతో - ప్రయాణం హడావుడిలో వున్నాడు
ఔను గురూ! నాకు బాగా గుర్తు - ఆ పెట్టె అక్కడే వుంటుంది
నీ మొహం పోదూ -
కానీ మీ మావ కూడా పార్ట్నరంటున్నావు గదా...
అందుకే బెంగ - నేను ముందు వెడితే - నారంగా! ఆ డబ్బంతా నాదే కదా!
యాహూ మంచిదే! డబ్బెలాగ?
వెధవ డబ్బు - బంగారాన్ని తంతే రాల్తుంది. ఇక్కడే వుండండి - ఇప్పుడే వస్తా
వెధవ తొందరరా నువ్వూను - మనిషి కనబడటంలే -
కనబడకేం - మిమ్మల్నే వెతుకుతూ...
మీ సింగారం మీ కొంప ముంచుతాడు - ఎక్కడో లంకె బిందెలున్నాయిషగా - మీరూ వాడూ షేరు.....
కొంప మునిగింది! దేవుడా - వాడికెలా తెలిసింది! వాడొస్తే సగం వాటా ఇమ్మంటాడు - శని వెధవ -


వాటేం ఇప్పుడడగకుమేం! ఆజన్మలోనే వేసుగున్నారటుగా-
ఆ! ఆ! అట్టె అట్టె! నీకెవడ్రా చెప్పాడు ఇదంతా? ఆ భైరాగాడు దండోరాగినా.
లేదు లేదు! బంగారంగారూ మీరాట్టి కంగారంగారు- వ్రతం చేసినా ఉద్యాపన చెడగొట్టారు....
ఉద్యాపనచేసిటాని నేపిండాకూడూ- సరిగ్గా ఏడూ-
మరి మీరు భైరాగాడికి పెసరట్టు పెట్టాక- కాఫీ, బీడీలు ఇచ్చారా? లేదు- అదేమో మా సింగారంగాడు సప్లయి చేశాడు-
ఇహనేం- అదాకథ- అంచేత వాడు పీడిక్కి ఆ బోడి అంజనం తగలేశాడన్నమాట- అబ్బే- అది వుట్టి దగా- అబద్ధం- పీడకల-
అదేమోగాని మీకొచ్చిన పీడకల మీ సింగారానికే వచ్చిందిమరి
దేవుడా! ఇపుడే విటి దారి!
మీదారె వాడిదేనూ- మీవెనకే వస్తాడు మాతోటి- అలాకాదంటే- నాకాళ్ళు పట్టుకోండి తేలిగ్గా...
నాయన్నాయన చెబుదూ- నీకుపుణ్యం వుంటుంది
ఏంలేదు- మీరు గనక ఒక్క మూడు వేలు ఇపుడే ఇచ్చేస్తే వాడు రాకుండా చేసే పూచీనాది
బాబోయ్! దారుణం! మోసం! దోపిడీ! దెయ్యాలు! డబ్బులు- డబ్బు! మూడువేలే! బాబోయ్!
ఓం శాంతి శ్శాంతి హీ- హీహీ! మీకు రాబోయే లక్షలలో వెధవ మూడు వేలు ఏ మూల కండీ- మీరిపుడు చేసిన ధ్యాన్సు- పబ్లీగా చేస్తే సునాయాసంగా ముప్పైవేలు గడిస్తారు.....

కందుకూరి లింగరాజు

సమర్పణ

16

ఆ నాటి అన్నగారి రాక, కొద్ది ఘంటలే చుట్టపు చూపుకు వచ్చినా, అందులో ఏ రాజకీయపు సంప్రదింపులూ జరగలేదు. అయినా, ఆ కలయిక మాత్రం, బూరుగు కాయవతు అయిపోయింది. దాంతో అంతవరకూ కట్టుకున్న సౌధాలు, ఈ సమిష్టి కుటుంబ రాజకీయాలు, కూడా బీటలు తీసేయి. అవన్నీ ఇంతింతై అన్నట్లు పెరిగిన్నీ పోయేయి.

"అసలు చలపతి కాంగ్రెస్ గోత్రీకుడే; కాని దాన్ని చాలా గోప్యంగా మరుగు పరచి, పార్టీలో ముఖ్యుడయ్యేడు; పేరు కోసం," అని చర్చించి నిర్ణయం చేసుకున్నవారు ఓ పెసు, ఇంకో ప్రక్క "చలపతి ప్రభుత్వం కాంగ్రెసు పరం అయ్యింది. ఇప్పుడు పార్టీకి ద్రోహం తలపెట్టి దాన్ని ఛిద్రం చేసి, ఖండఖండాలుగా ఉత్తరించి, దానిమీద తన భావి నిర్మించుకుందుకు ప్రయత్నిస్తూన్నాడు. అందుకే అటు కాంగ్రెస్ వర్గాలలో పేరు ప్రతిష్ఠలున్న అన్నగార్ని తోడు వేసుకుంటున్నాడు. ద్రోహి." అన్నారు.

వీట్ల సంగతి ఎల్లావున్నా మరోవర్గం "మనల్ని మసిపూసి మారేడుకాయ చేసేసేడు. ఆ సీతమ్మని పెళ్ళిచేసుకున్నాడన్న పేరుమీద నాటకం ఆడేడు. నిజంగా దాన్ని ఉంచుకున్నాడు. అంతే," అన్నారు.

పై రెండు విషయాల ప్రచారం ఎట్లావున్నా ఆఖరువర్గ నిర్ణయం మాత్రం తలకొట్టివల్లయ్యింది. ఇందువల్ల సీతమ్మకూడా తనని అనుమానించే అవకాశం కలింది. అది మాత్రం సత్యం కాకపోయినా ఏనాటినుండి తన కుల ధర్మాలకు తిలోదకాలిచ్చేడో ఆనాటి నుండి కూడా సీతమ్మకు అన్యాయం చెయ్యాలని, ఆ చేసిన త్యాగాలు అసమర్థతతో కూడి ఉన్నాయన్న ధ్యాసే లేకుండా వున్నాడు. ఒక్కటి-తను బ్రతికి వుండగా సీతమ్మని మాత్రం అన్యాయం చెయ్యను అని వాగ్దానం చేసుకున్నాడు...అల్లా మసలుతూ వున్నా లోకం మాత్రం తన్ని గురించకుండా ఈ చిత్రవధ చెయ్యటంతో హృదయం మండుకే పోయింది.

ఆ సూర్పరాజు, రంగాచారి కూడా ఎత్తిన ఎత్తుల్లో పడిపోయి, రెడ్డి చూపిన ఔదార్యంలో సీతమ్మ భావికి మురిసిపోతూనే, క్షణకాలం బలహీనతలో, ఆ సంవత్సరం, శ్రీపతి పొలాలు కవులుకు పుచ్చుకోనివ్వకుండాను, కూలివాళ్ళు వారి పనులకు వెళ్ళకూడదని, పాలేరువాళ్ళు పనిలోంచి మానిపించడం వరకూ కూడా వెళ్ళి, ఆ ఉన్న గౌరవం కూడా పోగొట్టుకున్నారు. అక్కడ అల్లా పదచ్యుతితోపాటు ఇక్కడ, తన బిడ్డవతుగా పెంచి, పెద్ద చేసిన పార్టీ తాలూకు నాయకులే తనమీద న్యాయమూర్తులై కూర్చుని "పార్టీ నియమావళిని అనుసరించి నువ్వు చేసిన చేయదలచుకున్న, కార్యక్రమాల్లో ద్రోహ చింతనం అవృతమైఉంది. వీట్లవల్ల ద్రోహివే. అని నిర్ణయం అయ్యింది. అందువల్ల ఈ రోజులగాయతు నువ్వు, నీ ఉంపుడుకత్తె సీతమ్మకూడా పార్టీలోంచి బహిష్కరింపబడినారు," అన్న శ్రీ ముఖం చదివించడం, కలికం పెట్టినట్లయ్యింది.

ఓనాడు, తన అడుగుజాడల్లో నడిచిన ఈ నాయకులందరూ కూడా తనమీద తీర్పు విధించడంతో తోకత్రొక్కిన త్రాచులాగే మండిపోయి పడగలెత్తాడు.

దాంతో ఓ నిర్ణయానికే వచ్చేసేడు చలపతి. అంతవరకూ పుట్టనిబుద్ధి పుట్టి ఆస్తిపంపకానికి దిగేడు, నిలువెల్లా కక్ష, పగ, నిండిపోగా.

ఆ సాయంత్రం సీతమ్మని పిల్చి "చూడు సీతమ్మా!" అని కళ్ళల్లో కళ్ళు పెట్టి అన్నాడు.

భావి విషయం సూచీభేద్యంకాని అరణ్యాల్లో వున్నటయితే, ఊగిపోతూ, విన్న వార్తలు మనస్సును వికలమే చేస్తే, కళ్ళమ్మట నీళ్లుకారుతూంటే, "ఏమిటీ?" అన్నట్లే చూచింది.

"అధైర్యపడుతున్నావా?"

తలూపింది, లేదని.

"అన్నయ్య వసుపతి వచ్చేడట. వెంకటస్వామి ద్వారా, ఐదువేల రూపాయిలు కాగితాలు పంపేడు. మైనరు తరఫున నువ్వు సంతకం పెట్టాలి" అన్నాడు.

తెల్లబోయింది "ఎందుకూ?" అనీ అంది.

నెమ్మదిగా చెప్పేడు. కారణాలు వివరించేడు. చూచాయగా తను భావిలో ఆచరణకు నిర్ణయించుకున్న మార్గమూ సూచించేడు.

ఒక్క ఎగురు ఎగిరినట్లు అదరి "హైదరాబాదు అడవుల్లోకా! హింసకా!" అనీ అనేసింది.

"నువ్వు రాలేకపోతే, ఈ డబ్బుతీసుకుని ఎక్కడైనా సరే సుఖంగా జీవించు. మనస్సులో ఈ చలపతి అన్యాయం చేసేడు అన్నది మాత్రం మెసలకుండా వుంటే కృతజ్ఞుణ్ణి, నా కార్యం నేను ఆ శాంతితోనే నిర్వహిస్తా.

ఇక నావంతా! అదా ఏమీ చెప్పలేను. ఈ హింసాత్మక సమిష్టిదహనంలో నేను శలభాన్నే అవవచ్చు. కాష్టాన్ని కూడా రూపొందించ వచ్చు.

అది ఎందుకూ, అని నువ్వు అడిగితే మాత్రం చెప్పలేను. చెప్పడానికి ఇప్పుడు మనస్సు నిలకడ లేకుండా పోయింది. పూర్తి వ్యక్తిగతంగా నేను నేనుగా లేనేలేను గనుక."

"నేనూ వస్తా!" అన్నదామె. దీనికి చలపతీ తెల్లబోయేడు. అనురాగం కట్టలు తెంచుకోగా దగ్గరగా తీసుకుంటూనే "వద్దు సీతమ్మా! వాడికోసమైనా నువ్వు ఇక్కడ వుండాలి. ఇక్కడ వున్నా నావల్ల నువ్వు ఏ చిత్రవధనైనా పొందుతావన్న బాధ వుంది. అందువల్ల అజ్ఞాతవాసంగా వుండడం కూడా ముఖ్యం......" ఆ వరసలో ఎన్నో చెప్పేడు.

విడవలేని త్యాగంలోనే, ఆ అర్ధరాత్రి మసీదు వరకూ నల్ళి, ఆ మూలగా పాతిపెట్టిన రైఫిల్ తీసి, చేతికిచ్చి పాదాభివందనం చేసింది.

కన్నీళ్ళుకారుస్తూ, "సీతా! ఒకవేళ నేను తిరిగి రాలేకపోతే, వాణ్ణి తీసుకుని నాన్నగారింటికే వెళ్తానని వాగ్దానం చెయ్యవూ?" అని అడిగేసేడు. అల్లా చేయించుకునే, చీకట్లోనే కలిసి పోయేడు, ఆ ఆశ్రమం పేరు గుర్తుకు వుంచుకుంటూనే.

అంతే!

మర్నాడు ప్రొద్దుటకు పార్టీలో గుప్పుమని పోయింది. సి. పి. దంపతులు పరారీ అని, కుక్క గొడుగులు రంగు కాగితాల్లో ప్రతాపాలు చూపించుకున్నాయి.

మూడో నాటికి అవధానికీ తెలిసింది కబురు. మొదట్లో బ్రహ్మానందపడిపోయాడు. చలపతి ఈ నాటికి నా దారిలో పడ్డాడని, రేపోమాపో ఇంటికి చేరి, కల్లోలాలన్నీ కూడా సర్దుబాటు చేసుకుని కుదుటబడుతాడని. ఆ వారం, పక్షం, మాసం వరకూ ఎదురుచూచేడు, నిరాశే అయ్యింది.

కాని శచి ఉత్తరం సాక్ష్యం అన్నట్లే, బుల్లన్నయ్య తను రాలేకపోయినందుకు విచారిస్తూ, ఎక్కడ వున్నా తన శుభాకాంక్షులు, ఆశీస్సులు ఉన్నాయని, వంద రూపాయిలు పంపేడు.

అతి రగా లేన్ని వర్ణపొర్లని వ్రాయడం తబ్బిబ్బు చేసింది, దాంతో భయమూ వేసింది. ఎన్నో వూహాలు కల్గేయి. దారిలో విపరీతాలు కల్పించేయి. దాంతో మనస్సుకుంచుకుపోయింది.

"రమణమ్మగారి సంసారం పెద్దదవుతోంది. మీకేరు పట్టా పుచ్చుకున్నాను ప్రాక్టీసు పెడితే మంచిదేమో! అని" వాళ్ళోటి అన్నాడు మొన్న గుంటూరు వెళ్ళివచ్చాను. శచి కూడా అదే వుద్దేశ్యంలో వుంది. ఏమంటావు?" అన్నాడు వీధిలోంచి వస్తూ వెంకట్రామయ్య.

అవధాని ఉలిక్కిపడ్డాడు. "మంచిదే!" అని యాదాలాపంగానే అన్నాడు.

"ఉత్తినే అల్లా అంటావేమిటి? నువ్వు కొత్త కలుగ చేసుకోందే అల్లా వుంటే ఎల్లాగా?"

"మరి ఏం చెయ్యమన్నారు?"

"అదేమిటి? ఏదో చిన్న పిల్లాడిలా మాట్లాడుతావు. నువ్వోసారి వెళ్ళి, ఆ జిల్లా కాంగ్రెస్ సెక్రటరీ అంటూ, కొత్తకలక్టరుకు చెప్పవోయ్! దాంతో ఏ అసిస్టెంటు పబ్లిక్ ప్రాసిక్యూటర్ క్రిందో పేరు రికమెండు అయి వెళ్ళితే, పై వాళ్లు నీ వాళ్ళే కదా! దాంతో ఓ పెళ్ళి చేసిన వాడవు అవుతావు. ఇల్లు నిలబెట్టిన వాడివి అవుతావు. ఖరాఖండీగా చెప్పినట్లే అన్నాడు. వెంకట్రామయ్య.

రమణమ్మ వస్తూనే "ఏం నాన్నగారూ! మేనల్లుడు కులాసాయేనా? ఏమంటున్నాడు," అని అడిగింది.

"పెళ్ళాం కావాలంటున్నాడు" అన్నాడు బోసినోటితో నవ్వుతూ.

అవధానికి ఫక్కున నవ్వు వచ్చేసింది. రమణమ్మ సిగ్గుపడనే పడింది.

"పోనీలెండి. ఎప్పుడు ఏదన్నా ఇల్లాగే అంటారు మీరు" అని సిగ్గు బాగా అభినయించింది, రమణమ్మ.

"వాడు, సంవత్సరంనర దాటి రెండోఏట పడేటప్పటికి ఇంతపిసింద్రీ అయిపోతే, పెద్దయ్యాక ఇంక పట్టపగ్గాలుండవేమో!" అనే అనుభూతిలో పడ్డాడు.

"తొందరపడమించి పోతాడేమో!" అంది రమణమ్మ.

"ఆ! మర్చిపోయా! ఆ అయిదు వేలూ రంగనాథుకి వచ్చిందటకొ! సూర్యనారాయణగారు సంశయం లోపడితే"

రమణమ్మ, అవధాని కూడా కళ్ళెట్టుకుని బొమ్మలే అయ్యేరు. నెమ్మదిగా రూపాల్లోని రూపాలు సవరించుకుంటూనే అవధాని "అదిమా ఇంటి పెద్దాడపడుచు" అన్నాడు.

ఈసారి తెల్లబోయింది వెంకట్రామయ్య.

(ఇంకా వుంది)

ఏడుకొండలవాడా! వెంకటారమణా!



కడుపు నిండా కమ్మని భోజనం పెట్టి, మూడేళ్ళ ముద్దుల కొడుకును—నిద్ర పుచ్చుతోంది ఆదెమ్మ. పదేళ్ళ కాపురం ఫలితం, పనస తొనలాంటి పుత్రుడు—ఆమె ప్రాణాలన్నీ ఆ పిల్లవాడిపైనే!

ఎండ మిడిసి పడుతోంది—బిచ్చగాని కడుపులో అగ్నిపర్వతం వలె.

ఇంటి ముందు ఖాళీస్థలంలో సన్నకోణా ముణి వడ్లు ఎండబోసి ఉన్నాయి. ఆ వడ్ల దగ్గరకు రెండు కాకులు చేరాయి. ఇంటి చుట్టూ పెట్టని గోడలా ఏర్పడ్డ చిల్లకంప చెట్ల నీడలో-మత్తుగా నిద్రబోతుంది ఇంటి కుక్క.

ఆదెమ్మ గారాబు బిడ్డడు నిద్రబోయాడు కాని ఆమె చేతులు పిల్లవాని వీపు మీద మృదువుగా ఆడుతూనే వున్నాయి. ఆమె ఆలోచనలు సరిహద్దులు దాటి సంచరిస్తూనే ఉన్నాయి.

పక్కింటి ఇల్లాలు వెంకటలక్ష్మి పెరటి దొడ్డి గుమ్మంలోంచి ఒక్క పరుగున వచ్చింది ముక్కు గోళ్ళు ఎగరేసుకుంటూ. ఊళ్ళో పిచ్చుక సమర్తాడినా-మరుక్షణం ఆమె చెవులకు సోకుతుందా వార్త. లోకంలో జరిగే వార్తలకూ, విశేషాలకూ ఆమెకూ అంతదగ్గరి సంబంధం. ఆమె దూకుడు చూస్తే ఏదో వింత వార్తను కడుపులో కుక్కుకోలేక బాధపడుతూన్నట్టుగా కనబడుతోంది. వాకిట ముంగిట్లోనేవుండి గొంతు సారించింది.

"ఏఁవమ్మా! ఆదెమ్మా! ఈ సంగతి విన్నావుటమ్మా!"

కునుకుపాటులో త్రుళ్ళిపడ్డట్టు-ఆదెమ్మ ఆలోచిస్తూ త్రుళ్లిపడింది.


"రా, వొదినా కూర్చో. ఏమిటీ విశేషాలు?" అన్నది ఆదెమ్మ చిరిచాపపరుస్తూ.

వెంకటలక్ష్మి చాపమీద తాపీగా చతికిలబడి-'ఆదెమ్మా! ఒక్క రహస్యం. నీకడుపులో నువ్వేదాచుకోవాలి. నీమంచికోసమే చెబుతున్నా, నేనిట్లా అంటున్నానని ఏమీ అనుకోకు. పోయిన బేస్తవారం నాడు మనవూరిప్రక్క కేశవాయపాలెం లేదూ, ఆ పాలెపుకరణం గారింట్లో దొంగలు పడ్డారుట. భార్యమెళ్ళోని గోవర్ధనపు గొలుసు చేతుల్లోని మూడు జతల వోంకెల గాజులూ—తీసి కెళ్ళారుట తెలీలేదూ!

"ఆ! ఆ! తీసికెళ్ళితే—"

"దొంగల ఆచూకే తెలియలేదనుకో. కాని కరణంగారిభార్య నాలుగేళ్ళ క్రితం పెద్ద జబ్బుచేస్తే—ఏడు కొండలవాడికి ఆనగల్ని నిలువు దోపిడిగా సమర్పిస్తానని మొక్కుకున్నదట తెలీలేదూ! అటువంటి నగల్ని దొంగిలించడం మహాపాతకం. ఏడు





కొండలవాడికి ఎంతైనా ఆగ్రహం కలగొచ్చు. ఏడుకొండలవాడికి ఆగ్రహం కలిగిందంటే— సాఫీగా బ్రతకటం కష్టం ఆదెమ్మా! నువ్వేమీ అనుకోకు. మీ ఆయన యీచుట్టుపక్కల దొంగతనానికి పేరు మోగాడు. ఈ దొంగతనంలో మీ ఆయనకేమైనా సంబంధం వుందేమో కనుక్కో. అంతే! నేను యింత తెగించి వాగుతున్నానని నొచ్చుకుని ప్రయోజనం లేదు. అంతా మీ మంచికే"

ఆదెమ్మ ముఖం ఆలోచనల తీవ్రతలో గంభీరమైంది. తనభర్త గజదొంగే! ఆ సంగతి అందరికి తెలుసు. నాలుగుసార్లు జైలుకి కూడా పోయి వచ్చాడు. ఇంకా ఆవృత్తి మానలేదు తనుఎన్ని మొత్తుకున్న—తనమాట మీద లక్ష్యంలేదు. ఆయన్నిగురించి తనకు దినదినము గండమే! తనేం చేయగలదు? ఎన్నిసార్లు జైలుకి వెళ్లినా, చచ్చేట్టు తన్నులు తిన్నా, చీవాట్లు వేసినా—ఆయనకు బుద్ధి మళ్లి లేదు? ఏమో కేశవాయపాలెం కరణం గారి భార్య నగలు దొంగిలించటంలో ఆయనకు సంబంధం వుందేమో! అదే నిజమైతే—బ్రతుకంతా బుగ్గి అయినట్లే! తనస్వామి, తన దేవుడు, తన కష్టాల్ని ఆదుకొనేవాడు తిరుపతి వేంకటేశ్వరునికి అపచారం తలపెట్టటమా? నిలువు దోపిడిగా మొక్కుకున్న నగల్ని తనభర్త దొంగిలించటమా! అట్లా ఎన్నటికి జరుగరాదు. అది కుటుంబానికే వినాశకరం.

పక్కింటి ఇల్లాలు వెంకటలక్ష్మి ఆ విషయం ఇంకోయింటికి చేరవేయడానికి చప్పున వెళ్లింది.

ఆదెమ్మ మొగుడికోసం కనిపెట్టుకు కూర్చుంది ఆ సంగతి చెవిలోపడ్డ దగ్గర్నుంచీ ఆమెమనస్సు—పొగలో యిరుక్కున్నట్లు ఉక్కిరిబిక్కిరైంది. ఆ నగల్ని భర్త దొంగిలించాడా? లేదా? ఒక నిర్ణీతమైన సమాధానం వూహించుకొని, మనస్సును శాంతపర్చుకోలేక పోయింది. భర్తను కనుక్కున్నదాకా—ఆమె గుండె బరువు తగ్గదు; మనస్సులోని చీకాకు సద్దుమణగదు; హృదయంలోని కలవరం పోదు. భర్త ఆ నగల్ని దొంగిలించలేదంటే—ఎంతో సంతోషపడుతుంది!

ప్రొద్దు అటువాలగానే—ఆదెమ్మ మొగుడు, గజదొంగ, జగపతి ఇంటికొచ్చాడు. జగపతిని చూడగానే—పిల్లలు 'వీడు దొంగ' అని సులభంగా చెప్పేస్తారు. అతని ఆకారం అంత గంభీరంగా వుంటుంది. అయిదు అడుగుల పదకొండు అంగుళాల ఎత్తూ, నూటతొంభై రెండు పౌనుల బరువూ, తుమ్మమొద్దు రంగూ గల జగపతి—దొంగతనానికీ, గుండె ధైర్యానికీ, రౌడీతనానికీ, వ్యభిచారానికీ ప్రత్యేకమైన పేరుగలవాడు. అతని జులపాలజుత్తూ, గోడమీద మరకలాగా ముఖంపైని పొడా, కండలు దీరిన వొళ్లూ, మనిషిలోని క్రౌర్యాన్ని చాటే మీసాలూ, లోకాన్ని లెక్కచేయనట్టుగా ఎప్పుడూ ఎర్రగా ప్రత్తికాయల్లాగ వుండే కళ్లూ—అతను వీధిలో నడుస్తూంటే నే మంచిమనసు గలవాళ్లూ, డబ్బు పుష్కలంగా గలవాళ్లూ, భూతాల్ని చూసి భయపడే పిల్లలూ, వయస్సులోవున్న అందమైన పడతులూ— పామునుచూసి బెదిరినట్టు బెదిరిపోతారు దుష్టులకు దూరంగా వుండాలనుకుంటూ.

"ఏమే! కుండలో కూడువుందా," అన్నాడు జగపతి పెళ్ళాంకేసి చూస్తూ.

"కుండలో కూడులేక యేమౌతుంది? కూటికి వేళాపాళా లేదా ఏమిటి?" ఆదెమ్మ ఈసడించుకొంది.



★ ఏడుకొండలవాడా! ★

జగపతి పెరట్లోకెళ్ళి కుండలోని నీళ్లతో కాళ్లూ, ముఖమూ కడుక్కొచ్చి – పీటమీద కూర్చున్నాడు పై పంచ దులుపుకుంటూ. పళ్లెంలో అన్నమూ, బెండకాయ వేపుడూ, ఎర్రకారపు పచ్చడీ వడ్డించింది. నేతిగిన్నె ప్రక్కన పెట్టింది. ఎర్రకారపు పచ్చడి తెల్లటి అన్నంలో ఎర్రగా కలుపుకొని, నేతిగిన్నె అంగుళో గుమ్మరించే సరికి—

"ఏం వయ్యోయ్! ఊళ్లో అంతా ఆ గుబ్బగా చెప్పుకుంటున్నారు. చెవిన బడిందా?" అన్నది ఆదెమ్మ మండిగం ప్రక్కని నాపరాయిమీద కూర్చుంటూ.

"ఏమిటది?" అన్నాడు ముఖం పైకెత్తి జగపతి.

"కేశవాయపాలెం కరణంగారి భార్య మెడలోని నగలు పోయిన శుక్రవారంనాడు దొంగలెత్తుకెళ్లారంట. ఆవిడ ఆ నగల్ని తిరుపతి వెంకటేశ్వరస్వామివారికి నిలువుదోపిడిగా సమర్పించుకుంటానికి పెద్ద జబ్బు వొస్తే మొక్కుకున్నదట."

"అయితే—" అన్నాడు జగపతి నిర్లక్ష్యంగా.

భర్త ముఖంలోని హెచ్చు తగ్గుల్ని పసికట్టటానికి ప్రయత్నించింది ఆదెమ్మ.

"ఏమీ లేదు. అట్లాంటి నగల్ని దొంగిలించటం ఎంతో పాపం. ఆ దొంగిలించిన వాళ్లు ఆ స్వామి ఆగ్రహానికి గురికాకతప్పదు. నువ్వేమైనా దొంగిలించావేమో నని నా ప్రాణం ఊగుతూంది." ఆదెమ్మ గొంతు జీరబోయింది

"ఛాఁ, వెర్రి వాగమాక. ఆ వూళ్లోకి నెలనుంచీ దొంగతనానికి పోనిదే!" అన్నాడు జగపతి.

"నిజమా! ఒట్టువేసి చెప్పండి. ఏడుకొండలవాడు మనఇంటి దేవుడు. ఆ స్వామికి అపచారం తలపెడితే—ఫలితం అనుభవించక తప్పదు."

నోటిలోని అన్నపుముద్ద జారి, పళ్లెంలో పడేట్టు నవ్వాడు జగపతి భార్య మూఢనమ్మకాలకు.

"ఒసేవ్! నువ్వు నాకు పెళ్ళాంగా వుండాల్సిన దానివి కాదే! నాకు దేవుడంటే భయమూ లేదు, భక్తి లేదు. ఆ రెండూ వుంటే యీ విద్యలో యింత పైకి వొచ్చేవాణ్ణా? నీకేమో మరి, దేవుడంటే—ఎక్కడలేని భక్తి, భయమూ, రోజూ దణ్ణాలు పెడతావ్; ఏవేవో పాడుతూ వుంటావ్; ప్రతి శనివారం ఉపవాసం వుంటావ. ఎందుకొచ్చిన శ్రమ యిదంతా! దేవుడు లేడు. ఉన్నా మనకి అగపడేవాడు కాడు. ఎందుకు—ఈ దణ్ణాలూ, ప్రార్థనలూ, ఉపవాసాలూ, నమ్మకాలూ!"

భర్త అంత తూస్కారంగా మాట్లాడడం ఆదెమ్మకెంతో కష్టం వేసింది. రెండు కళ్ళూ మూసుకొని—రెండు చెంపలూ నిశ్శబ్దంగా వాయించుకుంది.

అన్నం తినడం ముగించి—జగపతి పళ్ళెంలోనే చేయి కడిగి, పీటమీదనుంచి లేచి, ప్రక్క జేబులోంచి పొగాకు కాడ తీసి, చుట్ట చుట్టుకుంటూ బజారు కెళ్ళాడు.

ఆ దొంగతనంలో భర్త వేలు పెట్టలేదని తెలుసుకున్నదై — అమితంగా సంతోష పడింది ఆదెమ్మ.

వీణా ప్రవీణ

ఒకాయన ఇంట్లో అవసరం వచ్చి చెయ్యి కాల్చుకోబోయి నిజంగానే రెండు చేతులూ కాల్చుకున్నాడు. డాక్టరొచ్చి చేతులకి మందు రాసి కట్లు కట్టాడు.

"డాక్టరుగారూ! ఈ కట్లిప్పగానే నేను మామూలుగా వీణ వాయించగలనా?"

"ఓ—భేషుగ్గా వాయించుకోవచ్చు."

"తమాషాగానే వుంది స్మండీ. అసలు నాకు వీణవాయించడం రానేరాదు."

చుట్ట కాలుస్తూ ఆలోచనలో పడ్డాడు గజదొంగ జగపతి—

కేశవాయపాలెం కరణంగారింట్లో భార్య నగల్ని దొంగిలించింది తనే. తనొక్కడే ఆ దొంగతనం చేసింది. ఆ రాత్రి ఆ ఇంట్లో ఏమీ దొరక్కపోతే—ఆవిడ మెడలోని గోవర్ధన గొలుసునీ, చేతుల వొంకెల గాజుల్నీ దొంగిలించింది తనే. వాటిని ఆ రాత్రికి రాత్రే యానాది రామికి బహుమానంగా యిచ్చేశాడుగా తను! దాని అందానికి అది యిచ్చే ఆనందానికి ఇట్లా ఎన్ని నగలు మేవానుగా యిస్తే సరిపోతుందీ? దానికి నిజంగా తనంటే గూటిలోని దీపమే! ఈ వూళ్ళో ఏ మగవాడూ దాని వొంటిమీద చేయి వేస ఎరుగడు. లక్షాధికారి లక్ష్మయ్య కొడుకూ, మునసబు మనుమడూ, చౌదరి బిడ్డ చెంచురామయ్యా—వీళ్ళంతా దానికోసం తాటాకులదడి దూకినవాళ్ళేగా! చిరకొంగైనా వాళ్ళకిచ్చిందీ! తనంటే అదిరిపడి చస్తుంది. తను ఓనాడు కనబడకపోతే—దాని ప్రాణం నీళ్లలోపడ్డ చీమలాగ గిలగిల కొట్టుకుంటుంది.

అయితే ఆనగల్ని దొంగిలించడం పాపమా దాని మాటలంఁ! దానికి రాళ్ళమీద, రప్పల మీద భక్తి ఎక్కువ. ఆ మూఢనమ్మకాలతో ప్రతిపనీ దానికి 'పాపంగానే అగపడుతుంది. నిలువుదోపిడిగా సమర్పిస్తానని మొక్కుకున్న ఆనగల్ని తనే దొంగిలించినట్లు తిరుపతి దేవుడికెట్లా తెలుస్తుంది? తను దొంగతనం చేస్తూంటే-తిరుపతినుంచి ఆ అర్థరాత్రి వొచ్చి-చూశాడా?...ఏమిటో!

వీళ్ళ గుడ్డినమ్మకాలూ-వీళ్లు! లోకంలో ఎన్ని దొంగతనాలు జరగటం లేదు? ఆ దొంగతనాల నన్నింటినీ దేవుడు కనిపెట్టి శిక్షలు విధిస్తున్నాడా! తనకి దేవుడంటే భక్తీ, భయమూ ఏనాడూ లేవు. రాయిలాంటిగుండె గలవాడికి అవి అక్కర్లేదు. దేవుడంటే భక్తీ భయమూ-పిరికిగుండెకలవాళ్ళకూ, స్వశక్తిచే పనుల్ని నెరవేర్చుకోలేనివాళ్ళకూ, కష్టాల్లో మునిగి తేలుతూ మానవసహాయం అందని వాళ్ళకూ గానీ-తనలాంటివాళ్లకా! ప్చ్! తను ఆ దొంగతనాన్ని గురించి పాపభీతితో గాబరాపడక్కర్లేదు. నిలువుదోపిడిగా ఇస్తానని మొక్కుకున్న నగల్ని-తను దొంగిలించితే, తనని తిరుపతి వెంకటేశ్వరస్వామి ఏదో చేస్తాడని భయపడటం తెలివితక్కువే. అసలు దేవుడనేవాడు లేడని లోకమంతా కోడైకూస్తుంటే-తను పిచ్చినమ్మకాలకు బెదరటమేమిటి! దేవుణ్ని కళ్లారాచూసినమానవమాత్రుడెవరైనా వున్నాడా! లేడు. అయితే ఈ మొక్కుబడులూ, నిలువుదోపిళ్ళూ, పూజలూ, నమ్మకాలూ ఎందుకు? అంతా భ్రమలోకం.

"ఏడుకొండలవాడా! వెంకటరమణా! గోవిందా! గోవిందా!" సన్నాయి మేళంతో కొన్ని కంఠాలు "గోవిందలు" కొట్టినై.

జగపతి తేలు కుట్టినట్టుగా చూశాడు.


చాకలి వెంకాయీ, వెంకాయి కొడుకూ జోగి అడుక్కుంటూ వొస్తున్నారు. 'గోవిందలు' కొట్టేవాళ్లు పదిమందికి పైగా ఉన్నారు. బజారున వెళుతూన్న మునసబు చెప్పులజత విడిచి, జేబులోంచి అర్ధరూపాయితీసి, జోగి పళ్లెంలో వేసి- దణ్ణం పెట్టుకొని చెప్పుల జత తొడుక్కున్నాడు. 'గోవిందా! గోవిందా!' అంటూ కంఠాలు మ్రోగినయ్. జగపతి అంతా చూస్తూనే ఉన్నాడు వీధి ప్రక్క నిలబడి. అతను చూస్తుండగానే నలుగురైదుగురు ఆ పళ్లెంలో, డబ్బువేసి లెంపలు వాయించుకున్నారు.

"ఏం జగపతీ! ఏడుకొండలవాడికి ఒక రూక వేయరాదూ!" అన్నాడు సుబ్బన్న రైతు.


వికిలిగా నవ్వాడు జగపతి. ఆ నవ్వులో ద్వేషమూ, అసహ్యమూ, ఎగతాళీ ధ్వనించినయ్.

జోగి అడుక్కునేవాళ్లు జగపతి ముందుగానే నడిచివెళ్లారు. జగపతి చిల్లికానీ వేయలేదు.

ఏడుకొండలవాడికి తను రూపాయి వేయాలిట! తనంత తెలివితక్కువవాడా! మూర్ఖుడా! రూపాయిపెడితే అర్ధశేరు ఉత్తరాది పొగాకురాదూ! తనెందుకు రూపాయి వృథాగా దేవుడికియ్యాలి! అనుకుంటూ జగపతి గుళ్ళోకెళ్ళాడు పేకాట ముఠాదగ్గరకు.



విశాఖపట్నం సంస్కృతి సంఘ ఉత్సవాలలో నృత్యప్రదర్శన చేసిన శ్రీమతి ఇ. వి. సరోజ, సంఘప్రధానకార్యదర్శి శ్రీ ఎమ్. జి. కె. మూర్తి.



ఉత్సవాల్లోపాల్గొన్న ప్లేబాక్ గాయకుడు తలత్ మహమూద్



ప్రారంభోపన్యాసం చేసిన ప్రముఖనటుడు శ్రీ జగ్గయ్య

ఆ సాయంత్రం మబ్బులుకూడబలుక్కున్నట్టు గుమిగూడి- చల్లగాలిని ఆహ్వానించి కడవపోతగా వర్షించాయి. ఆ వర్షంలో ఆదెమ్మ మూడేళ్ళ ముద్దులకొడుకు ముచ్చటగా గంతువేశాడు. ఆమె ఎండపోసిన వడ్లను గబగబా ఎత్తుతూంటే, 'జబ్బుచేస్తుందిరా!' అని ఆదెమ్మ ఎంత మొత్తుకున్నా, కుర్రకుంక కుతూహలంకొద్దీ వానలో మునిగి తేలాడు.

ఆరాత్రి జగపతి ఇంటికొచ్చేప్పటికి ఆదెమ్మ- పిల్లవాడి మంచంప్రక్కన ముసుగు దీసికొని కూర్చుంది. పిల్లవాడికి జ్వరం, వొళ్లునొప్పులు. కాళ్లు తీసుకుపోవటం- సుడిగాలి చుట్టవేసికొన్నట్టుగా చుట్టవేసుకున్నాయి. పసివాడు మంచంలో మెలికెలు తిరిగిపోయాడు పురివిప్పిన త్రాడులాగ. ఆ పిల్లవాడి తీరుచూసి ఆదెమ్మ గుండె బాదుకుంది. ఆచార్లు దగ్గరకెళ్ళి మందు తెచ్చింది. మొగుడికోసం కనిపెట్టుకుకూర్చుంది.

కొడిగుడ్డు లాంతరు గుడ్డివెలుగులో పిల్లవాడిరూపు సరిగ్గా గోచరించలేదు జగపతికి.

(55-వ పేజీ చూడండి)

ఫలించిన కోరిక

"ఎంత అవమానం ... ఎంత అవమానం,

మనవాడికి తన పనేదో తాను చేసుకొని పోదాం యితర విషయాల్లో జోక్యమెందుకని గాకుండా, అన్నీ నెత్తిన వేసుకొని, పెద్ద సి. ఐ. డి. ఆఫీసరై పోతాననుకొని, పెద్ద బండపైన వేసుకొన్నాడు వెధవ. సస్పెండు చేశారనే సిగ్గులేకుండా పూరం తాయే ముఖంలో తిరుగుతున్నాడో" నని ముకుందరావు తన భార్యతో యేకరువు పెడ్తూంటే, గదిలో కూర్చొని వింటూన్న మధుమూర్తికి పట్టరాని ప్రకోపం కలిగి బయటికొచ్చి, "నాన్నా! మీరు పొరబడుతున్నారు. నా తప్పేమీ లేదు. రేపు విచారణలో తేలిపోతుందిగా. మీరేగా నాన్న, పోలీసు శాఖలో ఏదో పొరుగుతుందని అంగుల్లో చేరమని ప్రోత్సహించింది. విచారణలో నా పక్షం కాకపోతే మీ చెంతనుండి వెళ్ళిపోతాను. మీ కవమానం కలుగనీయ" నని వచ్చే దుఃఖాన్ని యెలాగో అపుకొని, యింటి నుండి చకచకా బయటికొచ్చేశాడు.

ఇంటి నుంచి సరాసరి పార్కుకొచ్చి ఓ మూల బెంచీలో కూర్చొన్నాడు. రేడియో సిలోన్‌లో లతా మంగేష్కర్ రికార్డు వీనుల విందుగా వినవస్తుంటే, మధుమూర్తి కది కర్ణకఠోరంగా వుంది.

"నా జాతక లక్షణమో, ప్రారబ్ధమో గాని నేను మంచికి పోదామన్నా ప్రతిదానికీ చెడు యెదురౌతూంది. అడుగడుక్కీ నా మీద అనుమానమే. నాకీ జన్మలో బాగుపడే రోజులు భగవానుడు కలుగజేయడా?" అని విసుక్కున్నాడు మనస్సులో మధుమూర్తి. అతని స్మృతిపథంలో తనకు తెలిసి కష్టాలు ప్రారంభమైన ఘట్టాలు మెలగసాగాయ్.

* * *

మధుమూర్తి ఇంటర్ తప్పాడు. వాయిదాల పద్ధతిని సెప్టెంబరూ, మరో మార్చి పరీక్షల కెళ్ళాడు. చివరి కెలాగో యింటర్ గట్టుదాటాడు.

అదేమిటో మాంచి శరీరధాటీ వుంటే చదువబ్బదు. చదవబ్బని సూచనలుంటే యేపుగా పెరిగే లక్షణాలుంటాయి! అక్షరాలా మధుమూర్తి విషయంలో యిది నిజమైంది. పద్దెనిమిదేండ్లకే అయిదడుగులా, అయిన్నరంగుళాల పొడవూ, ఆ పొడుక్కి తగ్గ విగ్రహపుష్టి, వెడల్పై ముందుకుబొచ్చిన ఛాతీ, ముంగురు జుత్తుతో గూడిన ముఖవర్చస్సులున్నాయి మధుమూర్తికి.

ముకుందరావు, మధుమూర్తిని బి. ఏ.

"కాశీరాజు"

దాకా చదివించి, ఐ. పి. ఎస్. పరీక్షకు కట్టించాలనీ, లేదా తుదకు సబ్ యిన్‌స్పెక్టర్ సెలక్షన్ కన్నా పంపుదామని వువ్విళ్ళూరుతున్నాడు. కానీ, ఆశ నిరాశయింది. మధుమూర్తి ఇంటర్ పూర్తిచేశాక, కాలేజీ కెళ్ళి బి. యే చదవనంటే, చదవనని పట్టుబట్టాడు. గారాబం చేసిన తండ్రికి, మధుమూర్తిది మూర్ఖపు పట్టని తెలుసు. ఎవరిమీదైతే ఆశలుపెట్టుకొని, అతని వుజ్జ్వల భవిష్యత్తుకై యెదురుచూస్తున్నాడో అట్టి మధుమూర్తి ఎదురుతిరిగాడు. ముకుందరావుకు విసుగుపుట్టింది. వాడివాడి కర్మకొద్దీ పోతారని తన ఆశాజ్యోతి నార్పేసుకొన్నాడు. ఇహ మధుమూర్తి మొదలే నాన్న అదుపాజ్ఞలకు బద్ధుడుకాక అల్లారుముద్దుగా వుంటున్నాడాయె. ఆయన చివరింపుతో యిప్పుడు మరీ స్వేచ్ఛాజీవయ్యాడు.

వేళ కింటికివచ్చి, భోజనంచేయడం, స్నేహితులతో తెగతిరగడం, పత్రికలు చదువుతూండడం అతని దినచర్యలయ్యాయి.

మధుమూర్తికి డిటెక్టివ కథలంటే, పత్రికలంటే మహా మోజు. ఆ కథల్నీ, నవలలను చదువుతూంటే డిటెక్టివ్‌లు వాలి, పరశురామ్. అశ్వత్థామ, రంగధామ్, దేవదాస్ జయరాం—వీళ్ళలాగ తనెంగు కవకూడదనే ఆతురత పెల్లుబుకుతూండేది. కాని మధుమూర్తికి బాగా తెలుసు. ఇప్పుడు అసంఖ్యాకంగా వెలువడే డిటెక్టివ్ నవలల్లో, కథలలో తారసపడే అపరాధ పరిశోధకులు నామమాత్రులేననీ, మనదేశంలో ప్రైవేట్ డిటెక్టివులు లేరనీ, ప్రభుత్వ పక్షంలో మాత్రమే 'సి ఐ.డి.' శాఖ వుందని.

నాన్నగారి మాటలువిని "బియ్యేలో చేరకపోయానే, బియ్యే ప్యాసై సబ్ యిన్‌స్పెక్టర్ సెలక్షన్‌కు ప్రయత్నం చెయ్యకపోయానే," అని అనుకొనేవాడు.

ఆరోజు రీడింగ్‌రూమ్‌లో "హిందూ" పేపర్ చుట్టూరా తన స్నేహిత బృందమంతా గుమికూడివున్నారు. గుంపులోనుంచి యివతలికొచ్చే, రామారావుని "ఏమిటోయ్! ఆ పేపర్లోని విశేషాలు. అంత ఆసక్తిగా చూస్తున్నా"రని అడిగాడు మధుమూర్తి.

అన్నట్టు మధూ "నీకు బలే ఛాన్సోయ్ బాయ్. సర్వీస్ కమీషన్ పరీక్షా ప్రకటన నీవూ కట్టు. పోలీసుశాఖనుకోరుకో. మీ నాన్నగారి కోరిక ప్రకారం ఎస్. ఐ. అయ్యేందుకు అవకాశముంటుంది. గుమాస్తాలకు కూడా డిపార్టుమెంటు సెలక్షనుంటుంది, తెలుసా?" అన్నాడు రామారావు.

"మనమేమీ పట్టభద్రులం కాము."

"ఒరి దద్దమ్మా నీకు ఆ డిటెక్టివ్ నవలా ప్రపంచం తప్పితే లోకజ్ఞానం శూన్యం. బియ్యేకి ప్రైవేటుగా కట్టి చదవవొచ్చు, సర్వీసు మూడేండ్లుంటె ఠంలోగా అనుభవం, డిపార్టుమెంటువాళ్ళతో పొందిన పరిచయం వల్ల సెలక్షన్ సంపాయించడం సులభంరా" బదులిచ్చాడు రామారావు.

"నీ సలహాకు థాంక్సురా" అని చెపుతూ ఇంటికొచ్చేశాడు మధుమూర్తి.

మరునటిరోజే సర్వీసుకమీషన్ ఆఫీసుకు దరఖాస్తుఫారం, ఇతరవివరాలు పంపమని కోరుతూ రాసేశాడు.

మధుమూర్తి తండ్రిని పరీక్ష రుసుంకోసం పదిరూపాయ లడిగాడు, పోలీసు డిపార్టుమెంటును కోరుకుంటానని, అవతల ఎస్.ఐ. అయ్యేందుకున్న అవకాశాలను వివరిస్తూ.

కొడుకు ప్రయోజకు డవుతాడని, పోలీస్ ఉద్యోగం పొందుతాడని పొంగిపోయి, వెంటనే పదిరూపాయ లిచ్చాడు ముకుందరావు. ఇదిగాక మరునాడు "హిందూ స్టాక్ ఇయర్ బుక్కు"కట్టి, తన స్నేహితుని

సలహామీద తెచ్చిచ్చాడు మధుమూర్తికి.

స్వతహాగా తెలివితేటలున్న మధుమూర్తికి పోలీస్ డిపార్టుమెంటులో గుమాస్తాగా అనుకున్నట్టే సెలక్షనొచ్చింది. ఊళ్ళో జిల్లా పోలీసు ఆఫీసులోనే ఉద్యోగమవటం తండ్రీ కొడుకులిద్దరికీ పరమానందమైంది.

ప్రారంభంలో పోలీస్ సిబ్బంది ప్రయాణపు బత్తా బిల్లులు తనిఖీ చేసి, మంజూరు చేయాల్సిన స్థానంలో మధుమూర్తిని వేశారు. మధుమూర్తి నిబంధనల్ని అమూలాగ్రంగా ఆకళింపుచేసుకొని, బీద కానిస్టేబుల్స్ తాలూకు బిల్లుల్ని ఎప్పటికప్పుడే ప్యాసు చేస్తూ, వారి మన్ననల్ని పొందుతున్నాడు. చురుకుదనంతో, జాగుచేయకుండా బిల్లులను మంజూరు చేయటంవల్ల పోలీస్ ఇన్స్పెక్టర్లు మొదలు కానిస్టేబిల్సువరకు మధుమూర్తిపై మెండైన అభిమానం ఏర్పడింది. ఆఫీసుపని మీద వచ్చిన ఎస్. ఐ. లు, పోలీసులూ మధుమూర్తి దగ్గరకొచ్చి ఆప్యాయతతో నమస్కరించి వెళ్ళుతూండేవారు. దీనికి తోడు మేధావని డిపార్టుమెంటులో పేరు గడించిన ఆఫీసు మేనేజర్ కమలాకరరావు ప్రోత్సాహం మధుమూర్తి పనితనాన్ని ద్విగుణీకృతం చేసింది.

మూడు సంవత్సరాలు కాల గర్భంలో లీనమయ్యాయ్. కాల గమనాన్ని కనిపెట్టిన మధుమూర్తి యీలోగా డిపార్టుమెంటు పరీక్షలలో కృతార్థుడై ప్రథమ శ్రేణి గుమాస్తా అయ్యాడు. బి. య్యే. పరీక్షకు ప్రైవేటుగా కూర్చోబోతున్నాడు.

మేనేజర్ కమలాకరరావుకు బందరు బదిలీ అయింది. అతను వెళ్ళిపోతూ, మధుమూర్తి ప్రతిభనుబట్టి, పోలీసు సిబ్బందిపై క్రమశిక్షణలు, వాటిపై అపీళ్ళను చూచే స్థానంలో మధుమూర్తిని వేయించాడు. తన తీరిక సమయాల్లో మేనేజర్ అభిమానంతో అన్ని సీట్లలోని పనుల్ని గ్రహించుకొని, అనుభవం గడించిన మధుమూర్తికి కొత్తపని అంత కష్టమనిపించలేదు. క్రమశిక్షణల కాగితాలను నిశితంగా పరిశీలించి, న్యాయబద్ధమూ, నిష్పాక్షికమైన నిర్ణయాలను రాసేవాడు. జిల్లా పోలీసు అధికారికూడ వీనిని గ్రహించి, మధుమూర్తి రాసిందే వేదవాక్కుగా తీసుకొని క్రమశిక్షణల కేసుల్ని సులభంగా పరిష్కరించేవాడు.

కమలాకరరావు స్థానంలో నారాయణశర్మ మేనేజల్ గా వచ్చాడు. అతడు ఆఫీసు సిబ్బందిలోని, ప్రతి గుమాస్తా పనితనాన్ని, ఆఫీసర్ దృష్టిలో వారి వారి స్థానాల్ని క్షుణ్ణంగా పరిశీలించాడు. మధుమూర్తి పేరు ఆఫీసులో అందరినోటా విన్నాడు. ముఖ్యంగా డి. ఎస్. పి. అన్ని విషయాలలో మధుమూర్తి సలహాల్ని తీసుకోవడం, ఆఫీసుకంతటికీ సిబ్బందిపై అధికారిగా తన తాహతులు గుర్తించి, తగు ప్రాధాన్యం యివ్వక పోవటం నారాయణశర్మకు కన్ను కుట్టినట్లయింది.



"గురో! ఈవాళ ఎంచేతో చెయ్యి కాస్త వణుకుతోంది. తమరే ముట్టించుకోరాదూ బీడీ"

నారాయణశర్మ నివురు గప్పిన నిప్పు. తన అడుగు జాడలలో నడిచి, తను చెప్పినట్లు విని, తనని 'మేనేజర్', 'మేనేజర్', అని స్తోత్రం వల్లించే గుమాస్తాలు పనిచేయక పోయినా, వారు మంచి పనివాళ్ళని అధికార్ల చేత మెప్పించే మెదడుంది. సందిని, పందిగా మార్చగల మొనగాడు. డిపార్టుమెంటులో ఢక్కా మొక్కీలు తిని, పాతిక సంవత్సరాల సర్వీసులో యెన్ని అవకతవకలు చేసినా తన చాకచక్యం వల్ల ఆఫీసర్లను బుట్టలో వేసుకొని పేరు ప్రఖ్యాతులు పొంది, పైకొచ్చిన పనివాడు. ఈ "శర్మ" అని పిలువబడే, నారాయణశర్మ చేతిలో చిక్కాడు మధుమూర్తి. ఆనాటినుండి శనిదశ ప్రారంభమైంది మధుమూర్తికి.

శర్మ ఆఫీసులోని పెర్సనల్ అసిస్టెంట్ వెంకట్రామయ్యను కూడా తనవైపుకు తిప్పుకున్నాడు.

వెంకట్రామయ్య వుమ్మడి మద్రాసు రాష్ట్రపు ప్రధాన పోలీసు ఆఫీసులో గుమాస్తాగా చేరి, ఆఫీసర్లను తన కల్లాకపటాలతో మెప్పించి, పైకొచ్చి, ఇప్పుడు గెజెటెడ్ ఆఫీసరై కూచున్నాడు. పైగా తిర్పతి శ్రీ శ్రీ వెంకటేశ్వర స్వామివారి భక్తుగా తన మేజామీద ఓ ప్రక్కన భగవద్గీత పుస్తకమెప్పుడూ వుంచుకుంటాడు. ఫైళ్లు లేని సమయాలల్లో గీతా పారాయణం చేస్తూ వుంటాడు. ఆ పారాయణ చిత్తశుద్ధితో చేస్తాడో లేక నటనో గీతోపదేశం చేసిన ఆ శ్రీకృష్ణ పరమాత్మునికే తెలియాలి. రాష్ట్ర ప్రధాన ఆఫీసులో పని చేశాననే గర్వం యితనిలో తొణికిసలాడుతూ వుంటుంది. ఆఫీసులో సూపరింటెండెంట్లు సుబ్బారాయుడూ, రంగనాథం, గుమాస్తా సుబ్బయ్యా మాత్రమే ఇతనికి నమ్మినబంట్లు. వీరుకూడ తమ కపట నమ్మకాల్ని పెంపొంద చేసుకునేందుకు అహర్నిశలు ప్రయత్నిస్తుంటారు. ఇలాంటి వెంకట్రామయ్య కూడా మేనేజర్ శర్మ



"భీతహరిణేక్షణ"

చిత్రకారుడు : రావాడకృష్ణ

★ ఫలించిన కోరిక ★

ఘాటికి తట్టుకోలేక దాసోహమన్నాడు.

మధుమూర్తికి తనసీట్లో పరిశీలించాల్సిన కాగితాలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయి కాబట్టి అందరి గుమాస్తాలతోబాటు ఆఫీసునుండి సాయంకాలం మేనేజర్‌తో పాటు ఇంటికి వెళ్ళక, సుమారు యేడున్నర గంటలవరకూ ఆఫీసులో పనిచేస్తూ, తిన్నగా ఇంటికి వెళ్ళిపోతున్నాడు మధుమూర్తి. మధుమూర్తి ప్రవర్తనను శర్మ వేరువిధంగా తలచాడు. ఆంతరంగిక క్రోధాగ్ని ఎక్కువైంది శర్మకు.

శర్మ మధుమూర్తిని చేరదీసి మంచి మాటలతో అభిమానపాత్రం చేసుకొన్నాడు. కపట మెరుగని మధుమూర్తి శర్మమాట ప్రకారం ఒక కేసులో న్యాయవిరుద్ధంగా వుండే తీర్పును సూచించాడు. ఇదే సమయమని మేనేజర్ వెళ్ళి డి. ఎస్. పి. తో యీ కేసులో మధుమూర్తి సబ్‌యిన్‌స్పెక్టర్ దగ్గర లంచం తీసుకొన్నాడని చెప్పాడు. మధుమూర్తి నడత నెరిగిన డి. ఎస్. పి. క్షణమాలోచించి "మేనేజర్! మీరు వట్టి మాటలుచెప్పి, ఫిర్యాదుచేస్తే సరిపోదు కొంత ఋజువు చూపాలి. సాక్ష్యాధారాలుంటేనేగా... మీకు తెలియందేముంది," అన్నాడు కచ్చితంగా.

"వ్యవహారం బెడిసికొట్టిందే" నని మనస్సులో అనుకుని "అలాగేసార్ కనిపెట్టి మీకు పట్టిస్తా"నని సెలవు పుచ్చుకొని తిరిగొచ్చేశాడు శర్మ.

శర్మ వెళ్ళిపోగానే డి. ఎస్. పి. ఒక కానిస్టేబిల్ని పిల్చి, మధుమూర్తిని రహస్యంగా పిలుచుకొని రావలసిందని పురమాయించాడు.

మధుమూర్తి రాగానే డి. ఎస్. పీకి నమ్రంగా నమస్కరించాడు.

డి. ఎస్. పి. మధు మూర్తికేసి చూసి "మిస్టర్ మధూ కుమార్ కేసులో మీకలం తప్పుదారిపట్టిందే. ఈకేసులో స్పెషల్ బ్రాంచి సి. ఐ. డీలు పట్టుదలతో వున్నారనేమాట మరచిపోకు. కుమార్‌తో నీవు చేతులు కలిపినట్లు తెలుస్తూంది. కొంచెం జాగ్రత్తగా మసులుకో" అని హెచ్చరించాడు.

ఈమాటలు వింటూంటే మధు మూర్తికి రక్తం పొంగింది. ధైర్యం తెచ్చుకొని, డి. ఎస్. పి. తో తన చనువును పురస్కరించుకొని, "మీకు నాసంగతి తెలుసు కదండి. నిజమే కుమార్ కేసులో మొన్నటి నోట్ అతనికి అనుకూలంగా వ్రాసినమాట వాస్తవమేనండి. మేనేజర్ గారి ప్రోత్సాహంతో వ్రాశాను కుమార్‌ను నేను నిజంగా యెరగనండి. ఇక మీదట జాగ్రత్తగా వుంటానండి" అని బదులిచ్చాడు.

డి. ఎస్. పి. యీ విషయంలో యెక్కువగా మధుమూర్తిని మందలించి నిరుత్సాహపరచకూడదనుకొని, "ఇక వెళ్ళు మధూ" అన్నాడు.

"సెలవు సార్" అంటూ వచ్చేశాడు మధుమూర్తి.

మధుమూర్తి మురుసటిరోజునుండి మేనేజర్‌తో ముభావంగా వుంటున్నాడు. కొన్ని కేసుల ఫైళ్ళను, మేనేజర్ అడిగితే, ధైర్యంతో "యిప్పుడే డి. ఎస్. పి. గారు కబురుపెడితే వాటిని పంపాను సార్" అని సమాధానం చెపుతున్నాడు.

శర్మకు మధుమూర్తిని లొంగదీసే దెలాగని శంకపట్టుకొంది. వెంటనే యుక్తొకటి, టక్కున ఆలోచనకొచ్చింది. తాత్కాలికంగా వుద్యోగంనుంచి తప్పింపబడిన సబ్‌యిన్‌స్పెక్టర్ కుమార్‌కు, రహస్యంగా తనని కలుసుకోమని ఒక వుత్తరం రాసేడు. శర్మగారి కబురందగానే, కాకిలాగ వాలేడు కుమార్. అతనికి రహస్యబోధనలేవో చేశాడు శర్మ. "అలాగే. సాయింత్రం చేస్తానండి" అని చెప్పి, వెళ్ళిపోయాడు కుమార్.

'ఆనందభవన్'లో కాఫీ త్రాగి, బిల్లు

తీసుకొని లేచి యిలా చూశాడు మధుమూర్తి. ఆఫీసు పి. యే. గారు, మేనేజర్ గారు హోటల్ కేఫ్ బల్ల దగ్గరనుండి తనని చూచి, వెంటనే బయటున్న, జీపులో యెక్కి క్షణంలో వెళ్లిపోయారు. అలా తలెత్తి చూచేటప్పటికి యెదురుగా ఆజానుబాహుడైన, మఫ్టీలో వున్న సబ్ యిన్స్పెక్టరులా వున్న వ్యక్తిని చూశాడు. మధుమస్తిష్కంలో ఆలోచన యేదో మెరిసింది. మేనేజర్ ఆడిన నాటకం అర్థమైంది. ఎగుటి వ్యక్తివెంబడి క్యాష్ కౌంటర కు దారి తీశాడు మధు. బిల్లు చెల్లించేటప్పుడు ఆ వ్యక్తి మోచేతి అడుగుభాగంలో పచ్చపొడుపుతో 'కుమార్' అని అగుపించింది. మధుమూర్తి హుషారువా ఆలోచించి మేనేజర్ కు తంత్రాన్ని గ్రహించాడు. రైల్వేస్టేషనకు వెళ్ళే కుమార్ ను అతనికి తెలియకుండా వెంబడించాడు. కానీ, స్టేషన్ కు వెళ్ళినవెంటనే రైలురావడం, కుమార్ బండెక్కి వెళ్ళిపోవడం జరిగింది. నిరాశతో తిరిగొచ్చేశాడు మధుమూర్తి.

మరుసటిరోజు మధుమూర్తి తనని తాత్కాలికంగా పనిలోనుంచి తొలగించినట్లు జారీచేయబడిన వుత్తరువును చూచి నిర్విణ్ణుడయ్యాడు. అందులో మధుమూర్తి, కుమార్ తాలూకు కేసు ఫైల్లోనుంచి ఒక ముఖ్యమైన కాగితాన్ని తొలగించినట్లు అభియోగం సూచింపబడింది. దీని కాధారంగా కుమార్ నూ, మధుమూర్తిని రైల్వే స్టేషన్లో చూశానని సి. ఐ. డి. పోలీసు సాక్ష్యం పేర్కొనబడింది. ఏమాత్రం కలవరపడక "దేవుడున్నా" డనుకున్నాడు మధుమూర్తి.

నాల్గోరోజు విచారణ. విచారణకర్తగా విజయవాడ రేంజీ డిప్యూటీ పోలీసు ఇన్స్పెక్టర్ జనరల్ వచ్చాడు. ఉదయం శర్మ డాక్ బంగళాలో మకాంచేసిన డి. ఇ. జీని సందర్శించాడు. డి. ఎస్. పి. గా వున్నప్పుడు ఆయనొద్ద తాను పనిచేసినవ్వటికి, చీవరింపుతో యిప్పుడు మాట్లాడడం శర్మకు హాయెత్తింది. ఇక ఒకగంటలో ప్రారంభం కానున్న విచారణకు కుమార్ యింకా హాజరు కాకపోవడంతో శర్మ మరీ భయపడ్డాడు.

ఆఫీసులో డి. ఇ. జీ. పోలీసు సూపర్నెంటు కూర్చొని మాట్లాడుతుంటే, శర్మ కలుగజేసుకొనివెళ్ళి, తన పూర్వపు చనువును పురస్కరించుకొని, కేసు విచారణకు, మధుమూర్తిని పిలిపించమంటారండీ?" అని డి. ఇ. జీ. కేసి చూచి వినయంతో అన్నాడు. డి. ఇ. జీ. కి అరకాలిమంట నెత్తికెక్కి, "ఏమిటోయ్, ఆ నక్క వినయాలు! ఇలా యెంతమంది అమాయకులకు అన్యాయం చేశావు. కేసట—విచారణంట. ఇదిగో. తీసుకో. నిన్ను వుద్యోగంనుంచి శాశ్వతంగా తప్పించినట్లు ఆర్డర్" అని గది గోడలదిరేలా గర్జించాడు. శర్మ యీ మాటలు వినగానే అతనిశరీరం కప్పగా కూలిపోయినట్లయింది.


"కుమార్ రైలు దిగేటప్పుడు బూటుజారి క్రిందపడి, స్పృహతప్పి, మైకంలో నిజం చెప్పడం, రైల్వే పోలీసులు ఆ మాటలాధారంగా అతని సూట్ కేసులో వెతికి ఈ శర్మ కుమార్ కు వ్రాసిన వుత్తరం, ఫైల్లోనుంచి పోయిన డాక్యుమెంటు చేజిక్కించుకోవడం జరిగింది. ఆపైన కుమార నిజం వొప్పుకుంటూ పశ్చాత్తాపంతో వ్రాసిన స్టేటుమెంటు మూలంగా పాపం! మధుమూర్తి అమాయకత్వం బయటపడిం"దంటూ శర్మ కేసి చూసి "నీమీద క్రిమినల్ చర్యకూడ వుంద"ని ముగించాడు.

భయపడ్తూ వచ్చిన మధుమూర్తి డి ఐ. జీకి నమస్కరించి అతని దగ్గరికెళ్ళి వణికే చేతుల్లో తీసుకొన్న కాగితన్ని చదివి, ఆనందంతో మళ్లీ నమస్కరించాడు. మధుమూర్తిని సబ్ యిన్స్పెక్టరుగా వేసినట్లుగా ఆర్డరది.

కేసు విచారణ—తీర్పును గూర్చి తెలుసుకో వచ్చిన ముకుందరావు మధుమూర్తిని సబ్ యిన్స్పెక్టరుగా వేశారని వినగానే కొడుకు తాలూకు నిజాయితీని ప్రశంసించలేదు గాని, మనస్సులో "మావాడు సబ్ ఇన్స్పెక్టరయ్యాడు. నా కోరిక నేటికి ఫలించిం"దనుకొని ఆనందబాష్పాలు రాల్చాడు. ★


హాయి హవాయి

అమెరికాలో యాత్రికుల...



హవాయిదీవులలో పంచదార పరిశ్రమ చాలా ముఖ్యమైనది! చిత్రంలో ఉన్నదొక పంచదారమిల్లు.

హానలూలూ పొలిమేరలలో ఉన్న



హవాయిదీవులు నూరేళ్ళ క్రితం సుందర సాగర తీరాలతోనూ, నయనానందకరమైన పుష్పవనాలతోనూ ఎక్కడో అదో ప్రపంచంలో ఉన్నట్టుండేవి. ఈనాడు అదొక ముఖ్య పారిశ్రామిక కేంద్రం, ప్రముఖ నౌకా కేంద్రం, పసిఫిక్ 'కూడలి స్థానం'.

ఇంతవరకు టెరిటరీగా ఉండి. ఇప్పుడు అమెరికా సంయుక్త రాష్ట్రాలలో 50 వ రాష్ట్రంగా నూతన ప్రతిపత్తి పొందుతున్న ఈ దీవులు కొత్త కొత్త కట్టడాలతో, మంచి మంచి పరిశ్రమలతో సముద్రాంతర వాణిజ్యంతో దినదిన ప్రవర్ధమానమవుతున్నవి. ఈ ప్రదేశం ప్రపంచం నలుమూలలనుండి లక్షలాది యాత్రికులను ఆకర్షిస్తూంటుంది. దీనికి ముఖ్య ఆదాయ మార్గాలలో ఇదొకటి. ఇచటి ప్రకృతి రామణీయకం, ప్రశాంత వాతవరణము యాత్రికుల పాలిటి స్వర్గధామం అనిపించేట్లుగా ఉంటాయి. ఈ దీవుల ఆర్థిక వ్యవస్థలో యాత్రికులదే ముఖ్య భూమిక.

ఒకనాడు హవాయి దీవులు ఏదో మారుమూల ఉన్నట్లు అనిపించేవి. అక్కడి వాళ్లు వాళ్ళ ఆటలతో, పాటలతో వాళ్ళ లోకం వాళ్ళుగా ఉండేవాళ్ళు. ఈనాడు అదొక మెట్రోపాలిటన్ (సకల జాతుల సమ్మేళనం) ప్రదేశంగా రూపొందింది. ఇప్పుడక్కడ అనేక జాతుల, తెగల ప్రజలు సమరస భావంతో కలిసిమెలిసి పని పాటులు చేసుకొని జీవిస్తున్నారు. ఈ ప్రదేశం ఆనాటి ఆదశనుంచి నేటి ఈదశకు పరిణమించిన కథ సమాజాభివృద్ధికి చక్కని విదర్శనం వంటిది. ప్రపంచ సౌభ్రాత్రానికి సజీవ ఉదాహరణం వంటిది.

ప్రపంచంలో బహుశా మరెక్కడ ఇక్కడ చేరినన్ని జాతుల, తెగల ప్రజలుచేరి ఇంత తక్కువ కాలంలో ఇంత బాగాకలిసిపోయి ఉండలేదని సాంఘిక శాస్త్రవేత్తలంటారు.

హవాయ్ ఆదిమ వాసులు పోలినీషియన్ జాతులకు చెందినవారు. ఆంగ్లేయులు ఈదీవులకు రావటానికి ఎంతో పూర్వమే ఈ పొలినీషియన్ జాతి ప్రజలు ఈదీవులలో నివాసం ఏర్పరుచుకొన్నారు. ఆంగ్లేయులు ఇక్కడ 1778లో దిగారు. అప్పటికే అక్కడ పోలినీషియన్ రాజ్యాలు స్వతంత్రమైనవి ఉన్నవి. ఆంగ్లేయులు కొంతకాలం ఆ రాజ్యాలలో వారి క్రిందనే ఉన్నారు. ఆ తరువాత 1795 లో హవాయ్‌కి చెందిన ఒక రాజు రాజరికాన్ని స్థాపించాడు. ఈయన పేరు కామెహమేహ. ఈయన మిగతా దీవులలో చాల వాటినిజయించి తన అధికారాన్ని స్థిరపరుచుకొన్నాడు.

కాగా క్రిస్టియన్ మిషనరీలు 1820 లో ఈ ప్రదేశానికి వచ్చారు. వీరు ఈశాన్య అమెరికాలో న్యూ ఇంగ్లండులో ఏర్పరిచిన సాంస్కృతిక విద్యా జీవితం వంటిదే ఇక్కడా కల్పించారు. 1850 లో ఇక్కడ పంచదార చెరుకు పండించటం పెద్ద ఎత్తున ప్రారంభమైంది. ఇంగువల్ల పనివారి అవసరం హెచ్చింది. ప్రాచ్య పాశ్చాత్యఖండాల నుంచి తుగిడీలు తుగిడీలుగా ఇక్కడ పని పాట్లు చేసుకోవటానికి ప్రజలు చేరారు. వీరంతా హవాయి ఆదిమ వాసులతో కలిసి అక్కడి జనాభా పెరగటానికి తోడ్పడ్డారు. వీరి రాకతో చెరుకుపంట కూడా విస్తరించింది. ఈనాడు హవాయి దీవులలో ఏటా 10 లక్షల టన్నులకు పైబడిన ముడి చక్కెర ఉత్పత్తి అవుతున్నది.


హవాయి దీవులలో పైనాపిల్ పరిశ్రమ

...గొల్లపే
...దీవులు
50వ రాష్ట్రం
...ాలిపి స్వర్గం



హవాయి దీవులలో అనాస ఒక ముఖ్యమైన పంట. అనాస నాటటం ఇందులో చూడవచ్చును.

'క్రాస్‌రోడ్సు' విశ్వవిద్యాలయం.



రెండవది. దీనివల్లను కూడా ఇక్కడికి ఎంతోమంది వలసవచ్చారు. ఈనాడు ప్రపంచంలో ఉత్పత్తి అయ్యే మొత్తం పైనాపిళ్ళలో ఒక్క హవాయిదీవులలోనే నాల్గింట మూడు వంతులు ఉత్పత్తి అవుతున్నవి. 1900 లో మొదటసారిగా ఇక్కడ ఒవాహూదీవిలో పైనాపిల్ మొక్కలు నాటారు. ఆ తరువాత మూ౨ు సంవత్సరాలకు డబ్బాలలో పెట్టే పైనాపిల్ తయారైంది.

1894 లో హవాయి రిపబ్లిక్ అయింది. 1898 లో ప్రజల కోరికపై అమెరికా దీనిని తనలో చేర్చుకొన్నది. ఆ తరువాత రెండేళ్ళకు అది టెరిటరీ అయింది. హవాయి ప్రజలు అమెరికన్ పౌరులైనారు. శాన్‌ఫ్రాన్సిస్కో నగరంనుంచి హవాయి 2000 కు పైగా నాటికల్ (నావికా) మైళ్ల దూరాన ఉన్నది. అయితే విమాన ప్రయాణాలు సులభం, అధికం కావటంతో ఇప్పుడు ఈ దూరభారం బాగా తగ్గిపోయింది.

తత్ఫలితంగా హవాయి రాజధానీ నగరం హొనలూలూ జీవితం అమెరికన్ నగరాల జీవితం మోస్తరుగా ఆధునికమైపోయింది.

పందొమ్మిదో శతాబ్ది మధ్యకాలంలో హవాయిలో తోటలపరిశ్రమ ప్రారంభం కావటంతో అక్కడ పనిచేసేవారి అవసరం ఏర్పడింది. అప్పుడు జపాను, ఫిలిప్పీన్ దీవులు, చైనా, పోర్చుగల్, కొరియా, ప్యూర్టోరికో, స్పెయిను, జర్మనీ, పసిఫిక్ దీవులు, రష్యాదేశాలనుంచి అక్కడికి ప్రజలు వలసవెళ్ళారు.

ప్రజాస్వామ్య ప్రభావాలూ, పెంపొందుతున్న సన్నిహితత్వమూ క్రమక్రమంగా జాతిమత వగైరా అంతరాలను తొలగించజొచ్చాయి. అయితే కొన్ని తెగలవారు ఇప్పటికీ తమ పూర్వీకుల సంప్రదాయాలు, ఆచారాలు పాటిస్తూనే వున్నారు.

హవాయిలో ఎక్కడ చూచినా బౌద్ధ, షింటో మతాలయాలు, క్రైస్తవ చర్చిలు ఒకదాని సరసను ఒకటి కనపడుతుంటవి. జాపనీస్ చెర్రీ బ్లాజమ్ ఉత్సవాలు, చైనీస్ నార్సిసస్ ఉత్సవాలు ఏటా ఇక్కడ జరుగుతుంటవి. వీటికి అన్ని జాతులవారు వేల సంఖ్యలో హాజరై తిలకిస్తుంటారు.

పెరల్ హార్బర్ నౌకాదళ స్థావరం గలిగి అమెరికన్ పసిఫిక్ రక్షణ స్థావరాలలో హవాయి ముఖ్యమైనదిగా ఉంటున్నది. అందువల్ల ఇక్కడ సైనిక జనాభా హెచ్చుగా ఉంటుంది. పసిఫిక్ నౌకాదళాలకు పెరల్ హార్బర్ ప్రధాన కార్యస్థానం. ట్రాన్స్ పసిఫిక్ విమానమార్గాలలో పయనించే విమానాలకు కూడా ఇది ఆశ్రయంగా ఉంటున్నది.

ఈనాడు హవాయిలో వ్యాపారం ఇంత బాగా వర్ధిల్లుతుండటానికి నిపుణులు అనేక ప్రధాన కారణాలు చెబుతారు. మధ్య పసిఫిక్ ప్రాంతంలో ఉండి ప్రాచ్య, పాశ్చాత్య ప్రపంచాలమధ్య సేతువుగా ఉండి ఉభయఖండాల ప్రజల శక్తియుక్తులకు కూడలిగా ఉండటంవల్ల కూడా ఇది జరుగుతున్నదంటారు.

ఇక్కడ వాతావరణం సంవత్సరం పొడుగునా చాలా బావుంటుంది. ఆరోగ్య ప్రదమైన నివాసప్రాంతం కావటమే గాక ఇక్కడి శీతోష్ణపరిస్థితి వ్యవసాయానికి సైతం ఎంతో అనుకూలంగా ఉండి బాగా పంటలుపండుతాయి. వేసవిలోనూ సీతాకాలంలోనూ, చెరుకు పండిస్తారు. ఇక్కడి సముద్రంలో ఏడాదిపొడుగునా చేపలు పడు



హవాయిదీవులు

తుంటారు. సముద్ర మధ్యప్రాంతంలో వెలసినదీవులు గనుక నౌకా వాణిజ్యానికి ప్రధాన కేంద్రమైనాయి.

హానలూలూ రేవులో ఏటా 1000 నౌకలువచ్చి సరుకు ఎత్తుకుపోతుంటవి. దించిపోతుంటవి. హవాయిలో 18 విమానాశ్రయాలు వున్నవి. విమాన రవాణా కూడా చాల హెచ్చుగా వుంటుంది.

హవాయిలో విలువైన ఖనిజాలు ఏవీ లేవని ఒకప్పుడు భావించేవారు. కాని ఇక్కడ టిటేనియం, బాక్సయిట్, లావా, యాష్, రాక్ వంటివి లభించగలవని ఇటీవలనే తేలింది. హవాయిలో ఉష్ణమండలపు గట్టికలప, యూకలిప్టస్, రెడ్ వుడ్ వంటివి బాగా దొరుకుతవి.

అనేక సంవత్సరాలవరకు హవాయి సంపద కొన్ని కుటుంబాల చేతులలో వుండేది. ఆకుటుంబాలవారు ఇప్పటికీ చెరుకు, పైనాపిల్ పరిశ్రమలలో చురుకుగానే పనిచేస్తున్నారు. అయితే ఇప్పుడు అనేక చిన్న చిన్న వ్యాపారసంస్థలు వెలసి ఇటీవలి కాలంలో చాలాభాగం పరిశ్రమలు నిర్వహిస్తున్నవి. ఈసంస్థల నిర్వాహకులలో అనేక జాతులవారున్నారు.

ఈనాడు హవాయి అభివృద్ధి కృషిలో పాల్గొంటున్నవారిలో హెన్రి జె. కెయిజర్ అనే అమెరికన్ పారిశ్రామికవేత్త హవాయిలో కొద్దిరోజులు విశ్రాంతికని వెళ్ళి అక్కడే స్థిరపడిపోయాడు. ఆయన 8000 మందికి నివాసయోగ్యంగా హవాయి గ్రామం ఒకటి నిర్మిస్తున్నాడు.

హవాయి కొత్త పరిశ్రమలూ, కొత్త యాత్రికులతోపాటు, ప్రస్తుతం తాను గుదిమతి చేసుకొంటున్న కొన్ని వస్తువులు వుత్పత్తిచేసే చిన్నతరహా కర్మాగారాలు కావాలను కొంటున్నది. ఇట్లా ఇటీవల ప్రారంభించినవాటిల్లో దుస్తుల ఫ్యాక్టరీ ఒకటి. ఇక్కడ ముఖ్యంగా స్పోర్ట్సుదుస్తులు పోలినీషియన్ కట్టుదుస్తులూ తయారుచేస్తారు. అమెరికానుంచి ఒక సంస్థవెళ్ళి నూనెశుద్ధి కర్మాగారం ఒకటి స్థాపించింది.

కొత్త వ్యాపారమూ, పెట్టుబడులకోసమని అక్కడి వాణిజ్యమండలి ప్రపంచానికి రెండుసౌకర్యాలు ఎరగా చూపుతున్నది. ఒకటి, ఈప్రదేశం యాత్రికులపాలిటికి స్వర్గధామంలాగా వుంటుంది. ఆధునిక సౌకర్యాలు అన్నీ ఇక్కడవున్నవి. వ్యాపారాభివృద్ధికి అపార అవకాశాలున్నవి. ★



ఆంధ్ర మహాభారతము

ఆ ది ప ర్వ ము - ష ష్ఠా శ్వా స ము

సీ. ఇతనివిక్రమ మాశ్రయించియకాదె య,వ్వెడలక్కయిల్లు వెల్వడఁగంటి
మడవిలో నిద్రావశాత్ములమై యున్న, మననిద్రఁ జెఱుపఁగా దని హిడింబు
నెడ గల్గఁ గొనిపోయి యెక్కటి నంపిన, దండితశత్రుఁ డీ తండ కాఁడె
యితనిబల్మిన కాదె యెంతయు భీతులై, ధృతరాష్ట్రనందనుల్ ధృతిదలంకి

ఆ. నిద్ర లేక తమకు నిలుచునుపాయంబు, లొండు దక్క వెదకుచున్నవారు
బలియు నిట్టిభీము బ్రాహ్మణార్థమ్ముగా, నసురవాతఁ ద్రోతు రవ్వ యిట్లు.

వ. అక్కట దుఃఖాతిశయంబున మతిభ్రమణం బయ్యెం గాకేమి యనినఁ గొడుకునకుఁ గుంతి యిట్లనియె.

ఆ. భ్రమవిమోహలోభ భయపరిభూత నై, కొడుకు విడువ నంత వెడఁగనయ్య
యేను వీనిశక్తి యెఱుఁగక పంచిన,దానఁ గాను వినుము వీనిశక్తి.

తే. వీఁడు పుట్టినపదియగు నాఁడు పెలుచఁ, బడియె నాచేతనుండి యప్పర్వతమునఁ
బడినవడిఁ జేసి బాలకు నొడలు దాఁకి, యాక్షణంబ రా లెల్ల నుగ్గయ్యెఁ జూవె.

వ అట్టి వజ్రకాయుండు వజ్రధరు నయిన నోర్వనోపునట్టి సమర్థుం డారక్కసు నశ్రమంబునం జంపి యిందుల బ్రాహ్మణులబాధ యుడుచుం బవనతనయు నుద్దేశించి సంతాపింప వలవదు మనకు సుఖనివాసంబు సేసి పరమోపకారి యైన యీ బ్రాహ్మణునకుఁ బ్రత్యుపకారంబు సేయ సమకూరె.

సీ. ఉత్తమక్షత్త్రియుం డొరులదుఃఖంబులు, దలఁగంగఁ బుట్టిన ధర్మశీలుఁ
డలయక మృత్యుభయంబైనచో విప్రుఁ, గాచి సత్పుణ్యలోకములు వడయు
ధన్యుఁ డై క్షత్త్రియు దయఁ గాచి బుధలోక,కీర్తనీయంబగు కీర్తివడయు
వైశ్యశూద్రులఁ గాచి వసుధాతలస్థిత,సర్వప్రజానురం జనము వడయు

ఆ. ననఘు సన్మునీంద్రుఁ డయినవేదవ్యాసు,వలన దీని నిక్కవముగ వింటి
బ్రాహ్మణులకుఁ బ్రియము పాయకచేయంగఁగాన్పచూవెపుణ్య కర్మఫలము.

క. జననుత బ్రాహ్మణకార్యము, ననఁ జేసిన బ్రాహ్మణ ప్రసాదంబున నీ
కును నీతమ్ములకును నగు, ననవరతశ్రీసుఖాయు రైశ్వర్యంబుల్.

వ. అనిన విని ధర్మతనయుండు గుంతీదేవి కారుణ్యబుద్ధికి బ్రాహ్మణభక్తికి ధర్మచిత్తయగుటకు సంతసిల్లి తానును భీమసేనుని నియోగించె నంత భీముం డవ్విప్రున కిట్లనియె.

ఆ. కడుపు నిండఁ గుడువఁ గానమి రేయెల్లఁ, గన్ను వొంద కున్నఁ గరముడస్సి
యున్నవాఁడ నాకు నోపుదు రేని యా, హారతృప్తిసేయుఁ డట్టులయిన.

ఆ. బలము పెద్ద గలిగి పాపిష్ఠు రక్కసుఁ, జంపి యిప్పురమున జనుల కెల్ల
హర్ష మేనొనర్తు ననవుడు విప్రుఁడు, దానుఁ జుట్టములును దత్క్షణంబ.

తరలము. పలుదెఱంగుల పిండివంటలుఁ బప్పుఁ గూడును నేతికుం
డలు గుడంబు దధిప్రపూర్ణ ఘటంబులుం గొని వచ్చి యా
నలఘుసత్త్వుఁడు మారుతాత్మజుఁ డన్నిటన్ గతఖేదుఁ డై
బలము గల్గి కడంగె నన్నియు బ్రాహ్మణార్థము సేయఁగాన్.

వ. ఇట్లు భీమసేనుం డిష్టాన్నోపభోగంబునం దృప్తుండయి భక్ష్యాన్నపూర్ణం బయిన శకటంబు నెక్కి దక్షిణాభిముఖుం డయి బకాసురుం డున్నచోటికిం జని యార్ద్రశుష్కాస్థిశకలదుర్గంధనిందితం బయిన బకస్థానంబు డాయక యెడ గలిగి యమునాతీరంబున శకటంబు నిలిపి యారక్కసుం బిలుచుచు వానివచ్చునంతకు మిన్నకుండనేల యని కాళ్లు గడిగికొని యాచమించి యాశకటంబుపయి కూడు గుడుచుచుండె నట బకాసురుండును.

ఆ. ప్రొద్దు నేఁడు పెద్ద వోయె నిత్యమునిట, తెచ్చియిచ్చుబలియుఁ దెచ్చి యీఁగ
నొల్ల కెలుఁగు లిచ్చు చున్నవాఁ డమ్మను,జాధముండు మెచ్చఁ డయ్యెననుచు.

ఆ. అలిగి యాఁడుగఱచి యాఁకటి పెలుచన,నిలువ లేక యసుర నింగి దాఁకఁ
బెరిఁగి యరుగుదెంచె భీమరూపంబుతో, నుగ్రభంగి భీముఁ డున్నదెసకు.

సీ. చనుదెంచి ముందట శకటంబుపైనుండి, యోదక కుడుచుచు నున్నభీము
దవ్వులఁ జూచి నిత్యము నాకు నియమించి, కొనివచ్చుకూడేల కుడిచె దీవు
గడుఁ గ్రొవ్వి రేకచక్రంబునవారలు, కే నింతయొల్లిద మేల యైతి
నని డాయ వచ్చి యయ్యనిలనందనువీఁపుఁ,బిడికిటఁ బొడిచిన బెదరక సుర

ఆ. వలనుసూడ కొండు వగవక యొప్పటి,యట్ల కుడుచు చున్న నలిగి బకుఁడు
వీనిబాగు సూడ వేఱంచు డాసిన, తరువుఁ బెఱికికొనుచుఁ దాఁకుదెంచె.

వ. అంతకు ముందఱ భీమసేనుండంతకూడునుం గుడిచి యనంతబలసమేతుండై యంతకాకారంబున మల్లసఱచుకొని యార్చుచు

ఉ. ఇంచుకయేని పాపమున కెన్నఁడు రోయక యెల్లవారి బా
ధించి మనుష్యమాంసములు దించును గ్రొవ్వితి వాని నెల్లఁ గ్ర
క్కించెద నీమదాంధ్య మడఁగించెద నిప్పుడు కాలుఁబ్రోలి కేఁ
గించెదఁ జక్కనై నిలుము గిట్టి రణంబున రాత్రిసాధమా.

భీమసేనుండు బకాసురుం జంపుట

వ. అనుచు సమీరణసుతుండు దనసమీపంబుననున్న విశాలసాలవృక్షంబు వెఱికికొని రక్కసుపైవైచిన వాఁడును దన చేతివృక్షంబున దాని భగ్నంబుఁ జేసె నిట్లిరువురు నొక్కవడి వృక్షయుద్ధంబుసేసి యాసన్నమహీరుహంబులు సమసిన మల్లయుద్ధ సన్నద్ధులై.

చ. పరువడి నొండొరుం బెనఁగి పట్టుచుఁ ద్రోచుచు నీడ్చుచుం బర
స్పరజయకాంక్షులైన బక పాండవవీరుల పాదఘట్టనన్
ధరణితలంబు గ్రక్కదలెఁ దన్నికటద్రుమవల్లు లెల్ల జ
ర్జరితము లయ్యె నిష్ఠుర విశాలశిలల్ నుఱుమయ్యె నయ్యెడన్.

ఉ. ఇద్దఱహుంకృతిధ్వనులు నిద్దఱభూరిభుజారవంబు న
య్యిద్దఱముష్టిఘాతజనితోదితదారుణ నిస్వనంబు న
య్యిద్దఱ పాదఘట్టితమహీరవముల్ విని చూప తెల్లనుం
దద్దయుభీతి నచ్చటికిఁ దా రెడ గల్గఁగఁ బాఱి రొక్కఁడై.

వ ఇట్లు భీమబకాసురు లాసురంబున నెనంగి మల్లయుద్ధంబు సేయునెడ.

నక్షత్ర ఫలితాలు

[29 4 59 మొదలు 5 5-59 వరకు]

గ్రహ స్థితి.

బు కే	ర	శు	కు
	4 తేదీని శుక్రుడు మిథునములో ప్రవేశించును		
	మకర, కుంభ, మీన మేష రాసులలో చంద్రుడు		
శ	గు		రా

* అశ్వని [చూ, చే, చో, లా] *

ఈ వారము యత్న కార్యసిద్ధికి ఆలస్యము కలుగుతుంది. వర్తకులకు లాభము తక్కువ. ఆత్మీయుల ఆరోగ్యము చికాకు కలిగిస్తుంది. ఉద్యోగస్తులకు వనపర్వతప్రాంతములను బదిలీఅయే సూచనలున్నవి. రహస్యములను కనిపెట్టుటకు నియోగించబడుతారు. వారమంతా చికాకుగాయున్నా, వారాంతమందు అజ్ఞాతమిత్రుని సహాయమువల్ల కార్యసిద్ధి కలుగుతుంది.

* భరణి [లీ, లూ, లే, లో] *

ఈ వారము ధనాభావము ఎక్కువ. ఎవరి సహాయమువల్ల కార్యసాధన చేదామనుకున్నారో వారివల్లనే ఆటంకములు కలుగుతవి. అయినా దైవబలమువల్ల క్రమేణా కార్యానుకూలత అవుతుంది. ఇంట్లోవారి ఆరోగ్యము బాగుండదు. ఉద్యోగస్తులకు ఒత్తిడి, వర్తకులకు నిరాశ. వారమంతా ఆందోళనగావున్నా సాధుసాంగత్యము, పుణ్యక్షేత్ర సంచారము, నష్టద్రవ్యలాభము కలుగును.

* కృత్తిక [అ, ఈ, ఉ, ఏ] *

ఈ వారము అనుకూలతకన్న ప్రతికూలత ఎక్కువ. యత్న కార్యములు శ్రమాధిక్యముతో ఫలించును. కోర్టుదావాలు అనుకూలిస్తవి. పరోపకారానికి యత్నపడి సాగక నిందలు పొందుతారు. భార్య ఆరోగ్యము సరిగా వుండదు. ఇచ్చిపుచ్చుకోవడం పెద్దల వివాదాలు. ఉద్యోగస్తులకు అధికారుల ఒత్తిడి వున్నా తోటివారి సహకారము లభిస్తుంది. వారమంతా నిరాశగావున్నా వారాంతమందు కొంత కార్యసిద్ధి కలుగుతుంది.

* రోహిణి [ఓ, వా, వీ, వూ] *

ఈ వారము ఎన్ని అవాంతరములు వచ్చినను పట్టుదలతో ప్రయత్నించి కార్యలాభమును పొందుతారు. ఆశించిన సొబ్బు సమయానికి అందక అప్పు చేస్తారు. సోదర సహాయము కలుగుతుంది. ఆత్మీయులవల్ల నిందలు పొందుతారు. దెబ్బలుతగిలే ప్రమాదము జాగ్రత్తవల్ల తప్పవచ్చును. గనుల యజమానులకు, ఇంజనీరింగుశాఖ ఉద్యోగులకు, రంగులు, లోహపుసామానుల వ్యాపారస్తులకు కష్టముతోకూడిన యోగం. 4, 5 లలో ప్రమాద సూచన.

* మృగశిర [వే, వో, కా, కి] *

ఈ వారము మీకు యోగప్రదము. బంధువుల సహాయముతోనూ, అధికారుల సహాయముతోనూ ఆటంకములను గడిచి ఫలం పొందుతరు. ఆదాయము వృద్ధి అవుతుంది. వైద్య జ్యోతిషశాస్త్ర ప్రసంగాలు చేస్తారు.

బి. నరసింగరావు

ఈశాన్య దిక్కునుండి శుభవార్త తెలుస్తుంది. కవులకు, గణిత శాస్త్రజ్ఞులకు, శిల్పులకు, నటీనటులకు యోగకాలము. 30, 1, 2 తేదీలు ధనలాభము, కార్యసిద్ధి.

* ఆరుద్ర [కూ, ఖ, జ, ఛ] *

ఈ వారము మీకు యోగదాయకముగా వుంటుంది. ఆశించిన సొమ్ము చేతికివస్తుంది. నూతన కార్యములు ప్రారంభిస్తారు. కోర్టు దావాలలో అనుకూలత వుంటుంది. పండిత గోష్ఠిజరిపి నూతనాంశాలు తెలుసుకుంటారు. వారమంతా శుభయోగములున్నా కొంత ఆందోళనతో కూడి వుంటుంది. 30, 1, 2 ధనలాభము, కార్యసిద్ధి. 4, 5 అధిక ఖర్చులు. న్యాయవాదులకు, న్యాయస్థాన ఉద్యోగులకు, పండితులకు, ఉపాధ్యాయులకు మేలుగా వుంటుంది.

* పునర్వసు [కే, కో, హా, హీ] *

ఈ వారము వినోదములలో పాల్గొనుట దధి, క్షీర, మధుర పదార్థయుక్త సుభోజనము రజతపాత్రలలో భుజించుట, తలచిన కార్యములలో జయము, నీటిమీద ప్రయాణము, తెల్లనివస్తువులు కొనుట, మొదలైన యోగములు కలుగును. ప్రత్తి, దూది, నూలు, బట్టలు, వెండి, బియ్యము, ద్రవ పదార్థజన్యముల క్రయ విక్రయములలో వర్తకులకులాభము. కవులకు, గాయకులకు, కళాకారులకు, నటీనటులకు మేలుగా వుంటుంది. విద్యార్థులకు మంచి కాలము. 4, 5 అధిక ఖర్చులు, ఆందోళన.

* పుష్యమి [హూ, హే, హో, డా] *

ఈవారము ధనధాన్యవృద్ధి, కృషి మూలకముగా లాభము, వివాహాదిశుభ కార్యములలో పాల్గొనుట, ఇష్టవస్తులాభము, పరోపకారంవల్ల కీర్తివంటి రాజయోగములు కలుగును. విద్యార్థులు వినోదములలో పాల్గొన్నా, చదువు బాగా సాగుతుంది. విలువగల వస్తువుల క్రయవిక్రయాలలో వర్తకులకు రెట్టింపు లాభము. కవులకు, గాయకులకు, కళాకారులకు యోగకాలము. ఆప్తులతో విందు, వినోదము.

* ఆశ్రేష [డీ, డూ, డే, డో] *

ఈవారము మీకు కార్యభారము ఎక్కువ రాబడి తక్కువ. గృహావసరములు తీరక కలతలు, ఆరోగ్యము సరిగాలేని సూచనలు కనబడగానే ఔషధ చికిత్స పొందడమే కాకుండా గ్రహరాజైన రవికి శాంతిచేయించుట మేలు. ఉద్యోగస్తులకు కొత్త సమస్యలు! వర్తకులకు ఆందోళన 1, 2, 3 పిత్రువర్గ సహాయము, ధనలాభము. ప్రయాణము 4, 5 న ఆరోగ్యభంగము.

* మఖ [మా, మీ, మూ, మే.] *

ఈవారము మీకు మిశ్రమయోగము. మొదట్లో నిరాశగావున్నా మిత్రసహాయమువల్ల కార్యలాభము పొందుతారు. ధనలోపమువల్ల ఆందోళన. ఉద్యోగస్తులకు ఏమంత బాగుండదు. విద్యార్థులకు బద్ధకమువల్ల చదువు సాగదు. ఆప్తుల ఆరోగ్యము ఆందోళన కలిగిస్తుంది. వారములో అశుభ యోగములువున్నా మిత్రసహాయము, కార్యసిద్ధి, విదేశీయుల పరిచయము, విచిత్ర వస్తు సంపాదనవంటి శుభయోగములు కూడా

★ నక్షత్రఫలితాలు ★

వుంటవి.

* పూర్వఫల్గుణి (పుబ్బ) *
(మో, టా, టీ, టూ)

ఈ వారము మీరు సహాయము పొంద దలుచుకున్న వ్యక్తిమూలముగా కార్యహాని పొందుతారు. ధనాభావంకూడా ఎక్కువ.

ఇంట్లోవారి ఆరోగ్యము ఆందోళన కలిస్తుంది. ఆధ్యాత్మిక-చింతవల్ల దైవముపై భారము వేసి కార్యలాభము పొందుతారు. ఉద్యోగస్తులకు ఒత్తిడి; వ్యాపారస్తులకు నిరాశ. విద్యార్థులకు మంచికాలముకాగు. పుణ్యక్షేత్ర సంచారము, దేవతాదర్శనము, విచిత్రములను చూచుట జరుగును. వారమంతా అవయోగ, శుభయోగ మిశ్రమముగా వుంటుంది.

* ఉత్తరఫల్గుణి (ఉత్తర) *
(టే, టో, పా, పీ)

ఈ వారము మీకు అనుకూలతకన్న ప్రతికూలత ఎక్కువ. యత్నకార్యములు ఎక్కువ శ్రమతో ఫలిస్తాయి. కోర్టుదావాలు అనుకూలిస్తాయి. ఇతరులకు సహాయముచేయబూని ఫలించక నిందలు పొందుతారు. యిచ్చిపుచ్చుకోవడములో వివాదాలు కలుగుతాయి. ఉద్యోగస్తులకు అధికారులఅనాదరణ, తోటివారి సహకారము వుంటాయి. వర్తకులకు వారమంతా నిరాశ, వారాంతమున మేలు. 4, 5 భార్య అనారోగ్యముచే ఆందోళన, విద్యార్థులకు చదువు బాగా సాగదు.

* హస్త [పూ, ష, ణ, ఠ] *

ఈ వారము ఎన్ని ఆటంకములువచ్చినా పట్టుదలతో ప్రయత్నించడమువల్ల కార్యసిద్ధి అవుతుంది. ఆశించినసొమ్ము సమయానికి అందక అప్పుచేస్తారు. దెబ్బలుతగిలే ప్రమాదము జాగ్రత్తవల్ల తప్పవచ్చును. రసాయనిక శాస్త్రజ్ఞులకు, లోహ, రంగుల వ్యాపారస్తులకు కష్టముతో కూడినలాభము. గనుల యజమానులకు, యంత్రములు నడుపు నిపుణులకు, ఇంజనీరింగు వుద్యోగులకు మేలుకాలము.

చిత్త [పే, పో, రా, రీ]

ఈ వారము మీకు యోగకాలము. బంధుసహాయము. అధికారుల సహాయము కలుగుట చేత అన్నిచిక్కులు వీడి కార్యసిద్ధి అవుతుంది. ఆదాయము వృద్ధి పొందుతుంది. శాస్త్ర ప్రసంగాల్లో పాల్గొంటారు. కవులు నూతన రచనలు చేస్తారు. బంధువుల క్షేమవార్త తెలిసి సంతోషము పొందుతారు. విద్యార్థులకు ఉత్సాహముగా వుంటుంది. గణిత శాస్త్రజ్ఞులకు కవులకు, శిల్పులకు, నటీనటులకు మేలుకాలము.

* స్వాతి [రూ, రే, రో, తా]*

ఈ వారము మీకు మంచిభాగ్యయోగము.

ఈవారపు ధరలు:

నూలు, వస్త్రములు :- మార్పు లేదు.
నూనెదినుసులు:- స్వల్పముగా పెరుగును.
ఆహారధాన్యములు :- మార్పు లేదు
బెల్లము, పంచదార:- సమస్థాయిలో వుండును.
చింతపండు:-మందముగా వుండును.
పప్పుదినుసులు :- తగ్గుదలలో వుండును.
వెండి, బంగారము.- స్వల్ప తేడాలో వుండును.

జన్మనక్షత్రమును బట్టిగాని, జన్మనక్షత్రము నెరుగనివారు నామనక్షత్రము (వారివారి పేర్ల ననుసరించి పేరు మొదటియక్షరము)ను బట్టిగాని ఫలితాలు తెలుసుకొనునది. కృష్ణుడను పేరునకు మృగశిర, హనుమాన్ అను పేరునకు స్వాతియు, శ్రీధరుడను పేరునకు చిత్తయును, క్షేత్రపాలకుడను పేరునకు హస్తయును, భీముడు, భైరవుడు అనే పేర్లకు పూర్వాషాఢయునూ చూచుకొనునది.

అనుకున్న డబ్బు చేతికి వస్తుంది. ఇబ్బందులు తీరుతవి. దావాలలో గెలుపు పొందుతారు. పిల్లల అభివృద్ధికి చేసేప్రయత్నాలు ఫలిసవి. విజ్ఞానాభివృద్ధి కలుగుతుంది. విద్యార్థులకు చదువుబాగా సాగుతుంది. న్యాయస్థాన ఉద్యోగులకు, న్యాయవాదులకు, పండితులకు, ఉపాధ్యాయులకు మేలుకాలము.

* విశాఖ [తీ, తూ, తే, తో] *

ఈ వారము మీకు యోగదాయకము. ధనయోగము వుంటుంది. సంగీతసభలు, కవితాగోష్ఠివంటి వినోదాలలో పాల్గొని మృష్టాన్న భోజనము వెండిపాత్రలలో చేస్తారు. శుభకార్యములలో పాల్గొంటారు. నూలు, బట్టలు, బియ్యము, వెండి, వర్తకులకు లాభము. విద్యార్థులు ఉత్సాహంగా చదువుకుంటారు. కవులకు, గాయకులకు, కళాకారులకు నటీనటులకు మేలుగా వుంటుంది.

* అనూరాధ [నా, నీ, నూ, నే] *

ఈవారముకూడా మీకు గతవారమువలెనే యోగదాయకరముగా ఉంటుంది. అసంపూర్తిగా వుండిపోయిన పనులు లాభదాయకముగా ముగుస్తవి. శుభ, పుణ్యకార్యాలలో పాల్గొంటారు. నూతనగృహనిర్మాణమునకు ప్రయత్నిస్తారు. ఉద్యోగస్తులకు హోదా పెరుగుతుంది. వర్తకులకు విలువగల వస్తువుల క్రయవిక్రయములలో ఎక్కువ లాభము. వారమంతా శుభయోగములతో కూడివున్నా వారాంతమున కుటుంబకలహము చే ఆందో

శన కలుగుతుంది. స్త్రీలతోనూ మిత్రులతోనూ విందు వినోదము.

జ్యేష్ఠ [నో, యా, యీ, యూ]

ఈ వారము రాబడి తక్కువ ఖర్చులు ఎక్కువ. గృహావసరములు తీరక స్పర్ధలు వస్తాయి. అనారోగ్య సూచనలు కనబడగానే ఔషధ చికిత్స పొందడము, రవికి శాంతి చేయించడము మంచిది. ఉద్యోగస్తులకు క్రొత్త సమస్యలు. వర్తకులకు ఆందోళన విద్యార్థులకు చదువు సరిగా జరగదు. వారమంతా భయాందోళనలతో కూడివున్నా పితృవర్గ సహాయము, కార్యలాభము కలుగుతవి.

*** మూల [యే, యో, బా, బీ] ***

ఈ వారము నిరాశగావున్నా మిత్ర సహాయమువల్ల కార్యలాభము అవుతుంది. ఇంట్లో వున్నవారి అనారోగ్యమువల్ల ఆందోళన కలుగుతుంది ఉద్యోగస్తులకు స్వల్పఅనుకూలత. వర్తకులకు వారాంతమందు లాభము. వారమంతా ఉద్రేకముగా వుంటుంది. విదేశీయుల పరిచయము, అపురూపవస్తు సంపాదన కలుగుతాయి. 4, 5 అధిక ఖర్చులు, మనోవ్యథ. విద్యార్థులకు చదువుబాగా సాగదు.

పూర్వాషాఢ [బూ, ధ, భా, డా]

ఈ వారము మీకు మిశ్రమయోగము. ఆశించిన సహాయము లభించక, అవసరములు తీరక, ఆందోళన కలుగుతుంది. అయినప్పటికీ దైవానుగ్రమువల్ల కష్టములు గడిచి కార్యసిద్ధి పొందుతారు. ఉద్యోగస్తులకు అధికారుల అనాదరణ వర్తకులకు చాంచల్యము. పుణ్యపురుషుల సాంగత్యమువల్ల మనోవికాసము కలుగుతుంది. వారమంతా అశాంతిగా వున్నా నష్టద్రవ్య లాభము పొందుతారు. 4, 5 అధిక ఖర్చులు.

ఉత్తరాషాఢ [బే, బో, జా, జీ]

ఈ వారము అనుకూలతకన్నా ప్రతికూలత యెక్కువ. ఇచ్చిపుచ్చుకునేపట్ల వివాదాలు వచ్చి మనోవ్యథ కలుగుతుంది. కోర్టు వ్యవహారములు అనుకూలించినా అమితఖర్చులవల్ల ఆ సంతోషము వుండదు. భార్యకు అనారోగ్యముకలిగే సూచనలున్నవి. మినుములు, కొర్రలు, రాగులు, ఉప్పు, నువ్వులు, నూనె, వ్యాపారస్తులకు లాభయోగము. ఇతరజాతుల వారివల్ల గౌరవము కలుగుతుంది. 4, 5 భార్యకు అనారోగ్యము. బంధువులరాక, అధికఖర్చులు.

*** శ్రవణము [జూ, జే, జో, ఘా]***

ఈ వారము ఎంత ప్రయత్నించినా యత్న కార్యములకు ఆటంకములు కలుగుతునేవుంటవి. అయిననూ పట్టుదలతో ప్రయత్నించి కార్యలాభము పొందుతారు. సోదర సహాయంవల్ల ఒడిదుడుకులు సర్దుకుంటాయి దెబ్బలు తగిలే ప్రమాదము జాగ్రత్తవల్ల తప్పవచ్చును. గనుల యజమానులకు, లోహ, ఖనిజ వ్యాపారస్తులకు, పోలీసుశాఖ ఉద్యోగులకు మేలుకాలం 4 న ప్రమాద సూచన, 5 న అధిక ఖర్చులు.

*** ధనిష్ఠ [గా, గీ, గూ, గే] ***

ఈ వారము మీకు యోగదాయకము, ప్రయత్నించిన పనులు నెరవేరుతవి. ధన లాభము కలుగుతుంది. ఈశాన్య దిక్కునుండి క్షేమవార్త తెలుస్తుంది. శుభకార్యములలో పాల్గొంటారు. బంధుదర్శనము కలుగుతుంది. గణితజ్యోతిషశాస్త్ర చర్చలు జరుపుతారు. ప్రత్తి, దూది, నూలు, బట్టలు, ఇత్తడి, కంచు వర్తకులకు లాభదాయకము. కవులకు, శిల్పులకు, నటీనటులకు మేలుకాలము. 1, 2, 3 కార్యసిద్ధి 4, 5 అధిక ఖర్చులు.

శతభిషం [గో, సా, సి, సూ]

ఈవారము మీకు శుభయోగము. ఆశించిన డబ్బు చేతికి వస్తుంది. ఇంట్లో శుభకార్యాల ప్రయత్నములు చేస్తారు. పుణ్యకార్యాచరణ, ప్రభుత్వ సన్మానము, శాస్త్రచర్చలు జరుగుతవి. విద్యార్థులు క్రొత్త విషయాలు నేర్చుకుంటారు. న్యాయవాదులకు, న్యాయస్థాన ఉద్యోగులకు మేలుగా వుంటుంది. ఇంట్లో వున్నవారి అనారోగ్యమువల్ల కలిగిన ఆందోళన తొలగుతుంది. పిల్లల లాభక్షేమములకు చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి.

*** పూర్వాభాద్ర [సే, సో, దా, దీ]***

ఈ వారము మీరు తలపెట్టిన పనులలో జయము పొందుతారు. నీటపై ప్రయాణము చేయవలసి వస్తుంది. బంధు మిత్రులతో వినోదములలో పాల్గొని మృష్టాన్న భోజనము చేస్తారు. విద్యార్థులు ఉత్సాహముగా చదువుకుంటారు. ప్రత్తి, దూది, నూలు, బట్టలు, వెండి, బియ్యము, ద్రవ పదార్థ జనిత వస్తువులు క్రయ విక్రయములలో వర్తకులకు లాభము, కవులకు గాయకులకు, కళాకారులకు, నటీనటులకు మేలుకాలము.

ఉత్తరాభాద్ర [దూ, శం, ఝా, థ]

ఈ వారము మీకు యోగప్రదము. ధన ధాన్య వృద్ధి కలుగుతుంది. వివాహాది కార్యాలోచనలు ఫలప్రాప్తి పొందుతాయి. ఇష్టవస్తు లాభము. పరోపకారమువల్ల కీర్తి కలుగుతవి. విద్యార్థులకు చదువు బాగా సాగుతుంది. ఖరీదైన వస్తువుల క్రయ విక్రయములలో వర్తకులకు లాభము ఎక్కువ. వాహనయోగము కలుగుతుంది. కవులకు, గాయకులకు, కళాకారులకు, నటీనటులకు యోగకాలము. ఉద్యోగస్తులకు హోదా పెరుగుతుంది. 4, 5 కుటుంబ కలహము.

*** రేవతి [దే, దో, చా, చీ] ***

ఈ వారము మీకు కార్యభారము ఎక్కువ. వింతమాటలు వినుట, పరాక్రమమువల్ల ఘనత, ప్రయాణము, ధన లాభము, కలుగతవి. అనారోగ్య సూచనలు కనపడగానే జాగ్రత్తపడుట మంచిది. ఉద్యోగస్తులకు స్వల్ప అనుకూలత. విద్యార్థులకు చదువు సరిగా సాగదు. రాజకీయ వాదులకు వారమంతా అలజడితోపాటు అనుకూలత 1,2,3 పితృవర్గ సహాయము, కార్యలాభము. 4, 5 అనారోగ్య సూచనలు.

★



వనితా లోకం



తీరని కోరికల హరివిల్లు

"ఈ ప్రపంచంలో ప్రధానంగా రెండు రకాల విషాద స్థితులున్నాయి. ఒకటి, కోరినది లభించకపోవటం; రెండు, కోరినది లభించటం" అన్నాడు ప్రసిద్ధ ఆంగ్ల రచయిత ఆస్కార్ వైల్డ్.

పై వాక్యాలు ఆస్కార్ వైల్డ్ ఏ సందర్భంలో, ఎందుకు అన్నాడో వదిలేసి, వాటి అర్థాన్ని జీర్ణం చేసుకుంటే, "ఎంత బాగా చెప్పాడు" అనిపిస్తుంది.

కోరుకున్నది లభించకపోవటం బాధాకరమని అందరూ అంగీకరిస్తారు...

కోరికలు రకరకాలు.. ఆ కోరిక ఎలాంటిదైనా, అది తీరకపోయినప్పుడు కలిగే నిరాశ మాత్రం ఒకటే!

కారు కొనాలనే కోరిక, రత్నాలహారం చేయించుకోవాలనే కోరిక, కాశ్మీరం చూడాలనే కోరికా, ఇల్లుకట్టాలనే కోరికా కోరికలు తీరాలన్న కోరిక—అన్నీ కోరికలే! ఒకరికోరిక యింకొకరికి అల్పమైనదిగా కనపడవచ్చు! కానీ, ఎవరికోరిక వారికి చాల పెద్దదే. అది తీరాలని ఎంతో ఆశ! అది తీరకపోతే కారుచీకటిలాంటి నిరాశ! నిముష నిముషానికి 'తీరని కోరిక' హృదయాన్ని చీల్చుకుంటూ వుంటుంది!

"ఇది లభించలేదు" అనే ఒక్క వాక్యం

'మల్లి'

లోనే చాలా విషాదం వుంది...

ఆ విషాదం మనిషిని వెక్కిరించి, పీడించి వదిలిపెడుతుంది...

హృదయప్రాంగణంలో ఒక కోరిక మొలకెత్తేటప్పుడు "ఇది తీరుతుందా!" అని మనం ఆలోచించం!

తీరకపోతే విచారిస్తాం!

అల్లాగని కోరికలు జనించకుండానూ వుండవు. చైతన్యవంతమైన జీవికి, కోరికలు పూరక ఎలావుంటాయి!

కోరికలు చంపుకుంటే, కందమూలాదులు తిని కొననాళ్లోనే గడపవచ్చుగదా!

నాకు, మా వాకిట్లో 'సంపంగి' చెట్టు నాటి, దాని పువ్వులని స్నేహితులకి కోసియిస్తూ వుండాలని కోరిక!

ఈ కోరిక, ఎందుకు ఎల్లా ఉద్భవించిందో తెలియలేదు గాని, అది జనించిన నాటి నుంచి నేననుభవించిన బాధ వర్ణనాతీతం. నిజం చెబుతున్నాను. ఆరు మొక్కలు నాటాను. ఒక్కటికూడా జీవించలేదు... ఇప్పటికీ అది తీరని కోరికే! భరించలేని విషాదం! కొందరి దృష్టికి నాకోరిక స్వల్పాతిస్వల్పంగా కనపడవచ్చు! కానీ, నా మనస్సుకి అదే ఎంతో పెద్దకోరిక! అది సృష్టించినదే నాపాలిట, చెప్పరానంత బాధ.

కోరికలు కోరికలే! వాటికి చిన్నా, పెద్దా, గొప్పా, బీదా వుండదు. ఆర్థిక విలువలు కడితే బహుశా వుండవచ్చు తరతమ భేదాలు! కాలేజీలో చేరి చదవాలన్న కోరిక ఒకరికి వుంటుంది ఇంకొకడికి అమెరికా వెళ్ళాలని వుంటుంది.. ఇద్దరికీ కోరిన అవకాశం లభించదు. అప్పుడు ఇద్దరు పొందే నిరాశకి ప్రమాణం ఒక్కటే! ఇద్దరిదీ విషాదమే!

అందమైన భార్య లభించాలని ఒక సుబ్బారావు కోరిక.. అతని భార్య ఎదుట 'అందం' గురించి ఆలోచించ బుద్ధే పుట్టదు.

మె ముఖం చూసినప్పుడల్లా మనస్సు చివుక్కు మంటుంది...అందమైన అమ్మాయిలవంక నిరాశగా చూస్తాడు! అతనికి కోరినది లభించలేదు.. విషాదం పెనవేసుకుంది...ఆజన్మాంతం ఆవిషాదం అతనిని విడిచి పెట్టదు...

కోరినది లభించక పోవటం విషాదం అని అంతా అంగీకరిస్తారు. సరే, మరికోరినది లభించటమూ ఎలా విషాదమౌతుంది? నిజం చెప్పాలంటే కోరినది లభించకపోయినప్పుడు పొందేవిచారమే లభించినప్పుడు కలిగేవిచారంకన్న సుఖమైనది...

నాగరత్నానికి రత్నాలహారం మీద విపరీతమైన అపేక్ష. ఎలాగైనాకొని తీరాలని కోరిక. అది మెడలోవుంటే తను ఎంత అందంగా కనపడుతుందో వూహించుకుని మురిసిపోయేది. దాన్నిగురించే అస్తమానమూ ఆలోచించేది. ఒక శుభసమయాన నాగరత్నంకోరిక ఫలించింది...

ఇప్పుడు నాగరత్నానికి ఆహారంమీద అంత అపేక్షలేదు...'తనకీ వుందిహారం' అన్న నిర్లిప్తత.. అదివరకటిలాగా ఆహారం గురించి యిప్పుడు ఆలోచించదు.. తీయని తీరని కోరికగురించి కలలు కనేందుకు సదుపాయం లేదు. దీన్ని విషాదమనక మరేమనాలి; కోరినవస్తువుమీద ప్రేమనశించటం కన్న గొప్పవిషాదమేముంటుంది.


ఒక ప్రేమికుడికి తాను ప్రేమించిన కన్యభార్యగా లభించింది.. అంతకుముందు అతను ఆకన్యతో వూహాలోకంలో తూగుటుయ్యాలలలో తేలిపోయాడు. ఆమెని తలుచుకుంటే,అతని తనువు పులకరించేది...

ఆమె తనకి భార్యకావాలని భగవంతుడిని ప్రార్థిస్తాడు.. ఒక్కక్షణంలో ఆశ అతన్ని ఆనంద పెడుతుంది.. మరోక్షణంలో నిరాశ అతడిని నిర్లిప్తుడినిగా చేస్తుంది.. రకరకాల అనుభూతులమీద అతను తేలిపోతాడు!

కాని, ఆమే అతనికి భార్యగా లభించింది... "యీ వస్తువునాకు దొరికింది" అన్న తృప్తి కలిగింది. అదివరకటి అనుభూతులు యిప్పుడులేవు...పిల్లలూ సంసారం ఆర్థిక సత్వాలూ, అతడిని తల్లక్రిందులు చేస్తాయి! ఇప్పుడతను భార్యను కేకవేస్తాడు అనవసరంగా విసుక్కుంటాడు! ఇంతకన్నా వేరె విషాదం ఏముంది!!

అసలు వివాహమే అలాంటిదికాబోలు అందుకే ఒకకవి ఇల్లా అన్నాడు: "దూరంగా ఆకాశంలో నిశ్చలంగామెరిసే నక్షత్రం ప్రేమ; దానివంక చూస్తూ దారిప్రక్క గోతిలో పడటం వివాహం" అని!

యీ విషయం తెలిసినా, ప్రేమిస్తూ వుండిపోయి వివాహం చేసుకోకుండా వున్న వాళ్లు అసలు లేరేమో బహుశా! అంటే కేవలం సంసారం ఊబిఅనీ, ప్రేమ పవిత్రమైనదని వివాహం మానరు ఎవరూ అని



"నాన్నా మేనేజరుగారు రమ్మంటున్నారు"

నేననుకుంటాను! కుటుంబపరిస్థితులూ, ఆర్థిక విలువలూ, అడ్డం వచ్చినప్పుడు వివాహం మానేస్తారు! అప్పుడుకూడా "కోరింది లభించలేదు" అని విచారమేగాని" నేను నక్షత్రంవంక అలాచూస్తూ నిలబడతాను... గోతిలోపడను" అని సంతృప్తి పడలేడు సామాన్యమానవుడు! ఇదీ విషాదమే మరి!

అందమైన గులాబి మొక్కని నాటి రోజూ మంచినీళ్లుపోసి పెంచి అది పూసిన మొదటి పువ్వు ప్రియమైనవారికి అందించాలని ఆశపడితే, అది ఎన్నాళ్ళకీ, చివురించి మొగ్గ తొడగకపోతే "అయ్యో! నాకోరిక ఫలించలేదు" అని విచారిస్తాం!

కానీ, "ఇది నిజంగా పువ్వు అందించి వుంటే, కోరిక తీరివుండేది. అప్పుడు ఈ చెట్టుమీద నాకింత ప్రేమవుండేదికాదేమో! ఇల్లా పువ్వుకోసం ఆశగా ఎదురుచూస్తూ ఉండటమే మంచిదేమో!" అని అనుకోలేరు చాలామంది.

* * *

"వేచి వుండటంలో సుఖం వుంది" అంటారు!

ఆసుఖంకూడా కొన్నాళ్ళపాటేవుంటుందేమో!

ఎదురుచూపుల్లో కొన్నాళ్ళు సుఖం వుందేమోనని పిస్తుంది.

వేచి వేచి కనులు కాయలు కాచినా ఆశించింది అందకపోవటంతో నిరాశ పెనవేసుకోక ఏమవుతుంది?

వినని పాటలు మరింత మధురంగా వుంటాయనీ, చూడని దృశ్యాలు మనోనేత్రం ముందు సుందరతరమైన వూహాదృశ్యాలుగా సాక్షాత్కరిస్తాయనీ అంటారు!

అదీ నిజమే!

కానీ, సామాన్యుడికి అట్లా తృప్తిపడటం చేతగాదేమో!

ఎన్నాళ్ళనుంచో వినాలనుకున్నపాటని అభిమానగాయని కంఠస్వరం, ఒక్కసారి మన వీనులకి అందిస్తే, అది విని కొంతకాలం మనస్సులో నిలుపుకుని, క్రమ క్రమంగా మర్చిపోతాం!

జీవితాంతంమర్చిపోలేనివీవుంటాయనుకోండి

మనం పాట విన్నాం! అంతే ఇంక పూర్వపు వుత్కంఠా, వినాలనే బలవత్తరమైన కోరికా, ఇంక మనలో మిగలవు! అది విషాదం కాదూ?

అంచేతకోరికలు తీరకుండా జాగ్రత్తపడాలనీ ఎపుడూ ఏడుస్తూవుండాలనీ నేను అనటం లేదు 'జీవితాన్ని చైతన్యవంతం చేసుకోవాలంటే, కోరికలు వూరుతూ వుండాలి! ఆశలతో, ఆత్మవిశ్వాసంతో బ్రతకాలి! అప్పుడు జీవితం సౌందర్యభరితం అవుతుంది.

"శిథిల శిశిరమ్ములో చివురేల" అన్నాడు కృష్ణశాస్త్రి.

శిథిల శిశిరంలో చివుళ్ళు 'ఆశ'ని సూచిస్తాయి కదా!

ఒక కోరిక తీరిన వెంటనే, మరో కోరిక వుదయిస్తే, "అయ్యో ఇది తీరిందే" అనే నిరాశవుండదు..."ఇదికూడా తీరాలి" అన్న కోరిక మరోటి మొలకెత్తుతుంది!

'మనిషిని విషాదం ఆవరించకుండా వుండాలంటే ఆశలూ, కోరికలూ, అనుక్షణమూ తలెత్తుతూ వుండాలి' అనిపిస్తుంది. అటువంటి చైతన్యవంతమైన జీవికి, "ప్రతిక్షణమూ ఒక ఉషస్సూ, ప్రతిరోజూ ఒక ఉగాదీ," అనిపిస్తుంది...

అలా అనిపించగలగడం, ఆశాజీవికి భగవంతుడిచ్చిన అద్భుతమైన వరం! ★

కలలు

గత వారం 'కల అంటే ఏమిటి' అన్న ప్రశ్నకు సమాధానం చర్చించిన రచయిత్రి, ఈ వ్యాసంలో కలలు ఎలా వస్తాయో, వివరించి, కలలు కల్లలేననీ, భవిష్యత్తును సూచించగలవనుకోవడం పొరబాటనీ పేర్కొంటున్నారు.

మగవారికంటె ఆడవారు కలలెక్కువ కంటారు పెద్దవారికంటె పిల్లలకు కలలెక్కువ వస్తాయి. చదువురానివారికంటె చదువుకున్నవారికి కలలెక్కువ వస్తాయి. (నిజం చెప్పాలంటె వారికంటె వీరికి నిద్రావస్థలో కూడా ఒరకమైన మెలకువ వుంటుందనాలి) వయసు పెరిగేకొద్దీ కలలు మందగిస్తాయి. ముసలితనం పైనబడేకొద్దీ కలల ప్రపంచపు తలుపులు మూసుకుపోతున్నట్లుంటాయి. అంచేతనేమో ముసలివారు ఎప్పుడోగానీ కలలు వచ్చినట్లు చెప్పకోరు.

కలల్ని గురించి మనలో చాలా మూఢ నమ్మకాలున్నాయి. మన కొన్ని నమ్మకాలున్నాయో పాశ్చాత్యుల్లో గూడా అన్ని నమ్మకాలున్నాయి. ఓ వ్యక్తి ఎరుపురంగు పెరింజన్ కలలో చూచినాడంటే ఆవ్యక్తికి ఆ చుట్టుపట్ల వాతావరణంపై అట్టేయిష్టం

కె. లీలావతి

లేదనీ. ఆ ప్రాంతంనుండి ఆ వ్యక్తి మరో చోటికి పోవటం ఎంతైనా అవసరమని దానిఅర్థం అట. ఎవరైనా తాము వుంటున్న యిల్లు తగలబడిపోతున్నట్లు కలగన్నారంటే-అది, త్వరలో ఆవ్యక్తి చనిపోతాడనేందుకు నిదర్శనమట. డాక్టర్ ఛిడేకేట్ అనే ఆయన ఈ కలల్ని గురించి చాలా పరిశోధనలు జరిపారు. ఆయన రోగులలో ఒకరు "మంటలు! మంటలు! అబ్బా! భయంకరం! యిల్లు తగలబడిపోతోంది" అని పలవరించాడుట నిద్రలో. తర్వాత పదిపదిహేను నిముషాలకే ఆవ్యక్తిగుండె ఆగి మరణించాడట.

మామూలుగా మూగవారు చెవిటివారు వేళ్ల ద్వారా, సంజ్ఞలద్వారా తమభావాలు యితరులకు చెబుతూ వుంటారు. వారు నిద్రపోయే సమయంలో గూడా వారికి తెలీకుండానే - వారి కలల్ని వేళ్ళ ద్వారా సంజ్ఞల ద్వారా చెబుతుంటారంటే, తమాషగా లేదూ! ఈ సంజ్ఞలనుబట్టి వారు కనే కలల్ని చెప్పెయ్యవచ్చుట. ఈ సందర్భంలో మా అన్నయ్య చెప్పిన ఒసంగతి జ్ఞాపకం వస్తోంది. అన్నయ్య చదువుకునే రోజుల్లో వారి గదిలో ఓ టైపిస్టు వుండేవాడుట. ఆయన అసలు టైప్ చెయ్యని వేళల్లో గూడా 'బ్లయిండ్ టచ్' లోలా, వేళ్ళని ఆడించేవాటుడు. నిద్రపోతున్నంతసేపూ కుర్చీ చెక్కలపైన వేళ్ళని టకటకా"మనిపిస్తుంటాడుట. ఎన్ని విధాలుగా ప్రయత్నించినా ఆయన ఆ అలవాటు మానలేక "వీటకటకల మూలంగా మా చదువుపాడైపోతోందయ్యా!" అని అన్నయ్య వాళ్ళు గోలెడితే మరో గదికి వెళ్లిపోయాడుట. బహుశా ఆయన టకటకల మూలంగా బ్లయిండ్‌టచ్‌లో కలల్ని అప్పగిస్తున్నాడేమో అనిపిస్తోందిపుడు!

ఒక వ్యక్తి మనస్తత్వాన్ని సమాజిక వాతావరణాన్నిబట్టి అర్థం చేసుకోవటం కంటే-అతని కలల్నిబట్టి అర్థం చేసుకోవటం సులభమని శాస్త్రజ్ఞుల అభిప్రాయం. అసలు ఎవరైనా కలలుకనే వేళల్లో ఆకలల్ని ఏదో విధమైన సంజ్ఞల ద్వారా బయటకు తెలుపుతూ వుంటారుట. ఈలా సంజ్ఞలను బట్టి కలల్ని సంపూర్ణంగా తెలుసుకుంటానికి న్యూయార్కు యూనివర్సిటీ ప్రొఫెసర్ మాక్స్ "వైర్ టాపింగ్" అనే ఓ విచిత్ర

కళ్లజబ్బు

"రోజూ రాత్రి కళ్లుమూస్తానో లేదో పచ్చదీపాలూ ఎర్రదీపాలూ కనబడుతున్నాయయ్యా అదేం ఖర్మమో"

"కళ్ళడాక్టర్ని చూశావా?"

"అబ్బె. వుట్టి దీపాలుమాత్రమే కనిపిస్తున్నాయి.

విధానాన్ని రూపొందించారుకూడా!

కలలు ఒక్కొక్కప్పుడు ఆవేశపూరితంగా కూడా వుంటాయట. అలాంటి కలలు కన్నప్పుడే మనం ఒక చోటినుండి మరొకచోటికి పోవటం గానీ ఏదైనా ఘోరం గానీ చేసెయ్యవచ్చు. (దీన్నే స్లీప్ వాకింగ్ అంటారు) అంతే కానీ ఆపని ఏవో దెయ్యాలూ భూతాలూ మనచేత చేయించాయనటం పొరబాటు. ఒకనాడు మా పొరుగింటామె రాత్రివేళ తన కొడుకును మెత్తగా చివాట్లేసిందట. చాలా ఘాటుగా తిట్టి "ఈ బతుకు బ్రతకటంకంటె మన పెరటి బావిలోదూకి చావరాదూ!" అని కూడా అందట. ఆ అబ్బాయి అన్నీ మౌనంగా భరించి నిద్రపోయాడట. కానీ తెల్లవారి లేచిచూస్తే ఆ అబ్బాయి పెరట్లో బావి ప్రక్కన పడుకొని నిద్రపోతున్నాడట. అంటే మా పొరుగావిడ తిట్టిన తిట్లు ఆ అబ్బాయిలో కలతరేపి—ఆ కలత కలగామారి - ఆ కలలో అబ్బాయి తనకు తెలీకుండానే బావి గట్టుకు నడిచివచ్చి అక్కడే పడుకొని నిద్రపోయాడన్నమాట. కాస్తలో తప్పిపోయింది గాని ఆకలలోని ఆవేశంలో బావిలోనిజంగా దూకేసినా దూకేసి వుండేవాడే. అందుకే పిల్లల్ని తిట్టటంకంటె కొట్టటం చాలా మంచిది. కొడితే బాధ శరీరానికే వుంటుంది. తిడితేమాత్రం ఆపసిహృదయాలకు చాలా బాధ కలిగి లోలోపలే కలతపడిపోతారు. ఆలాంటప్పుడు వారు నిజంగా చెయ్యాలనుకోక పోయినా కొన్ని అఘాయిత్యాలు చేస్తుంటారు. ఆ అఘాయిత్యాలు ఏ భూతాలో దెయ్యాలో చేయించినట్లు భ్రమపడి, భయపడి పెద్దలు మంత్రాలు, తంత్రాలు, పూజలూ పునస్కారాలూ నిజంగా వారికి పిచ్చెత్తించినంత పని చేస్తారు.

మనసు బాగా లేకపోయినప్పుడూ, గృహచ్ఛిద్రాలు, ఆర్థికంగా, సాంఘికంగా, శారీరకంగా చిక్కులూ, కలతలూ, కలిగినప్పుడు చెడు కలలు తరచూ వస్తూంటాయి. ఉదాహరణకు మనం అజీర్తితో బాధపడుతూ నిద్రపోయామనుకోండి. ఆ రాత్రి మనల్ని ఏహంతకులో చుట్టేసి చంపెయ్యబోతున్నంతటి భయంకరమైన కలరావచ్చు. ఇంకా తీయని కోరికలూ, తీరని కోరికలూ వున్న వారికి పునాదులేని గాలిమేడల్ని ప్రతి రాత్రీ నిర్మించిపారేస్తున్నట్లు డజన్లకొద్దీ కలలు వస్తూవుంటాయి. చూడండి. ఏదైనా కోరికగానీ-ఆశగానీ-బాధగానీ మనసులో వున్న వ్యక్తికి అటు నిద్రారాదు - యిటు పూర్తిగా మెలకువా వుండదు. అలా మగతగా అర్ధ నిద్రావస్థలో వున్నప్పుడు ఆ కలతలకు కేలుతోడై ఏవేవో పాడుకలలు రావచ్చు. అజీర్ణంవల్ల కూడా పీడకలలు వస్తాయి అంతమాత్రానికే ఏదో ప్రమాదం జరగబోతుందని భయపడట మంత తెలివి తక్కువ మరొకటి వుండదు.

కొన్ని కొన్ని ఆహారపదార్థాలు సేవిస్తే అసలు కలలనే వాటిని రాకుండా చేసుకోవచ్చుట. అంటే నిద్రలో 'అర్ధ జాగృతావస్థలు' లేకుండా చేసుకోవచ్చన్నమాట. కలల ప్రపంచానికి, బాహ్యజగత్తుకూ మధ్య వున్న తలుపుల్ని ఎప్పటికప్పుడు మూస్తూ వుండవచ్చు. దోసకాయలు - ఈలా కలలు రాకుండా చేయటంలో అగ్రస్థానాన్ని అందుకున్నాయి.

కొంతమంది పిల్లలు అర్ధరాత్రి నిద్రలో ఏమేమిటో పలవరిస్తుంటారు. ఆ కలవరింతకు కారణం కలలే! కానీ మనవారు ఏదోపీడ అనీ - దెయ్యమని మంత్రాలరావులను పిలిపించి తాయెత్తులనూ, విభూతులనూ యిప్పిస్తుంటారు. ఈ హంగామా చూచి పిల్లలు తమలో ఏ పీడా లేకున్నా వునట్టే తయారవుతారు. మరి చిన్న పిల్లల మనస్తత్వం అంతే కాగుటండీ! దానితో ఆ కలవరింతలూ పీడలూ తగ్గకపోగా మరింత హెచ్చవుతాయి. తాయెత్తులవలన లాభం అటుంచి గోరంతలుగా వున్న కలవరింతలు కొండంతలై కూర్చుంటాయి. పిల్లలు తమకలల్ని బయటకు తెలిపే సంజ్ఞల్లో 'కలవరింత' ఒకటి! అంతే! కానీ అది పీడా దెయ్యంకాదు. పెద్దవారయ్యేకొద్దీ క్రమంగా అదే సర్దుకుంటుంది. ఆలా కలవరించినపుడు పిల్లల్ని మెల్లిగా కదిపిలేపి మోహాన కాసిని చన్నీళ్లు చిలకరిస్తేచాలు. కొన్నాళ్ళకు ఆలా కలవరించే అలవాటు తప్పిపోతుంది.

కలలు భవిష్యత్తును సూచిస్తాయని చాలా మంది నమ్మకం. జాతకాలను ఎంత వెఱ్ఱిగా నమ్మేస్తారో వీటిని అంత వెఱ్ఱిగా నమ్మేవారున్నారు. మనకు స్వప్న ఫలదర్శిని మొదలైన గ్రంథాలున్నట్లు పాశ్చాత్యులకు కూడా "డ్రీమ్ డిక్షనరీలు" (కలల నిఘంటువు) బోలెడున్నాయి. కానీ ఈ కలలు నూటికో కోటికో మినహాయిస్తే ఎన్నడూ నిజమవవు. ఆలా నిజమయ్యేవైతే మన లైలామజ్నూలకు, రోడ్డుసైడు రోమియోలకు, తదితర చిలర ప్రేమికులకూ వచ్చే కలలు మాటేమిటి? వీరి ప్రేమ దరఖాస్తుల్ని వాస్తవిక ప్రపంచం తోసివెయ్యగా కలా ప్రపంచంలో వాటిని అప్రూవ్ చేయించుకొని కొన్ని నిముషాలైనా ప్రేమల్ని అనుభవిస్తూవుంటారు. వారి తాలూకు కలలు నిజమై కూర్చుంటె మిగిలిన ప్రపంచమంతా పెట్టేబేడా సర్దుకొని మరో ప్రపంచానికి రవాణా కావలసి వుంటుంది.

"అయ్యో! ఈరాత్రి పీడకల వచ్చిందే! అంతదూరాన చదువుకొనే అబ్బాయికేం ప్రమాదం వచ్చిందో? వ్యాపార నిమిత్తం దేశంగాని దేశం పోయిన ఆయనగా రెలా వున్నారో" అని వాపోయేవారు నేటికీ వున్నారు. తరతరాలుగా రాసులు పడి పోయిన పిచ్చి నమ్మకాలలో యిదొకటి. ఏవో లేనిపోనిబాధలూ ఆశలూ మనసులో వుంచుకొని రాత్రిసరిగా నిద్రరాక పగలు అనవసరంగా నిద్రపోయేవారికి కలలు పీడకలలు బోలెడు వస్తూంటాయి. ఆకలల్ని నమ్ముకొని బెంగెట్టుకోవటం అవివేకం.

దేహానికి సరైనశ్రమ సరైన ఆహారం వున్ననాడు ఈకలలనేవి అసలు రానేరావు. పల్లెలలో- పొలాలలో పనిచేసే రైతులకు ఏడాదికో ఏడేండ్లకోతప్ప కలలు రావెందుకు? వారికి కడుపునిండా తిండివున్నా లేకపోయినా-తగినంత శ్రమా మనసుకు తగినంత ఆహ్లాదమూ వుంటాయి. అంచేతే కలలు రావు. మనం వాస్తవిక జగత్తులోవున్నా ఏదో రమ్యమైన సినిమా ప్రపంచంలో వున్నట్లు బ్రతుకుతూ వుంటాం. సినిమా వారికి లేనిపోని సుకుమారత్వం_పనికిమాలిన ఆశలూ-అందనికలలూ కో అంటే కొల్లలు.

ప్రకృతిసౌందర్యంతో అలరారే

తోటపల్లి క్షేత్రం

కొత్తపల్లి సుబ్రహ్మణ్యశర్మ

భారతదేశం ప్రకృతి రామణీయకానికి ప్రసిద్ధి చెందింది.

మన దేవతలకుకూడా యీ ప్రకృతి సౌందర్యమంటే మక్కువ ఎక్కువ. కాబట్టే పేరు ప్రతిష్ఠలు గాంచిన భగవన్నివాసాలు అంటే పుణ్యక్షేత్రాలు విలసిల్లిన ప్రదేశాలన్నీ చాలామట్టుకు ప్రకృతిసౌందర్యరీత్యాకూడా ప్రాముఖ్యం కలిగినవే. ఆంధ్రులయిలవేల్పు అయిన శ్రీ వెంకటేశ్వరస్వామి, ఏడుకొండల వాడయ్యాడు. ఆకసమునంటేటట్టి ఎత్తు ప్రదేశంమీద చిక్కటి చక్కటి అడవి మధ్య కాపురం పెట్టాడు. ఇంక శ్రీశైల మల్లేశ్వరస్వామి, అన్నవరపు సత్యనారాయణమూర్తి, సింహాచలపు సింహాద్రప్పన్న వీరందరు సాధ్యమైనంతవరకు జనపదాలకు దూరంగా అందచందాల అడవులమధ్యనో లేక ఎత్తయిన పర్వతాగ్రములమీదనో వెలసిన వారే. ఈ దేవుళ్ళు ఇలా దూరంగా తప్పించుకుందుకు ఎంత ప్రయత్నం సాగిస్తున్నా మానవులు వీరిని వదలిపెట్టేటంతటి వాళ్ళుకారు. అందుకనే పైదేవుళ్ళ దగ్గరకు పోవటంకోసం భీకరారణ్యాలను సైతం ఛేదించి, చక్కని రోడ్లు నిర్మించి ఎంతకొండ మీదకైనా సరాసరి వాహనాలపై వెళ్ళగల్గే యేర్పాట్లను తయారుచేశారు.

అయితే ఈనాటికి మారుమూలలలో కొందరు దేవుళ్లు యీ పకృతి సౌందర్యాన్ని తమ సొత్తుచేసుకొని అనుభవిస్తున్నారు. ఇంకా వారి వరకు ఆధునిక మానవ సాహసాలు సాగలేదు. ఇలాంటి వారిలో తోటపల్లి మల్లేశ్వరస్వామి ఒకడు.

తోటపల్లి తూర్పు గోదావరిజిల్లా పెద్దాపురం తాలూకాలో వుంది. గొల్లప్రోలు రైలుస్టేషనుకురమారమి పదిహేను మైళ్ళలోనూ గ్రాండు ట్రంకురోడ్డు పై ఉన్న కత్తిపూడికి తొమ్మిది మైళ్ళలోనూ వుంటుంది. చాలాదూరం వరకు కారు ప్రయాణం సాగించవచ్చు కాని ప్రకృతి సౌందర్యాన్ని తనివి తీరా చూస్తూ వెళ్ళాలంటే వీటన్నింటినీ మించిన మరొక మార్గం వుంది. గొల్లప్రోలుకు దగ్గరలో వున్న చెందుర్తి గ్రామంనుంచి రెండెడ్ల బండిమీద వెళ్ళినట్లయితే కొండలమధ్యనుంచీ వాటిని చుట్టుకుంటూ పోతూ రమణీయమైన తోటలవెంటనడుస్తూ నాగరికత ఇంకా అంతగా వ్యాపించని "కొండపలి", "పోతులూరు", "వాకపల్లి" గ్రామాలగుండా తోటపల్లి చేరుతాం. దారి పొడుగునా చూడవలసిన దృశ్యాలు ఎన్నో గోచరిస్తాయి. వీటికితోడు 1758 సం॥ ఫ్రెంచివారికి – ఆంగ్లేయులకు యుద్ధం జరిగిన "బేటిల్ ఆఫ్ చెందుర్తి" కదనరంగ ప్రాంతం. ఆ యుద్ధంలో ఫ్రెంచివారు క్యాంపుచేసిన ప్రదేశంకూడా కనిపిస్తాయి. ఈ యుద్ధంలోనే సర్కారుజిల్లాలు ఫ్రెంచివారి వద్దనుండి ఆంగ్లేయులకు దఖలు పడ్డాయి. ఇక్కడ ఆంగ్లేయుల విజయ స్తూపంకూడా వున్నది. ఫ్రెంచిక్యాంపును "ఘనదిబ్బ" అంటారు. దారిలో బండిదిగి కొంచెం యీ 'ఘనదిబ్బ' ఎక్కగలిగితే అక్కడ ఇంకా విశేషాలు కనిపిస్తాయి. పెద్ద పెద్ద రాతితొట్లెలు వున్నాయి యీ కొండమీద. ఈ తొట్లెలు బాగా నాలుగైదడుగుల పొడవు వెడల్పుగలిగి నాలుగుగజాల లోతువరకూ వుంటాయి. అందులో మరఫిరంగులు పెట్టుకొని కూర్చొని యుద్ధం సాగించారట. ఇంకా పరికిస్తే ఇక్కడ పూర్వం ఏదేవాలయమో ఉండాలని కొండక్రిందనుంచి మెట్లుండేవని తెలుస్తుంది.

ఇంక తోటపల్లి చేరుకుంటే విడచిరా బుద్ధిపుట్టదు. తోటపల్లి ఏమంత చెప్పదగ్గ గ్రామం కాదు. అంతాచేస్తే మొత్తం యేపాతిక ముప్ఫయి గుడిసెలో ఉంటాయి. అక్కడ నివసించేవారు కోయవారు.

మల్లేశ్వరస్వామి వెలసిన ప్రాంతం బహు అందంగా వుంటుంది. రెండు పర్వతములు మన తెలుగు అక్షరం "ద"లా కలుసుకుంటాయి. దానికి చివర రెండుపర్వతాలు కలుసుకొనే చోట స్వామి విగ్రహం పెద్ద ఎత్తయినశిలాఫలకం మీద ఉంది. ఆ విగ్రహంమీద నిరంతరం అన్నికాలాల్లోనూ అన్ని వేళల్లోనూ చల్లటినీరు. రెండు మూడు నీటిధారలు పడి అక్కడనుండి కొండక్రిందకు పోతుంటాయి. ఇలా స్వామి శిరస్సుమీద అభిషేకంగా పడిన నీరే తోటపల్లి గ్రామవాసులకు ఆ చుట్టుప్రక్కల వారికీ నీటివసరు. ఎంత మండువేసవికాలమయినాసరే ఎట్టి కట్టడాలు లేకపోయినా యీ మల్లేశ్వరస్వామి ప్రాంగణంలోమాత్రం నీలగిరిని తలదన్నినంతచల్లగా వుంటుంది. నిజానికి పై బట్టలేకుండా అక్కడకు వెళ్ళినట్లయితే చలివేస్తుంది. ఆ రెండు కొండలు కూడా నానారకాలయిన ఫలవృక్షాలతో కలకలలాడుతూ వుంటాయి. అన్ని మామిడిచెట్లు చింతచెట్లూ ఆ కొండమీద అంత దట్టంగా ఫలభరితంగావున్నా అక్కడి చెంచులు అవి కోయరు. ఎవరైనా చూడటానికివెళ్ళి కోయబోయినా కోప్పడతారు. వాటంతటరాలిన కాయలు తీసుకోనడానికేమీ నిషేధం లేదు. వాళ్ళు అలాగే ఏరుకొని తీసుకుపోతారు. ఎప్పుడూ అక్కడకు చుట్టుప్రక్కల పల్లెటూళ్ళనుండి జనం రెండెడ్ల బళ్లమీదవచ్చి మల్లేశ్వరుణ్ణి సేవించుకొని ఆయన సమక్షంలో మూడు రాళ్లమీద వంట చేసుకొని తిని సాయంకాలం తిరిగిపోతూ వుంటారు.

ఆ కొండలపైకి పోయినట్లయితే అక్కడ అరటితోటలు కూడా వుంటవి. కొండమీద గుహలో పూర్వం ఎవరో "పిచ్చివాడు" అని పిల్చుకొనే ఒక సాధువు ఉండేవాడట.

(46 వ పేజీ చూడండి)

కలలు

సినిమాలో అందరికీ రెండోరీలులో పెద్ద డాన్సు చేస్తున్నట్లు కలలొస్తాయి. మనకూ అదేఅలవాటు పట్టుబడింది ఆ అలవాటుకు ఈపిచ్చి నమ్మకాలనేవి జతయి కలగాపులంగంగా తయారై వుక్కిరిబిక్కిరౌతుంటాం. మనిషన్నవాడికి పనిప్రాణం. పనిలేనినాడు పిచ్చిఊహాలూ, పిచ్చికలలూ తప్పవు. ఆపిచ్చికలలకు దరిమిలా పిచ్చి అర్థాలు కల్పించుకుంటే మరింత చికాకు. అంచేత కలల్నిగురించి ముఖ్యంగా చెడు కలల్నిగురించి బాధపడటం మంచిదిగాదు. మంచి కలలయితే బెంగెట్టుకున్నా నష్టం ఏమీ వుండదనుకోండి. అంచేత మంచికలలను నమ్మినా అట్టే యిబ్బందిలేదు. ఎటొచ్చీ చెడుకలల్ని నమ్మటమే ప్రమాదం. నామటుకు నాకు కలలమీదకంటె దూరపు కొండలనునుపుమీద నమ్మకం జాస్తి.



"మీవారింకా యింటికి రాలేదా? అన్న వ్యాసం చాలా బాగుంది. ఆవిడ వ్రాసినట్లు చాలామంది పేకాటాలకోసం క్లబ్‌లకు పోయి ఆలస్యంగా వచ్చినమీదట యింటి దగర భార్యతో తప్పనిసరిగా అబద్ధమాడవలసి వస్తోంది. ఈ మాటలో ఆమెతో నేను కూడా ఏకీభవిస్తున్నాను. ఆమెకు నా కృతజ్ఞతాభివందనములు.

ఎ. విజయలక్ష్మి, (సోంపేట.)

* * *

X+1

కలికాలం, 'నాగరిక' సమాజంకాబట్టి ఈ రోజుల్లో మనిషి సగటున పదో పరకో అబద్ధాలు చెప్పందే రోజుగడవదు. బయట తిరిగి నాలుగురాళ్లు గడించాల్సిన మొగాళ్లు మరికొంచెమైనా చెప్పకతప్పదు. ఒక పురుషుడు ఈ ప్రకారం సగటున రోజుకు X(ఎక్స్) అబద్ధాలు చెబుతాడనుకుందాం. ఆయన సాయంత్రం క్లబ్బుకువెళ్ళి పేకాట ఆడి ఆలస్యంగా ఇంటికి వెళ్ళడంవల్ల, కొత్తలో కొన్నాళ్లైనా అదనంగా ఒకటో రెండో అసత్యాలు చెప్పవలసి వస్తోంది.

ఈ ప్రకారం అందరూ X అబద్ధాలాడితే క్లబ్బుజీవులు 'ఎక్స్‌ప్లస్ ఒకటి' అబద్ధాలు ఆడతారన్నమాట.

పి. భానుమతి, (మద్రాసు.)

* * *

మరో ప్రశ్న

నాకు తెల్సినావిడ ఒకరున్నారు. చక్కగా నలుగురు పిల్లలు. భర్త పెద్ద ఉద్యోగస్థుడు. ఏ చీకాకులు లేవుకాని సరిగ్గా ఆయనగారు యింటికి వచ్చే వేళకు ఇది లేదని, అదిలేదని గోలచేశారని పిల్లలను బాదేస్తుంది. ఆయన మొదట్లో భార్యను మందలించి చూచాడు. లాభంలేకపోయేసరికి ఈ గొడవలు భరించలేక ఆఫీసునుండి తిన్నగా క్లబ్‌కే దారితీసేవారు. అట్లాగే అలవాటయి పోయిందట. ఇప్పుడు పిల్లలు పెద్దవాళ్లయి పెద్ద చదువు చదువుతున్నా ఆయనగారి అలవాటు మాత్రం తప్పలేదు. "మీ వారింకా యింటికి రాలేదా" అన్న వ్యాసం చదివినపుడు నాకు ఇది గుర్తుకు వచ్చింది. సంసారంలో ఎవరు పొరబాటున ఈ బాటలో పోయినా, రెండో వారి బాధ్యతకూడా ఆలోచించాలి. మగవాళ్ళకు యిల్లు విడువబుద్ధి పుట్టకుండ వుండటానికి పురుషుల సద్భావంతోబాటు స్త్రీ యింటిని ఆకర్షణీయం చేయడంకూడా అవసరం. రెండుకూడిననాడే 'మీ వారింకా యింటికి రాలేదా' అన్న ప్రశ్నకు తావుండదు.

సరోజిని నర్సింగరావు (కరీంనగర్)

* * *

సులోచనగారు వ్రాసిన మీ వారింకా ఇంటికి రాలేదా అనువ్యాసము చదివాను. రచయిత్రిగారు ఈ రోజులలో జరుగు సంగతులను పూసగుచ్చినట్లు విశదీకరించినారు. సులోచనగార్కి నా ధన్యవాదాలు.

గోపాల్ (డోకిపర్రు)

* * *

నేను కూడా

"మీ వారింకా ఇంటికి రాలేదా?" అన్న వ్యాసం చదువుతూ నేను కూడా కొంచం బాధపడినమాట వాస్తవమే. ఎంతో మంది ఇల్లాళ్ళు నిత్యము తమ భర్తలరాక గురించి నిరీక్షిస్తున్నారను నది, ఏక్లబ్బులో చూచినా తెలుస్తూనే ఉంటుంది. భార్యలు పడే అవస్థలు, ఆయా సంసారాల్లో ఉండే కష్టనష్టాలు రచయిత్రి చక్కగా విశదీకరించారు.

వై. ప్రభాకరరావు (బందరు)

* * *

మా ఊరిలో బొట్టుచెప్పే ఆచారం ఉపద్రవముగ నున్నది. పుట్టినరోజనో, పుట్టువెంట్రుకలు తీయడమనో ఉయ్యాలలో వేయడమనో ఏదీకాకపోతే అన్నముహూర్తమనో, లేక చెవులు కుట్టించుటనో సాధారణ కుటుంబీకులను కొల్చుకతింటూ యున్నారు. వీటిలో కానుకలు తప్పనిసరి. దీనివల్ల నెల ఒక్కంటికి అధమం 6,8 రూ ఖర్చులగుచున్నవి. ఈ పరిస్థితి ఆంధ్ర దేశమంతట ఉందా? ఈ వ్యాపారాన్ని ఎలా ఎదుర్కోటం?

వై. హైమవతి. (చక్రధర్ పూర్)

* * *

కాళీపట్నం శ్రీనివాసరావుగారు వ్రాసిన "శ్రీమతి ఇందిర అన్న వ్యాసం ప్రతిఒక్క స్త్రీ చదవతగినది. ప్రతి భారతస్త్రీ ఆమె జీవితచరిత్ర, దేశసేవ తప్పక తెలుసుకోవలసినదే. ఇప్పుడిప్పుడే అన్ని రంగాలలోను ముందడుగు వేయుచున్న స్త్రీలకు ఇందిర గారు కాంగ్రెసు అధ్యక్షురాలు కావడం మరింత ప్రోత్సాహకరము కాగలదని ఆశించవచ్చు.

డి. సరోజమ్మ. (పులివెందుల)

* * *

సి. ఎస్. లక్ష్మిగారు "పిచికమీద బ్రహ్మాస్త్రమా" అంటు వ్రాసినలేఖ చదివి నవ్వుకున్నాము. పిచికలముచ్చట పాడు చేయకూడదనే వీరికి ఓరకంగా అభినందించాలి, వీరు చెప్పినపద్ధతిలో అయితే "పిచికలకు" ఓ అద్దం ప్రత్యేకించి వదిలేయాలి. అలా చేయగల తాహతెంత మంది కుంది? (లక్షాధికారులు తప్ప) లక్షాధికారులుకూడా అలా చేయరనే నా నమ్మకం!

గవ్వా కన్నారావు (కాకినాడ)

★ మామిడికాయతో ★

మామిడికాయ ఊరగాయ: ఈ పేరు చూచి ఇది నిలవవుండే ఆవకాయలాంటిది అని అనుకోకండి. ఇది అయిదు ఆరురోజుల కంటె ఎక్కువ నిలవవుండదు. ఇటువైపు వారు (విశాఖజిల్లా) 'పచ్చడిబద్దలు' అని అంటారు. మనకు కావలసినన్ని మామిడి కాయలు చెక్కుతీసి ఒక అంగుళంపొడవు, పావు అంగుళం దళసరి (మందం) లో ముక్కలు కోసుకుని ఒక పళ్ళెంలో ఉంచుకోవాలి. తరువాత రోలు శుభ్రంగా కడిగి, యీ ముక్కలకు సరిపడే ఆవాలు, మిరపకాయలు, పసుపు, ఉప్పు తీసుకుని రోట్లో వేసి, నీళ్లు చిలకరిస్తూ మెత్తగా రుబ్బాలి. రుబ్బినప్పుడే ఒక టేబుల్‌స్పూను పసుపుకూడా వేయాలి. ఆ ఆవముద్ద అంటే పలుచగా కాకుండా అట్టేగట్టిగా కాకుండా ఓమాదిరిగ రుబ్బాలి. ఇలారుబ్బిన ఆవముద్దనీ కోసి ఉంచుకున్న మామిడికాయ ముక్కలకి పట్టించాలి. ఇష్టమున్నవారు కాస్తబెల్లం కోరి అందులో వేసి కలుపుకోవచ్చు. తీపు పయించనివారు మానేయవచ్చు కానీ అట్టే కాకుండా కొద్దిగా బెల్లంవేసినట్లయితే పులుపు విరిగి తినడానికి బావుంటాయి అలా అన్నీ కలిపిన తరువాత ఒకస్పూన్ నూనె వేసి కలియబెట్టి వుంచేయాలి. ఇవి ఉదయంచేస్తే రాత్రి అన్నంలోకి ఊరి సిద్ధంగావుంటాయి. అన్నీ ఉజ్జాయింపునే వేసుకోవాలి. వీటికి కొలతలు చెప్పలేం. వీటినే కొందరు ఆవగుండ (ఆవకాయలో వేసేది) వేసి కలిపేస్తారు. రుబ్బటం శ్రమఅయినా గుండవేసిచేసే కన్నా యీ రుబ్బినవే రుచిగా వుంటాయి.

పచ్చడి: కావలసినవి - మామిడికాయలు కొబ్బరి ముక్కలు, పచ్చిమిరపకాయలు, ఉప్పు, పసుపు, నీరుల్లి పాయలు.

చేసేవిధానం: మామిడికాయ చెక్కుతీసి ముక్కలుతరిగి ఒక్రప్రక్క వుంచుకోవాలి. కొబ్బరికూడా ముక్కలుగా తరగాలి. పచ్చిమిరపకాయలు ముక్కలుగా తరిగి ఒకగిన్నె తీసుకుని మామిడికాయ ముక్కలుకొలవాలి. అదేవిధంగా కొబ్బరి, మిరపకాయ ముక్కలు కూడా వుండాలి. అంటే ఒకప్పు మామిడి కాయ ముక్కలకు ఒకప్పు కొబ్బరిముక్కలు ఓ కప్పు పచ్చిమిరపకాయల ముక్కలు వుండాలన్నమాట. మూడు ఒకేదానితో కొలవాలి. (మరీ కారం ఎక్కువతినలేని వారు మిరపకాయలు కొద్దిగ తగ్గించాలి కానీ ఇది కారంగావుంటేనే బావుంటుంది.) రోలుకడిగి రోట్లో ఈ మూడూ మామిడి, కొబ్బరి, మిరపకాయముక్కలూ అన్నీ వేసి తగినంత వుప్పు, పసుపువేసి నీళ్ళు చిలకరిస్తూ మెత్తగా రుబ్బాలి. దీనికి ఇంక తాళింపువగైరా లేవీ అవసరంలేదు. ఇది అన్నంలో కలుపుకోటానికి, నంజుకోవటానికి గూడా బావుంటుంది. మామూలుపచ్చడి రుబ్బినట్లే ఇదిగూడా రుబ్బాలి. ఇది మామిడికాయతో చేసే పచ్చళ్ళన్నిటికన్నా ఎక్కువ రుచిగా వుంటుంది. ఇష్టమున్నవారు ఒకకప్పు వుల్లిపాయ ముక్కలుగూడా వేసి రుబ్బుకోవచ్చు.

—బి. వరలక్ష్మి (విజయనగరం.)

★ తోటపల్లి క్షేత్రం

(44-వ పేజీతరువాయి)

అతను పరశువు భుజంమీద వేసుకొని తిరిగే వాడట. ఆయనగారు ఉన్నన్నాళ్లు అక్కడికి వెళ్లి డబ్బూ ధాన్యం తీసుకువచ్చి పర్వదినాల్లో సంతర్పణలు జరిపించేవాడట. కొలంక వీరవరం ఎస్టేట్లు, రావుచెల్లాయమ్మా రావుగారిఅధీనంలో వున్నప్పుడుకూడా ప్రతి సంవత్సరం శివరాత్రికి అక్కడ ఉత్సవాలు జరిపించి మల్లేశ్వరుకు కళ్యాణంచేయించే వారట. కానీ చిత్రమేమంటే స్వామికి ఆ కొండమీద ఒక గుడికట్టించవలెనన్న ఉద్దేశ్యం ఎవరికీ కలుగకపోవడం. బహుశా సహజంగా దేవుడిమీదపడే యీ నీటిధారకు విఘాతంకలవచ్చునన్న శంకతో మాని వుండవచ్చు. కాని నిజానికి స్వామి, ఆలయం లేకుండా అట్లా ఆరుబయటనుండటమే ఆ ప్రకృతి సౌందర్యానికి, ఆ రమణీయ పరిసరాలకి మరింత శోభను చేకురుస్తుంది.

కొండదిగి ఒక అరమైలు వచ్చామంటే అక్కడ ఓంకారస్వామి ఆశ్రమంఉన్నది. ఇది సుమారు ఒక పాతిక ఎకరాల భూమిలో నిర్మించబడింది. విశాఖపట్టణంలో లాసన్స్ బే వద్ద ఉన్న ఓంకారస్వామి ఆశ్రమం యీ తోటపల్లి ఆశ్రమమునకు అనుబంధ శాఖే. దీనిని 'శాంత్యాశ్రమం' అని కూడా అంటారు.

ఈ ఫలపుష్పవృక్షాలతో, తోటలో అక్కడక్కడ అందమైన మందిరాలతో ఈ తోట కనులపండువగా ఉంటుంది. తోట మధ్యలో ఒక ప్రార్థన మందిరం వుంది. ఇందులోనే ఒక పాఠశాల, తపాలా ఆఫీసు వైద్యశాల కూడా వున్నాయి. ఆశ్రమంలో ఉన్న దట్టమైన చెట్లు- అవి పెంచబడే విధానం చాలా ముచ్చటగొల్పుతుంది. పూల మొక్కలు మధుర పరిమళాలు గుబాళిస్తు ఉంటాయి. పచ్చని చెట్లు ఫలములతో కలకలలాడుతూ ఉంటాయి. అవన్నీ గంభీరంగా మౌనంగా మనకు స్వాగతం చెబుతూ ఉంటాయి. ఈ ఆశ్రమానికి యింకా కొంచెం దూరంగా కొండ దిగువగా యింకో భవనం ఉంది. అక్కడ గూడా కలకలలాడుతూ చెట్లు చేమలున్నాయి. అక్కడ వీరుల, పురాణ పురుషుల విగ్రహాలు గూడా వున్నవి.

ఈ ఆశ్రమం, దీని కనతిదూరంలో ఉన్న మల్లేశ్వరస్వామి నిలయం, ఆ పరిసరాలూ, కన్నులవిందుగా ఉంటాయి. మనసుకు ఆహ్లాదాన్నీ, ఉత్తేజాన్నీ కలిగిస్తాయి. పట్నాలలో చీకాకులతో సతమతమయేవారికి సెలవుల్లో, కొద్దిపాటి ఖర్చుతో వెళ్ళి చూచి ఆనందించతగ్గ విహారకేంద్రంగా దీనిని అభివృద్ధి చేస్తే బాగుంటుంది. ★

★ అంతంలేని పంతం ★

(19 వ పేజీ తరువాయి)

లతో మాట్లాడుతుంటే మనసులోని బరువూ, వేదనా తగ్గినట్టువుంటుంది. తీరికచిక్కినప్పుడల్లా శకుంతల వనజదగ్గరకెళ్ళి ఏవేవో మనస్సు కుల్లాసం కలిగించే కబుర్లుచెపుతూ వుంటుంది.

ఒకరోజు వనజ డ్రాయింగ్ రూమ్‌లో కూర్చుని ఇద్దరూ మాట్లాడుకుంటున్నారు. ఇంతలో చెప్పులసవ్వడి వినిపించి వనజ తలెత్తిచూసింది. "ఇక్కడున్నావా శకుంతలక్కా?" అంటూ నవ్వుతూ ఓ అందమైన ఆవిడ పాపాయినెత్తుకుని లోపలికి కాలుపెట్టింది.

శకుంతల "రా, రా! మంచిసమయానికే వచ్చావు సరోజా! నీకినాళ్ళనుంచీ వీరిని పరిచయం చేయాలంటే ఎప్పుడూ తటస్థపడనేలేదు. వీరేసరోజా, డాక్టర్ వనజాదేవి!" అంది.

సరోజ ఆప్యాయంగా చిఱునవ్వు చిందిస్తూ "మిమ్మల్ని కలుసుకోగలటం నా అదృష్టం!" అంది. చేతిలోని కుంకుమబరిణె తెరిచి వనజకు బొట్టుపెడుతూ "రేపు మా అబ్బాయి పుట్టినరోజు పండుగ! మీరుతప్పక రావాలండీ! మీరు రాకపోతే నేనే స్వయంగావచ్చి మిమ్మల్ని తీసుకెళతాను! ఏం శకుంతలక్కా? నువ్వు వీరిని నీతో తీసుకురాకపోవాలీ, అప్పుడుంటుంది తే నీపని!" అంది సరోజ కోమలంగా దరహాసచంద్రికలు ప్రసరింపచేస్తూ.

శకుంతలతోనూ, వనజతోనూ మరీ మరీ చెప్పి సరోజ ఇంటికి వెళ్ళిపోయింది. సన్నగా, పొడూగ్గా అందమైన కోలముఖంతో కలకలలాడుతున్న సరోజరూపం వనజ మనస్సులో చాలాసేపటివరకూ తారట్లాడుతూనేవుంది.

మర్నాడు వనజ వీలుచేసుకుని శకుంతలతో సరోజఇంటికి పేరంటాని కెళ్ళింది. సరోజ ఆప్యాయంగావచ్చి పలకరించింది. పేరంటాళ్ళంతా సందడిగా కూర్చుని మాట్లాడుకుంటున్నారు. సరోజ చంటిపిల్లాడిని ఎత్తుకునే అన్నీ సవరించుకుంటున్నది. మిగతా ముగ్గురుపిల్లలూ అటూ, ఇటూ తిరుగుతూ అల్లరిచేస్తున్నారు. సరోజ ఒక్కొక్కరినే దగ్గరకుపిలిచి చూపించింది. వనజకు వాళ్ళందరినీ చూస్తూంటే ఏదో మధురమైన వింత అనుభూతి కలిగింది. చటుక్కున సరోజచేతిలో పిల్లాడిని తీసుకుని ముద్దుపెట్టుకున్నది. అందరూ వెళ్ళాకకూడా సరోజ వనజను ఇంటికి వెళ్ళనిచ్చిందికాదు. "మీరు రావటానికే కుదరదు. వచ్చినప్పుడైనా మరోగంట కూర్చోకుండా వెళితే ఎలా?" అని బలవంతంచేసి శకుంతలనూ, వనజనూ కూర్చోపెట్టేసింది.

వనజలేచి గోడమీది ఫోటోలు చూడసాగింది. సరోజ వనజప్రక్కనే నించుని ఒక్కొక్క ఫోటోగురించి చెప్పసాగింది.

ఉన్నట్టుండి వనజ వులిక్కిపడింది. సురేష్, సరోజా, పిల్లలూ తీయించుకున్న ఫోటో అది! సరోజముఖంలో సిగ్గుదొంతరలు సన్నగా నాట్యం చేశాయి. "నేనూ, మావారూ, పిల్లలూ" అందమెల్లగా సరోజ! సరోజ వదనంలోని ప్రఫుల్లత, అనురాగం చూసి వనజ మనస్సెందుకో చిన్నబుచ్చుకుంది. కొంతదూరంలో చిన్నప్పుడు సురేష్, తనూతీయించుకున్న ఫోటో తగిలించి వుంది. సరోజ ఆ ఫోటోకేసి చూపిస్తూ "ఈవిడ మా వారి మొదటి భార్య! మహాగయ్యాళి అటలెండి! అయినదానికీ, కానిదానికీ పోట్లాటలు పెట్టేసి పుట్టింటికి వెళ్ళిపోయేదట! వారసలు ఎంతోశాంతంగా సరదాగా వుంటారుకదా! అలాంటివారితోనే ఆవిడకు పడలేదట! చిత్రమైన మనుష్యులుంటారండీ! వీరికి విడాకులిచ్చేసి ఏదో చదువు వెలగబెట్టిందట! పెళ్ళికూడా చేసుకుందేమోలెండి, మళ్ళా ఎవడికొంపో తీయ్యటానికి! అలాంటివాళ్ళ ముఖం చూసినా పాపమేసుమండీ! నీతి నిజాయితీ లేకపోయాక ఎందుకొచ్చిన బ్రతుకు చెప్పండి?" అంది సరోజ.

వనజకు కాళ్ళక్రింద భూమి కదులుతున్నట్టనిపించింది. తలదిమ్మెక్కినట్టయింది వనజనుచూసి సరోజ గాబరా పడింది. "ఏమండీ! అలావున్నారేం?" అంది వనజ కొంత తెప్పరిల్లి "మరేంలేదు! తల తిరుగుతున్నట్టుంది. ఇంటికివెళ్ళి కాస్సేపువిశ్రాంతి తీసుకుంటే అదే పోతుంది!" అంటూ శకుంతలతో హడావుడిగా ఇంటికి బయల్దేరింది. వనజా, శకుంతలా గుమ్మంలోకి వచ్చేసరికల్లా ఎవరో గేటుతలుపు తీసుకుని లోపలకు వస్తున్నారు చేతిలో మల్లెపూల వాసన ఆమడదూరందాకా వేస్తున్నది. వనజ ఆ వ్యక్తిని తేరిపార చూసి మనస్సులోనే నిట్టూర్చింది స్నేహపూర్వమైన ఆ సుందర వదనంలోని ప్రశాంతత, ప్రసన్నత చూసి వనజ ఆవేదనకు లోనయ్యింది. ఆ నాడు తను అంత పొరపాటు పనిచేయకపోతే సరోజలానే తనూ పిల్లలతో, భర్త అనురాగంతో కలకలలాడుతూ జీవించేదికదా?

ఇంటికి వెళ్తూండగా త్రోవలో "మల్లెపూలు కొంటారామ్మా?" అనడిగాడు ఒక కుర్రాడు పూలతట్ట నెత్తిని పెట్టుకునివస్తూ. వనజ త్రుళ్ళిపడి చూసింది! ఎందుకో హఠాత్తుగా సురేష్‌చేతిలోని మల్లెపూలు జ్ఞాపకం వచ్చాయి. ఈపాటికి అవి సరోజ జడను అలంకరించే వుంటాయేమో! ఈనాడు తనూ ఎవ్వరినీ అడక్కుండా అన్నీ తనే కొనుక్కోగలదు! అయితే సాటిలేని అనురాగంకొందామనుకున్నా ఎక్కడ దొరుకుతుంది? తన తండ్రి తనను ఎందుకూ కొరగానిదానిగా చేశాడు! ఇంటికి వెళ్ళాకకూడా వనజమనస్సు ఏం బాగుండలేదు.

రాత్రంతా వనజ వికలమైన మనస్సుతో అపరిమితంగా బాధపడింది. తెల్లవారిన తర్వాత డ్యూటీకి వెళ్ళలేక సెలవు పెట్టేసింది. సరోజ తనను అన్నమాటలు శూలాల్లా గ్రుచ్చుకున్నట్టుగా కలతచెందింది వనజ.

సాయంకాలం తండ్రి తనతో పదిమందిని వెంటేసుకునివచ్చాడు. సంతోషంతో వురకలు వేసుకుంటూవచ్చి "వనజా! ఆ కాల్టెక్స్ కంపెనీలో పనిచేసే ఆయన పెళ్ళికి వప్పుకున్నాడు. వాళ్ళు నిన్ను చూడ్డానికి వచ్చారు! త్వరగా సిద్ధంకా!" అన్నాడు.

వనజ మౌనంగా ఆలోచిస్తూ వించున్నది ఆర్థికస్వాతంత్ర్యంవుంటే మరేం అక్కరలేదనుకున్నది తను ఒకనాడు! కాని యీనాడు తను లెక్కలేనంతడబ్బు గడిస్తున్నా ఏమిటో చెప్పలేని వెలితి! ఆ శూన్యాన్ని ఎవరూ పూరించలేరు. ఆసంగతి తనకు తెలియనే తెలుసు! 'నిత్యకల్యాణం పచ్చతోరణంలా' వుండాల్సిన తన జీవితాన్ని ఎడారిలా మార్చుకుంది. జీవితంలో అమూల్యమైనదాన్ని 'ఏదో' తను పోగొట్టుకున్నది! ముప్ఫైఏళ్ళ వయస్సులో తను పెళ్ళిచేసుకుని ఏం సుఖపడుతుంది? అతన్నేం సుఖపెడుతుంది? యౌవనమంతా వ్యర్థంగా శోకంతోనే గడిచిపోయింది. ఇంక మరి... ఇప్పుడు పెళ్ళిదేనికి? సరోజ మాటలు తనను శూలాల్లా పొడుస్తూన్నాయి! తను చేసింది పొరబాటే! అయినా ఎప్పటికప్పుడు దిద్దుకోవాలనుకున్నా తండ్రి కఠినుడైకఠోరంగా అడ్డు నిలిచాడు! తనింకేంచేయగలదు మరి! చూస్తూ, చూస్తూ తన జీవితాన్ని పాడుచేసుకోవటంతప్ప మరేం చేయలేకపోయింది.

"త్వరగా తెమిలిరా వనజా! అవతల వాళ్ళొచ్చి అప్పుడే అరగంటపైనఅయ్యింది." అంటూ భూషణం మరోసారి లోపలికొచ్చాడు.

వనజ సంతతధారాపాతంగా కారుతున్న కన్నీళ్ళను తుడుచుకుంటూ "నా జీవితాన్ని నిర్దయగా నలిపేశావు నాన్నా! ఈ మిగిలిన శుష్కజీవితానికి కూడా శాంతిలేకుండా చెయ్యకు! వాళ్ళని వెళ్ళిపొమ్మను చెప్పు నాన్నా! నాకు నీవు జన్మలో చేసే వుపకారమేదైనా వుంటే, ఇదొక్కటే నాన్నా!" అంటూ గబగబా తన గదిలోకి వెళ్ళిపోయింది, తెల్లబోతూనించున్న భూషణాన్ని నిర్లక్ష్యంచేసి— ★



శశాంకుడు ★ కుమారి కె. హైమ

ఒక్కనాడు చందమామ
మిక్కిలి సంతోషంతో
భూమిపైన తిరుగుచుండె
ముసలివాని వేషంతో.

చరచర తిరుగుతుఆతడు
చివరకు ఒక అడవి చేరె.
కరకరమని ఆకలాయె
సూర్యుడు నడినెత్తిచేరె.

అడుగులోన అడుగువేస్తు
అడవి నడుమ చేరె నతడు
జంతువులను చూచి, తనదు
ఆకలి తీర్చుడని కోరె.

భక్తిగలిగి మృగము లన్ని
ఓపినంతవరకు పళ్ళు
మాంసము, చేపలు గ్రుడ్లు
తెచ్చివేసె కుప్పలుగా.

కుందేలుకు మాత్రమొక్క
సందేహం గలిగె నిట్లు:
"ఇంట్లో ఏమీ లేవే
అతిధికి ఆహారమెట్లు?"

ఆలోచన చేసి చేసి
ఆలాగే చేరె నటకు
అంత చంద్రు డడిగెనిట్లు:
"ఉత్త చేతులూపుకొనుచు
ఊరకనే వచ్చినావె?"
విని, కుందే లిటులన్నది:

"స్వామీ నా ఇంటిలోన
అయిపోయిన దాహారం
నేనే మీ భోజనమై
యుంటి, తీర్చుకొను డాకలి."

అంటూనే మంటచేసి
అందు చెంగుమని దూకెను.
దాని త్యాగ గరిమచూచి
చందమామ మంటలార్పి:

"చిన్నారీ కుందేలా!
చేసితి వెంతో ధైర్యం
నా ఆహారం కోసం
అగ్గిని బడినావు బలే!

ఎన్నటికీ మరువరాని
దీఘట్టం, సరిలేవే.
ఇకపై నీ గురుతులు
నాపై వుంటవి లేవే!"

అంటూ చంద్రుడు ఆపై
నేలవిడిచి నింగికరిగె;
నాటికుండి కుందేలే
అందమైన గురుతాయెను!

చంద్రుని 'శశాంకు'డనుచు
అందరందు రందులకే!

[illegible]

శ్రీరామచంద్రుడు రావణుని చంపి, సీతను మళ్ళి తీసికొనివచ్చి ఈ భూమండలాన్ని అనేక సంవత్స రాలకాలం పాలించాడు. శ్రీరాముడు పరిపాలనలో తనకు తనే సాటి. ఆయన పాలనలో ఎవరూ ఏలాటి కష్టమూ పొందలేదు.

ఒకనాడు శ్రీరాముడు సభ తీరి ఉన్నాడు. లక్ష్మణుడు ప్రజల కష్ట సుఖాలను తెలిసికోడానికి నగరంలో తిరుగుతున్నాడు.

ఇంతలో కుక్క ఒకటి తల పగిలి దేహమంతా నెత్తురు కారుతుండగా లక్ష్మణుని ముందరికివచ్చి నిలచి దీన ముగా అరుస్తూ కన్నీరు కార్చ సాగింది. లక్ష్మణుడు ఆ కుక్కను చూసి "ఎందుకలా ఏడుస్తున్నావు?" "నీ తలపై గాయమును చేసిందెవరు? ఎందుకలా చేశారు?" అని ప్రశ్నల వర్షం కురిపించాడు.

అందులకా కుక్క "ఆ సంగతు లన్ని నీ అన్నయైన రామునితో తప్ప వేరెవరికి చెప్పను" అని చెప్పింది.

"మంచిది! ఆవిధంగా ఆయన తోనే చెబుదువు గానిలే" అని లక్ష్మణుడు రామునివద్దకు పోయి ప్రకల కష్టసుఖాలు తెల్పి, శునకము యొక్క సంగతి తెలిపాడు.

శ్రీరాముడు వెంటనే ఆ శున కాన్ని తనవద్దకు తీసుకురమ్మని లక్ష్మణునికి ఆజ్ఞాపించాడు.

లక్ష్మణుడు శునకాన్ని రాముని వద్దకు తీసికొని వచ్చాడు. నెత్తురు వరదలుగా కారుతుండగా ముఖము వేలవేసుకొని ఉన్న ఆ కుక్కని చూసి రాముడా కుక్కతో "ఎవరు నీ కీలాగ గాయముచేశారు?" అని అడిగాడు.

అందులకా కుక్క యిట్లు చెప్ప

కె. సోమశేఖర్

సాగింది: "రాజా! సాధువులపై దయ చూపించుట రాజలక్షణము. నీవు ధర్మాత్ముడవు. కాబట్టి నాకు న్యాయము చేయవలెను. నేను ఎవరికి ఏలాటి అపకారము చేయక వీధుల వెంబడి తిరిగేదానను. నా కర్మ మేమో. ఈ దినమొక భిక్షుకుడు తన లావాటి దుడ్డుకఱ్ఱతో అన్యాయ ముగా నా నెత్తిపై మోదాడు. కావున నీవు విచారించి న్యాయమైన తీర్పు చెప్పవలెను," అని ప్రార్థించింది.

శ్రీరాము డా భిక్షుకుని వెంటనే పిలిపించి అతనితో "ఈ శునకముపై నీకేమి పగఉన్నది? కోపముతో తల పగులకొట్టినావు. అయ్యో! బ్రాహ్మణవంశమున పుట్టిన్నీ కోప మును జయించలేక పోయినావు గదా!" అనగానే ఆ భిక్షుకుడు చేతులు జోడించి యిట్లు చెప్ప సాగాడు. "ఓ దేవా! భిక్షము

శ్రీమతి సచార్ చే బహుమతి ప్రదానం

ఆంధ్ర సచిత్ర వారపత్రిక స్వర్ణోత్సవసందర్భాన జరిగిన బాలలసంఘంపోటీలో 'బి' వర్గం మొదటి బహుమతి పొందిన కుమారి భమిడిపాటి సుబ్బలక్ష్మికి ఆంధ్రప్రదేశ్ గవర్నరు సతీమణి శ్రీమతి సచార్ ఆంధ్రపత్రికాధిపతుల తరఫున వాటర్‌మన్స్‌పెన్ బహూకరించారు. ఈ బహూ కరణం ఏప్రిల్ 10-వ తేదీన విశాఖపట్నం మునిసిపల్ స్టేడియంలో సంస్కృతి సంఘ అధ్వర్యాన జరిగిన బాలల దినోత్సవసందర్భంలో జరిగింది. కుమారి సుబ్బలక్ష్మిని శ్రీమతి సచార్, సంస్కృతి సంఘాధ్యక్షులు శ్రీ జి. కె. మంగరాజు, కార్యదర్శి శ్రీ ఎస్. ఎస్. మణి, కోశాధికారి శ్రీ వెంకటాద్రి, తదితర కార్యవర్గ సభ్యులు ఆశీర్వదించి అభినందించారు. సంఘ ప్రధాన కార్యదర్శి శ్రీ ఎమ్. జి. కె. మూర్తి మాట్లాడుతూ కుమారి సుబ్బలక్ష్మికి బహుమానం రావటం విశాఖపౌరులకు గర్వకారణమని చెప్పారు.

కొంతసేపటికి ...

కొఅకై నేను ఇంటింటికి తిరిగి తిరిగి అలసి ఉన్నప్పు డీ కుక్క దారికడ్డముగా నా కాళ్ళవద్ద వచ్చి నిలబడింది. అందువలన కొట్టాను. నాపై తప్పుగలదు. ఏ దండనము విధించినా సిద్ధముగా ఉన్నాను. అని చెప్పాడు.

శ్రీరాము డాకుక్కనే తీర్పుచెప్పమని అడిగాడు. వెంటనే ఆ కుక్క "రాజా! ఇతనిని ప్రక్కన ఉండే నీలాంజనమనే దేవళమును పాలించుటకు పంపుము! అదియే అతనికి శిక్ష" అని చెప్పగా శ్రీరాముడును ఆవిధముగనే అతనిని భద్రగజముపై కూర్చుండపెట్టి ఆ దేవళమున కధిపతిగా చేశాడు.

అప్పుడు ప్రక్కనే ఉన్న మంత్రులు కొందరు శ్రీరామునితో "దేవా! ఈ విధముగా తప్పుచేసిన వానికి గొప్ప ఆధిపత్యమిస్తే తక్కిన వారుకూడ అలా చేయరా?" అని అడిగాడు.

శ్రీరాముడు నవ్వుతూ, "అలా చేయడం మంచిదో, చెడ్డదో, ఆ శునకాన్నే అడగండి," అని చెప్పాడు.

అంత ఆకుక్క ఇట్లు చెప్పసాగింది. "అయ్యా! పూర్వజన్మలో నేను బ్రాహ్మణుడై పుట్టి ఆ దేవాలయ అధిపతిగా ఉండి దేవుని సొమ్ము కొద్దిగా గ్రహించినందున నాకీ జన్మలో కుక్కజన్మ కలిగింది. ఈ బ్రాహ్మణభిక్షుకుడుకూడ నాలాగే దేవుని సొమ్ముతిన్నవో మరునటి జన్మలో నా జన్మను కన్నహీన జన్మ మొకటి కలుగకుండా ఉండునా?" అని పలికింది.

మంత్రులు కుక్కదూరదృష్టికి ఆశ్చర్యపోయారు. ★

నవ్వులు

అమ్మాయి: మా అమ్మకి మీరు నచ్చలేదుట. 'ఆడంగబ్బాయి' అంది.

అబ్బాయి: మీఅమ్మతో పోల్చిచూస్తే నేను ఆడంగబ్బాయిలాగే వుంటామరి.

* * *

ఒక తాగుబోతు: భాయీ! టైమెంతయిందో తెలుసా?

రెండో తాగుబోతు: ఓ!

మొదటి ,, : థాంక్స్.

ఆంధ్ర సచిత్ర వారపత్రిక బాలల సంఘం

GROUP
A లేక B

[సభ్యత్వపు దరఖాస్తు]

సభ్యుని (సభ్యురాలి) పూర్తిపేరు (విడివిడి అక్షరాంలో) ....

పుట్టినతేదీ, నెల, సంవత్సరం : జూలై 1 నాటికి వయస్సు ....
తండ్రి, లేక, సంరక్షకుని పూర్తిపేరు : ....
ఊరి పేరు, జిల్లా, తాలూకా, పోస్టు [వీధి: నెంబరు] ....
* చదువుతున్న తరగతి, లేక, ఫారము : ....
పాఠశాల పేరు ....
ప్రధానోపాధ్యాయునిపేరు (తెలిస్తే) :

ఆర్యా :
ఆంధ్ర సచిత్ర వారపత్రిక బాలల సంఘములో నన్ను సభ్యునిగా/సభ్యురాలుగా చేర్చుకొనప్రార్థన. పైన వ్రాసిన విషయాలన్నీ యదార్థములు.

ఇట్లు

[తేదీ : -1959]

(సంతకము)

* వరా : ఏ పాఠశాలలోనూగాక ఇంటివద్దనే ట్యూషన్ చెప్పించుకొనే బాలబాలికలు కూడా సభ్యులుగా చేరవచ్చు. 'చదువుతున్న తరగతి' అనే విషయానికి ఎదురుగా 'ప్రైవేట్ స్టడీ' అని వ్రాయాలి.

సంచిక: 29-4-59 | ఈ దరఖాస్తు 2-4-59 నాటికి మాకు చేరాలి |

ఎన్ని తట్టలు కావాలి?

అనగా అనగా ఒక రాజుగా రుండే వారు. ఆయనకు అన్నీ అనుమానాలే. ఎప్పుడూ ఏదో ఒకటి మంత్రులను ప్రశ్నిస్తుండేవాడు. పండితులు అతని ప్రశ్నలకు సమాధానాలు చెప్పి అతని అనుమానాలు తీరుస్తుండేవారు. ఐనా రాజుగారికి ఇంకా అనుమానాలు వొస్తూనే వుండేవి.

ఒకరోజు సాయంత్రం రాజుగారు మంత్రుల తోటీ, పండితుల తోటీ షికారు వెళ్లారు. దారిలో ఒక చిన్న పర్వతం వుంది. రాజుగారికి దాన్ని చూడగానే ఓ అనుమానం కలిగింది. ప్రక్కనున్న వాళ్లను యిలా అడిగాడు:

"ఈ పర్వతాన్ని ఇక్కణ్ణుంచీ కదిలించాలంటే ఎన్ని మట్టి తట్టలు కావలిసి వుంటాయి?"

ఆ ప్రశ్న వినగానే అందరూ వులిక్కిపడ్డారు. సమాధానం చెప్పలేక మౌనం ధరించారందరూ.

రాజు తన ప్రశ్నను రెట్టించి అడిగాడు.

"ఈ పర్వతాన్ని యిక్కణ్ణుంచీ కదల్చటానికి ఎన్ని మట్టి తట్టలు కావల్సి వుంటాయ్?"

అందరూ ఒకరి మొహాలొకరు చూసుకున్నారు.

రాజుగారికి కోపం వచ్చింది.

"నా ప్రశ్నకు ఎవరూ సమాధానం చెప్పలేరా?—గణిత శాస్త్రజ్ఞుణ్ణి యిలా రమ్మనండి:" అన్నాడు. ఆయన వణుకుతూ ముందుకొచ్చాడు. "ఏమండీ! మీరు చెప్పండి. ఎన్ని మట్టి తట్టలవసరమో?"

"ప్రభూ! నిజం చెప్పేస్తున్నాను. నాకు తెలీదు."

"గణిత శాస్త్రజ్ఞులుగా వుండి ఇంత చిన్న ప్రశ్నకు సమాధానం తెలియదంటే సిగ్గుచేటు. రేపు రాత్రి దాకా గడువిస్తున్నాను. ఆలోచించి చెప్పండి. అప్పటికీ చెప్పలేకపోతే, ఎల్లుండి తెల్లవారేసరికల్లా మీ తల కోటగుమ్మానికి వ్రేలాడుతుంటుంది." అన్నారు రాజుగారు కఠినంగా.


గణిత శాస్త్రజ్ఞుడు విచారంగా ఇంటికి వెళ్లాడు. రాత్రంతా బుర్ర బద్దలయేటట్టు ఆలోచించాడు, కాని రాజుగారి ప్రశ్నకు సరైన సమాధానమేదీ మెదడుకు తట్టనేలేదు. తెల్లవారుతోందనగానే, క్షణక్షణానికీ భయం ఎక్కువ కాసాగింది.

తెల్లగా తెల్లవారింది.

మంగలి సూరయ్య మామూలు ప్రకారం ప్రొద్దుటే క్షవరం చేయటానికి వచ్చాడు.

'భరణి'

రంగుల రాట్నం-2. వాల్ట్ డిస్నీ



ఆ, ఏముంది? నలుగురితో పాటు నారాయణా అన్నారు."

★ ఎన్ని తట్టలు కావాలి? ★


"ఏం బాబూ! ఇయాల అలా వున్నారు?" అనడిగాడు.

"ఏం లేదు లే సూరయ్యా! చెప్పినా నువ్వు ఆర్చేవాడివా, తీర్చేవాడివా?" అని నిట్టూర్చాడు.

"మీరలా గనకండి బాబయ్యా! వింటే తప్పు లేదుగా." అన్నాడు సూరయ్య.

జరిగినదంతా చెప్పాడు.

సూరయ్య తేలికగా నవ్వేసి, "ఈ మాత్రానికే భయపడటా లేమిటండీ! దీనికి జవాబు నేను చెప్తాను. మీరేమీ విచారించకండి." అన్నాడు.



పాపం హరనాథకు బెంతుతో ఆడుకోవాలని కుతూహలంగా వుంది. కాని ఆచెండు వద్దకు పోయేందుకు మార్గం తెలీక తికమకపడుతున్నాడు. మీరైనా ఆ అబ్బాయికి త్రోవ చూపించి పుణ్యం కట్టుకోరూ!

పంపినవారు: ఓ. వి. కృష్ణమూర్తి-మదనపల్లె

వాగీశుడు

వేస్టారు పారం మధ్యలో ఆపు చేసి: "వెనకబెంచీలలో ఎవరో గాడిదలాగ వాగుతున్నాడు. అదయిపోగానే నేను మొదలెడతా."

గణితశాస్త్రజ్ఞుడికి ఆశ్చర్యం వేసింది.

నాటిరాత్రి మంగలిసూరయ్యతో కలిసి గణితశాస్త్రజ్ఞుడు రాజుగారిని దర్శించటానికి వెళ్లాడు.

"ఏం? ఆలోచించారా?" అన్నారు రాజుగారు.

"చిత్తం ప్రభూ! మీ ప్రశ్నకు ఈ మంగలి సూరయ్య సమాధానం చెప్పగలడు."

"అలాగా! ఏదీ ఐతే చెప్పు."

సూరయ్య సవినయంగా చేతులు కట్టుకుని యిలా అన్నాడు:

"ప్రభువుల వారు మన్నించాలి. ఆ పర్వతమంత వైశాల్యం కలిగిన తట్ట ఐతే వొక్కటే చాలు, పర్వతంలో సగమే వైశాల్యం వుంటే రెండు తట్టలు కావాలి. మూడోవంతు వుంటే మూడు తట్టలు, నాలుగవ వంతు ఐతే నాలుగు, ఐదోవంతు ఐదు; ఆరోవంతు..."

అలా చెప్పబోతుంటే రాజుగారు వోపిక పట్టలేక పోయారు.

"చాలు! చాలు! నువ్వు ఇలా చెప్పుకుపోతుంటే నేను రాత్రి నిద్ర పోయినట్టే!"

రాజుగారికి తను అడిగిన ప్రశ్న ఎంత తెలివితక్కువైనదో అప్పటికి అర్థమైంది. మంగలి సూరయ్య తెలివికి మెచ్చుకుని నూరు వరహాలు బహూకరించాడు. గణితశాస్త్రజ్ఞుడు తను బతికి బయటపడ్డందుకు లోలోన సంతోషించాడు. ★

★ ఊహాసౌధాల యథార్థదృశ్యాలు ★

(10-వ పేజీ తరువాయి)

అ: అబ్బబ్బ చచ్చిచచ్చి వస్తే ఏమిటే నీ గొడవా!

ఆ. మీరే కాదు చచ్చిచచ్చి ఉన్నది. వెధవచాకిరీ ఎక్కడా ఊపిరి సలపకుండా నేనూ చస్తూనే ఉన్నాను.

అ: చాకిరీ, చాకిరీ అని పదిసార్లు వల్లించడం. నేను ముందే చెప్పలేదూ? తమరికి పనివాళ్లని పెట్టి చేయించేటంత జీతగాడిని కానని. (వెటకారంగా) 'మా ఇంట్లో మాత్రం మాపనులు మేం చేసుకోమా' అంటూ నీతులు చెప్పేవ్ ...

ఆ: వంట వండడంతప్పు, మగరాయుళ్ళలాగ బజార్లకిపోయి కూరలుకూడా తెచ్చుకోవడం, మా ఇంటా వంటా లేదు— పైగా అంటగిన్నెలు కూడా నేనే తోముకోవలసిన గతి పట్టుతుందని నేననుకోలేదు. ఇంత చేస్తున్నా ఎలాగ ఐచ్చేవు అని అడిగే దాత కూడా లేడు. తొమ్మిదినుండి ఏగువరకూ ఆఫీసూ-ఆతర్వాత ఓ మాటా మంతీ అయినా లేకుండా వెధవ చిత్రాలూ

అ: ఇదే కొంబోలు నా చిత్రాల్ని చూసి తన్మయత్వం చెందానననడం. ప్రోత్సాహం ఇస్తుందట. ప్రోత్సాహం. పొంగిపోయాను, నిజమనుకొని!

ఆ: ఆఁ మీరిచ్చారు మహా ప్రోత్సాహం. కథ వ్రాస్తే చదివి 'ఇలాగ మార్చు, అలాగ అయితే బాగుంటుంది' అని చెప్తారని ఆశపడ్డాను. పోనీ పంపేముందు కాకపోయినా పత్రికల్లో పడినవైనా చదవడమంటూ ఉంటేనా? అయ్యో రామ. నేను చదివినా వినేపాటి ఔదార్యంకూడా లేదు మీకు.

అ: మొన్న నేదో చదివితే నేను వినలేదూ?

ఆ. ఆఁ విన్నారు. ఐదునిముషాల్లో గుర్రుపెట్టి నిద్రపోయీ! విన్నారట!... పెళ్ళికానిక్రితం నాకథపడితే చూశేనన్నారు. చదివేరేమో ఎంత అదృష్టవంతురాలినిఅనుకున్నారు. చూశారట. అదే చేసి ఉంటారు. పెళ్ళికానిక్రితం కనుక చూడడమైనాను. ఇప్పుడదికూడా కరువైంది.

అ: నేను నీ కథలు చదవకపోయినా నీలాగ వెధవచిత్రాలు అని అసహ్యించుకోవడంలేదు. 'భర్త పైకి వస్తూఉంటే ఏ భార్య తోడ్పడదూ? భారతనారీ గిరీ' అంటూ కబుర్లు చెప్పేవ్. ఇదేకొంబోలు తోడ్పడడం.

ఆ దానికో టైమూ హద్దూ ఉంటేనా? పగలస్తమానం ఆఫీసూ. పోనీ ఆఫీసునుండి రాగానే ఓ సినిమాకి వెళ్ళడంగానీ, సరదాగా ఎక్కడికైనా వెళ్ళడంగానీ ఉంటేనా?.



వికల మనస్క

చిత్రకారుడు: వీరిశెట్టి అచ్యుతరావు—పుల్లేటికుర్రు.

అ: నువ్వేగా షికారుకి రమ్మంటే రానన్నావూ.?

ఆ. షికారంటే ఎవ్వరూ లేనిచోట కెళ్ళి గడ్డిగాదం చూస్తూ, ఓ పలుకూ ఉలుకూ లేకుండా కూర్చోడమూ, ఏదో మహాప్రకృతి దృశ్యాన్ని ఆనందించేసేనునుకోవడమూనా? నలుగురిలో కలిసి మెలిసి తిరగడం, ఒకరి ఇళ్ళకి వెళ్ళడమూ, వాళ్ళని మన ఇంటికి పిలవడం ఉంటేనా? సంఘంలో ఉన్న మనం మనుష్యుల్ని తప్పించుకొని తిరిగినంత మాత్రంలో, కళాకారులమైపోము. అంతగా ఆ కళే కావాలనుకొంటే శుభ్రంగా పెళ్ళి పెడాకులూ మానేసి ఏ చెట్టుక్రిందో, పుట్టక్రిందో ముక్కు మూసుకొని కూర్చోవలసింది? పెళ్ళి చేసికొని ఎంతసేపూ నా చిత్రాలూ, నా పనీ అని మీరుండి, ఆ వచ్చినది ఇంటిపనీ, విధి పనీ అన్నీ చేస్తూ మీ సౌకర్యాలు కనిపెట్టి ఉండాలనుకోవడం. .

అ అబ్బబ్బ. అయిందా నీ ఉపన్యాసం? బుద్ధిలేక పెళ్ళాడాను కాని ఇవాళ నాకేమైనా కాఫీ వచ్చే ఆస్కారం ఉందా? హోటలుకి పొమ్మంటావా? ఎంతో ముచ్చటపడ్డాను. ఇంటికి వచ్చేసరికి చక్కగా

★ ఊహాసౌధాల యథార్థదృశ్యాలు ★

మొహం కడుక్కొని, బొట్టు పెట్టుకొని, చిరునవ్వుతో కాఫీ అందించి, ఆఫీసులోని అలసట అంతా పోగొట్టుతావేమోనని! ఎన్నడైనా శుభ్రంగా తయారై ఎదురు పడితేనా! ఎప్పుడూ పెంచారి రూపంతో...

ఆ: ఆఁ నేనూ అనుకొన్నాను. ఆఫీసు నుండి వస్తూ మల్లెపువ్వులు తెచ్చి, చిరునవ్వుతో జడలో పెడతారనీ ఏదైనా ప్రక్కవాటుగా ఉంటే, నాబొమ్మ నాకు తెలియకుండా వేసి అంతా అయ్యాక చూపిస్తారనీను. ఇంకా మోడల్ గా నిలబడాలట. ఇన్నిబొమ్మలు వేస్తున్నారు. ఎన్నడైనా నన్ను వేసేరూ? ఎన్నికబుర్లు చెప్పేరూ పెళ్లికిముందు! ఉబ్బిపోయాను అన్నీ నిజమనుకొని..

అ :- అదుగో పాలుపొంగి కుంపట్లో పడ్డాయి కొంబోలు వెళ్ళువెళ్ళు...

ఆ :- (పరిగెట్టి ఐదునిముషాల్లో కాఫీ పట్టుకొని తిరిగివస్తుంది) ఊఁ.. తీసికోండి.

అ :- (అందుకొని త్రాగుతూ నెమ్మదిగా) చాలా బాగుంది కాఫీ. అయినా ఇంత రభస దేనికి చెప్పా. కస్రవిరిచినట్లు మాట్లాడడమే తప్ప..

ఆ :- నాకు మనస్సులో ఉన్నదేదో మొహంమీద అనేయడమే అలవాటుసుమండీ. మనస్సులో ఒకటీ పైకి ఒకటీ నాకు చాతకాదు.

అ :- (ఆమెవైపు చూస్తూ) చూడూ. శంకరం, అతనిభార్యా ఇవాళ సినిమా ప్రోగ్రామ్ వేశారు. త్వరగా రెడీఅవు...

ఆ :- (చిరాగ్గా ఇంకా అదే మూడ్ లో నిర్లిప్తంగా) ఆఁ. అదొక్కటే తక్కువ. బ్రతుకే సినిమా అయిపోయింది.

అ :- (అనునయంగా) అంత కోపమైతే ఎలాగ మరి.. నీకు మల్లెపూలు తెచ్చిపెట్టాలని మనుసా? ఐనా ఇన్నాళ్లూ చెప్పలేదేం?...రేపుతెస్తా చూడూ...

ఆ :- (కొంచెం సౌమ్యంగా) మల్లెల మాటకేం కాని ఈసారి జీతంరాగానే ఒక ప్లాస్కు కొందురూ మీకు పుణ్యం ఉంటుందీ, కాఫీ రెడీగా అందులో పోసిపెట్టేస్తే మీ రుసరుసలూ తప్పుతాయి. మన పోట్లాటలూ తగ్గుతాయి.

అ: అయినా నువ్వు కోపంలో బాగుంటావుసుమా (ఆమె జాకెట్టువైపు చూస్తూ) ఆ జాకెట్టు మెడ అంత క్రిందగా ఉంటేనే కాని ఫాషనుకాదేమిట? కాస్త మర్యాదగా వేసుకొంటే ఏం? (అంటూ సిగరెట్టు ముట్టిస్తాడు...)

ఆ: (మళ్ళీ స్వరం హెచ్చించి) ఇది వరకెన్నోసార్లు చెప్పాను మీకు. మళ్ళీ చెప్తున్నాను. నా జాకెట్ల జోలికి రావద్దని, మీరు సిగరెట్లు మానేయండి. నేను మీకు కావలసినట్లు అవ్వ జాకెట్లు కుట్టించుకోమన్నా కుట్టించుకొంటాను.

అ: సిగరెట్టకీ, దానికీ ముడిపెడతావేమిటే?.. ఇది మానితే నేనుండలేను. నీ విషయంలో...

ఆ: ఏమైనాసరే. నేనేం లోకమంతా పోయేరీతిగానే ఉన్నాను కాని, మర్యాద తప్పి వ్యవహరించడంలేదు. అయినా స్త్రీని అర్ధనగ్నంగా చిత్రించే మీరు స్క్వేర్ నెక్ ఇష్టపడకపోవడమూ, అవ్వల్లాగ పీకదాకా మెడపెట్టించుకోమనడమూ ఆశ్చర్యంగానే ఉంది.

అ: మళ్ళీ మొదలు పెట్టావూ దెబ్బలాట?

ఆ: మీరా నేనా మొదలు పెట్టింది? కోపంలో బాగుంటానట! అందుకనే కాబోలు రోజూ కావాలని దెబ్బలాట పెట్టుకొంటున్నారు. అలాగ అన్నా ఊరుకొన్నాను. అనవసరంగా నా జాకెట్లజోలి ఎందుకు మీకూ అంట?...ఏదో ఒకటి గిల్లి కజ్జాపెట్టుకొని......

అ: (చేత్తో ఆమె నోరుమూస్తూ) అబ్బ మాట్లాడకే! మనం మాట్లాడితే దెబ్బలాట వస్తోంది!

న్యూఢిల్లీ లేఖ

అనివార్యకారణాలవల్ల ఈవారం న్యూఢిలీ లేఖ ప్రచురించజాలనందుకు చింతిస్తున్నాము.

—సం॥

ఆ: (నోరుమూసినా అలాగే) నానోరు ముయ్యకండి. మిమ్మల్నిబట్టే నేనూను. మీరు దెబ్బలాడకండి. నేనూ బుద్ధిగానే ఉంటా.

అ: అబ్బ. నోరుమూసినా పోట్లాడుతున్నావూ. .చేత్తోకాగు ముయ్యడం. ఉండు (లేచి ముద్దుపెట్టుకోబోతాడు)

(అంతలో తలుపుకొడుతూ 'రామం' అంటూ శంకరం గొంతు).

అ: (ఆగి) అరే. చూడు. అప్పుడే శంకరం వాళ్ళూ వచ్చేశారు. త్వరగా రెడీఅవు లే.

ఆ: ఏమిటే? నిజంగా నేనా? మరింతసేపూ చెప్పలేదేమండీ. ఇప్పటికిప్పుడు రమ్మంటే ఎలాగా?

అ: నువ్వు చెప్పనిస్తేనా? ఏం వంట కాలేదూ?

ఆ. వంటకేముందిలెండి. ఇంకా నేనే... ఐనా లేడికి లేచిందే ప్రయాణమన్నట్లు... ముందు అనుకోవడమూ, ఏదీలేదు. ఆఫీసు నుండి వస్తారూ, దెబ్బలాట మొదలుపెడతారు...

ఆ: దెబ్బలాడుకోకపోతే ఇంకేం దాంపత్యమే! దెబ్బలాడుకొంటూ, మళ్ళీ కలుసుకొంటూఉంటేనే మజా. తయారవుపో... ఐనా సినిమా అంటే నీవు రెండునిముషాల్లో తయారవవూ.

(మళ్లీ తలుపుకొట్టిన శబ్దం.)

ఆ: సరేలెండి మీతో వాదిస్తూ కూర్చోడానికి టైములేదు కాని, తలుపుతీసి వాళ్ళని కూర్చోబెట్టండి. ఐదునిముషాల్లో వచ్చేస్తాను. (అంటూ ఆమె లోపలికీ,అతడు తలుపుతీయుడానికీ వెడతారు.) ★

★ ఏడుకొండలవాడా! ★

(27వ పేజీ తరువాయి)

"ఎందుకే అట్లా చూస్తున్నావ్?" అన్నాడు దూకుడుగా.

ఆదెమ్మగొంతు చిన్నగా వొణికింది.

"అబ్బాయి..."

"ఏం అబ్బాయికి?...

"జ్వరం, వొళ్లంతా గొడ్డలితో పేళ్ళు పగలగొట్టినట్టుగా వుందంట....".

జగపతి గుండె గాలికి ఎండినఆకు కొట్టుకున్నట్టుగా కొట్టుకుంది. ఒక్కగానొక్క కొడుకుమీద అతని కెంతో ప్రేమ, అభిమానం. వంశోద్ధారకుడు. ఇంటిదీపము, అన్నీ ఆ ఒక్క కొడుకే. వాడుతుమ్మినా, దగ్గినా కళ్ళల్లో నలకపడి కన్నీరు కార్చినా-ఆ దంపతులు తల్లడిల్లి పోతారు.

జగపతి మంచంపట్టెమీద కూర్చుని కొడుకు ముఖంలోకి చూశాడు. ఆదెమ్మ కోడిగుడ్డులాంతరువత్తి పెద్దది చేసింది.

మంచంలో పిల్లవాడు దయ్యంపట్టినట్టు ఎగిరెగిరిపడుతున్నాడు. జగపతికి గాబరా వేసింది. ఆదెమ్మకు అంతులేని భయం కలిగింది. పిల్లవాడి కెప్పుడూ అంత పెట్టున రోగం రాలేదు.

"ఆచార్లు చూశాడా!"

"ఆ! జ్వరం నూటమూడున్నదట."

"నూటమూడే!" జగపతి గుండెలో అధైర్యం ఎందుకో తలఎత్తింది.

"అమ్మో.. అమ్మో...నొప్పి! నొప్పి! పిల్లవాడి ఏడ్పు.

పిల్లవాడి శరీరమంతా నిమిరాడు జగపతి చెమ్మనిండిన కళ్ళతో. ఆదెమ్మ కన్నీళ్ళు పింపలుదిగాయి.

ఆ రాత్రి దంపతులిద్దరూ భోజనాలు చేయలేదు. నిద్రపోలేదు. పిల్లవాడికి జ్వరమూ, నొప్పులూకూడ వెనుకొడలేదు.

మరునాడు ఉదయం ఆచార్లు వొచ్చాడు. జ్వరం చూశాడు — నూట నాలుగున్నర ఉంది. కనుబొమలు ఎగురవేశాడు. పిల్లవాడు పిచ్చిధోరణిలో పడ్డాడు. ఆయుర్వేదంలో అందెవేసిన చెయ్యి ఆచార్లుది; కాని ఆ రోగం అంతుపట్టలేదు.

"ఏం ఆచార్లుగారూ! పిల్లవాడి పరిస్థితి అర్థం కావటంలేదు. ఏమంటారు? తగ్గుతుందంటారా!" అన్నాడు జగపతి గాద్గదిక స్వరంతో.

ఆచార్లు పెదాలు తడిచేసుకున్నాడు.

"ఉన్నమాట చెబుతున్నా. ఇంత దూకుడుగా వొచ్చిన రోగాన్ని నేను యింతవరకు చూడలేదు. మంచి మందులే ఇచ్చాను. ఆపైన ఏడుకొండలవాడిదయ".

ఆ మాటలు ఆదెమ్మ విన్నది.

ఆమె కళ్ళముందు ఏడుకొండలవాడి రూపు మెదిలింది. పడమటింట్లోకి పరుగెత్తింది. తిరుపతి వెంకటేశ్వరస్వామి చిత్రపటం ముందు సాష్టాంగపడింది.

"స్వామీ! మామీద దయలేదా! పిల్లవాడి కేమిటీ విపరీతం? ఒక్కగానొక్క కొడుకు కంటికి రెప్పలాంటివాడు. ఇంటికి దీపం. వంశానికి వెలుగు. మా ప్రాణాలన్నీ వాడే. వాడు లేకపోతే మా బ్రతుకు లే బూడిద. దయచూపు స్వామీ! నా ముద్దుల కొడుకు యీ గండం గడిచి బయటపడితే, ఈ రోగం నయమై బట్టకడితే—ఏడువాళ్ళు జోగి తిరిగి వాడి తలవెంట్రుకలు తమకు సమర్పించి, కానుకలు ముట్టజెపుతాను. ఏడుకొండలవాడా! వేంకటారమణా! ఈ దీనురాలి కోర్కె ఆలకించి, పిల్లవాడి జబ్బు యిట్టే మాయంచేయి ప్రభూ! నీ మొక్కు తీరుస్తాను."

ఆదెమ్మ గుండె ఆవేదననుంచి వెలువడ్డ ఆ మాటలూ, ప్రార్థనా, మొక్కుబడీ జగపతి విన్నాడు. 'మంత్రాలకూ, మొక్కుబడులకూ—రోగాలు నయమౌతాయా' అనుకున్నాడు. మూఢనమ్మకాలను బయట వేసుకోవడమే కానీ— ఆంజనేయస్వామి ఆంచన కడితేనూ, ఏడుకొండలవాడికి మొక్కుకుంటేనూ, దేవీ పూజా ఫలితంవల్లనూ ఎక్కడేనా జ్వరాలు నయమౌతాయా అనే ఉద్దేశ్యం గలవారి వర్గానికి చెందినవాడైనా, అట్లాంటి ఆచారాలకు సంపూర్ణంగా అసమ్మతిని తెలియజేసే వాడైనా జగపతి—కొడుకు పరిస్థితీ, వాడి బ్రతుకుమీదగల అధైర్యమూ, అపనమ్మకమూ గమనించాక భార్య మొక్కుబడిని విని పైకి ఏమీ అనలేకపోయాడు. నమ్మకాలనూ, పూర్వాచారాలనూ విపరీతంగా ద్వేషించేవాళ్ళే — ఒక్కొక్కప్పుడు, గుండెలో అధైర్యం జొరబడినప్పుడూ, చిక్కుబడిన దారపుబంతిలాంటి కష్టాలకు మనస్సు పరిష్కారమార్గాన్ని వెతుకలేనప్పుడూ, జీవితం ముందుకుసాగదనే అపనమ్మకం ఏర్పడ్డప్పుడూ—కొంతమంది మూఢనమ్మకాలమీద విశ్వాసాన్ని కుదుర్చుకుంటారు, పూర్వాచారాల్ని ఆచరిస్తారు. జగపతి ఎంతగుర్మార్గుడూ దొంగా, వ్యభిచారీ, దేవుడంటే భయమూ, భక్తి లేనివాడైనా, అతనిగుండె ఎంత రాయిలాంటిదైనా, అతని నిశ్చయం ఎంత గాఢమైనదైనా—అతనికి ఒక్కగానొక్క కొడుకుమీదగల ప్రేమా, అభిమానమూ, మమతా అతన్ని కట్టిపడవేశాయి. అజ్ఞాతంగా అతనిలో దేవునిమీద ఒరకమైన భక్తిని ప్రేరేపించాయి. అప్రయత్నంగా అతని రెండుచేతులూ వెంకటేశ్వరుని చిత్రపటానికి నమస్కరించాయి.

ఆనాటి సాయంత్రానికి కుర్రవాని జ్వరం కొంచెం తగ్గుముఖం పట్టింది. మంచంమీద ఎగిరెగిరి పడటాలు తగ్గాయి.

ఆదెమ్మ ఏడుకొండలవాడికి నమస్కరించి—మ్రొక్కిన మొక్కును జ్ఞాపకం చేసుకుంది. ఆరాత్రి గడవగానే—కుర్రవాడిలో జ్వరం చప్పగా జారిపోయింది. 'ఇదంతా ఆ ఏడుకొండలవాడి మహిమే!' అనుకున్నాడు జగపతి. 'సందేహమా! తిరుపతి దేవునకు నామీద, నా ముద్దుల కొడుకుమీద కరుణకలిగింది ఆ దివ్యమూర్తి కటాక్షంవల్ల నే కుర్రవానికి గండంగడిచింది' అనుకుంది ఆదెమ్మ.

'ఆయుర్వేదంలో అరితేరినవాడ్ని అంతా నామందు ప్రభావమే. నిన్న ఉదయం వాడిన వజ్రపు తునకల్లాంటి మాత్రలతో పిల్లవాడు మృత్యుముఖంనుండి బయట పడ్డాడు' అన్నాడు ఆయుర్వేద వైద్యశిఖామణి ఆచార్లుగారు.

'ఏమైతేం పిల్లవాడు బ్రతికి బయటపడ్డాడు. అదేచాలు!' అనుకున్నాడు జగపతి.

తర్వాత మూడురోజులకే ఆదెమ్మకొడుకు చిందు వేస్తూ తిరిగాడు. (మిగతా వచ్చేవారం)

సినిమా

బహుమతి ప్రదానం


ఆంధ్రప్రదేశ్ ప్రేక్షక సంఘ సభలు రాజమహేంద్రవరంలోని వీరేశలింగా స్తికోన్నత పాఠశాలావరణలో గతవారం జరిగాయి. మద్రాసు ప్రధాన న్యాయమూర్తి రాజమన్నారుగారి అధ్యక్షత జరిగిన ఆ సభలో, 1958వ సంవత్సరానికి ప్రేక్షకుల బాలెట్‌లో ఎన్నిక అయిన చలనచిత్ర కళాకారులకు బహుమతులిచ్చి గౌరవించారు.

సభకు నాగేశ్వరరావు, రేలంగి, రమణమూర్తి, అల్లు రామలింగయ్య, అంజలీదేవి, ఆదినారాయణరావు, అశ్వత్థ నారాయణ (శ్రీ ప్రొడక్షన్స్) వచ్చారు. కె. వి. రెడ్డి, రాజసులోచన, మాస్టర్ బాబ్జీ రాలేక పోయినందువల్ల, సముద్రాల, అంజలీదేవి, రేలంగి వారి బహుమతులను అందుకున్నారు.

రాజమన్నారుగారు, చలనచిత్రకళావికాసంలో ప్రేక్షకుల భూమికను వివరించి, అసభ్యమైన ధోరణిలో కేవలం డబ్బుకోసం తీసే చిత్రాలను నివారించ గలిగినవారిలో ముఖ్యులు చూసేవారేనన్నారు. అటువంటి చిత్రాలను నిరసించి ఆ తరహా తత్వాలను ఖండించడంలో ప్రేక్షక సంఘాలు ప్రముఖ భూమిక నిర్వహించాలన్నారు.

సముద్రాల రాఘవాచార్యులు గారుమాట్లాడుతూ 18 ఏళ్ళ క్రితం ఆంధ్రపత్రిక తొలిసారి బాలెట్ నిర్వహించిందనీ, ఇటువంటి కార్యక్రమము ఆంధ్రప్రదేశ్‌లో జరిగితే బాగుంటుందని తామనుకుంటూ వచ్చారనీ, ఆంధ్రలో సినీ ప్రేక్షక సంఘాలు చాలా వున్నా ఇంత పెద్ద ఎత్తున ఒక ప్రేక్షక సంఘం బాలెట్ నిర్వహించడం ఇదే ప్రథమమనీ అంటూ, కార్యకర్తలను అభినందించారు.

అక్కినేని నాగేశ్వరరావు ప్రసంగిస్తూ నాలుగుకోట్ల జనాభా గల ఆంధ్రప్రదేశ్‌లో 30 వేలమంది ప్రేక్షకులు పాల్గొన్న ఈ ఎన్నికలో విజయం అంత గొప్పది కాకపోవచ్చును గాని, ఈ కొద్దిమంది ప్రజల అభిప్రాయాన్ని మన్నించి తామంతా ఈ సభలో పాల్గొనడం జరుగుతున్నదని అన్నారు. పండితుల ఆమోదాన్నీ పామరుల ఆదరణను సంపాదించుకొన్నదే కళ అనీ, మున్ముందు ఇటువంటి ఎన్నికలు జరిగినపుడు విమర్శలకు అతీతమైన రీతిన నిర్వహించ బడగలవని ఆశిస్తున్నామనీ అన్నారు. రేలంగి, అంజలీదేవి, రమణమూర్తి, రామలింగయ్య, అశ్వత్థనారాయణ సన్మానానికి తగురీతిన సమాధానం



పొన్నలూరి బ్రదర్స్ వారి "దైవబలం"లో జయశ్రీ.

చెప్పి కృతజ్ఞత తెలిపారు. సభ ఆరంభంలో ఆహ్వాన సంఘాధ్యక్షుడు పోతుల వీరభద్రరావు స్వాగతం చెప్పారు. కార్యదర్శి యాపంరెడ్డి వెంకటరావు వందన సమర్పణ చేశారు.

* * *

స్వస్తిశ్రీ, అండ్ విజయవారి జానపదం 'రేచుక్క — పగటిచుక్క' నిర్మాణం పూర్తి కావచ్చింది. మే నెలలో విడుదల కాగలదని తెలుస్తూంది. రామారావు, రంగారావు, రేలంగి, నాగయ్య, సి. ఎస్. ఆర్. రాజనాల ఆర్. నాగేశ్వరరావు, జానకి, గిరిజ, కన్నాంబ మొదలగువారు పాల్గొంటున్నారు. రచయిత సముద్రాల జూనియర్. సంగీతం టి. వి. రాజు, దర్శకత్వం కె. కామేశ్వర రావు.

* * *

సినిమాపత్రిక కినీమా నిర్వహించిన పాఠకుల బాలట్‌లో, అనుపమావారి 'అత్తా ఒకింటి కోడలే' ఉత్తమచిత్రంగా ఎన్నిక అయింది. కె. వి. రెడ్డి ఉత్తమ దర్శకుడుగాను, సావిత్రి, ఎ. నాగేశ్వరరావు ఉత్తమ నటీనటులుగాను ఎన్నిక అయ్యారు.

ఉత్తమ హాస్యనటుడుగా రమణారెడ్డి, సహాయ నటీనటులుగా రాజసులోచన, జగ్గయ్య, ప్రతినాయకుడుగా ఆర్. నాగేశ్వరరావు, రచయితగా ఆత్రేయ, సంగీత దర్శకుడుగా సాలూరి రాజేశ్వరరావు, ఛాయాగ్రహణ దర్శకుడుగా కమల్ ఘోష్ ఎన్నిక అయ్యారు

* * *

ప్రభాకర్ పిక్చర్స్‌వారి హిందీచిత్రం 'మహారథి కర్ణ'ను ధనలక్ష్మి ప్రొడక్షన్స్‌వారు తెలుగులోకి, తమిళంలోకి అనువదిస్తున్నారు. ఈ కార్యక్రమానికి ఏప్రిల్ 11వ జయంతీ స్టుడియోలో శ్రీ కె. వి. రెడ్డి ప్రారంభోత్సవం జరిపారు. ఆరోజున రెండు పాటలు—ఘంటసాల, శ్రీనివాస్ పాడినవి రికార్డుచేశారు. తెలుగు చిత్రానికి మాటలు తాండ్ర(సతీతులసి)సుబ్రహ్మణ్యం, పాటలూ పద్యాలూ జాషువాకవి, జంధ్యాల పాపయ్యశాస్త్రి, అయ్యగారి, వేమూరి వ్రాస్తున్నారు. సంగీతదర్శకుడు డి. బాబురావు. ఈచిత్రంలో ముఖ్యపాత్రధారులు సాహు మోదక్, పృథ్వీరాజ్, కె. ఎన్. సింగ్, దుర్గాఖోటే, స్వర్ణలత, లీల. గాత్రధారులు రాజనాల, అమర్‌నాథ్, సి. ఎస్. ఆర్. నిర్మాత ఎస్. జె. గుప్త.

కల్యాణ్‌రావ్ అండ్ కంపెనీవారు నిర్మిస్తున్న 'మెడ్రాస్ బ్యూటీ' అనే డాక్యుమెంటరీ చిత్రనిర్మాణానికి మద్రాసు క్రైస్తవ కళాశాల ప్రిన్సిపాల్ కురువిల జాకబ్ ఉగాదినాడు ప్రారంభోత్సవం జరిపారు. ఈ చిత్రానికి ఛాయాగ్రహణం అజిత్ కుమార్, దర్శకత్వం ఎడిటింగ్ సి. పి. జంబులింగం, నిర్మాణం సురటి దుర్గారావు నిర్వహిస్తున్నారు. ★



విశ్వరూపావారి 'కూతురుకాపురం' లో రాజసులోచన.

జయవిజయ

అతి మోఘంగా బోలెడంత 'ఐ. క్యూ.' (తెలివి తేటలని తాత్పర్యం) లేనివాళ్లు కూడా, 'జయ విజయ' పేరు చూడగానే ఇందులో రెండు శాఖలు ఇమిడి ఉన్నాయని చటుకున పసిగడతారు; ఆపైనమాటకు, ఉన్నవారుకూడా కనుక్కోలేని విశేషాలు ఉండడమే 'జయ విజయ' లో విశేషం. మాటవరసకి, ఈ జయ విజయులు, గబగబా మూడు జన్మలు ఖరాయించి అడ్డదారిన హరిని చేరిన హరిద్వార పాలకులేనని పొరబడడం బహు సులభం. అలా పడిలేచాక, 'కాదు కాదు. జయసింహ, విజయసింహ అను ఇద్దరన్నదమ్ముల యుద్ధమ్ముల కథ' అనుకుని మళ్లీ తప్పులో కాలేయడం అతి సహజం. నిజానికిందులో ఉన్నవి, రెండు హీరో హీరోయిక్ (రకానికొక్క చొప్పున) శాఖలు. ఇలాగే ఇంకా, ఇందులో బాలనాగమ్మకథ, 'సౌవర్ణ సుందరీయా' లైన మాయా తివాచీ వగైరాలూ ఉన్నాయని కనుక్కోలేము. కథ అయిపోయాక, రాజనాల కాంతారావుతో కత్తియుద్ధం చేస్తాడని గాని తలిదండ్రులతో మాటసరసం ఆడతాడని గాని ఊహించలేము. ఎక్కడికక్కడ ఇలాటి 'సస్పెన్సు'తో సాగే ఈ చిత్రంలో కథగురించి మటుకు మనం ప్రాణాలుగ్గబట్టుకు కూర్చోనవసరం లేదు. తరువాత ఏం జరుగుతుందన్న దానిపై పెద్దఎత్తున పందాలు వేసుకోనక్కరలేదు.

అనగనగా ఒక రాజుని, ఒకరోజున ఇంకో రాజు (ఇద్దరిలో ఒకాయన సామంతుడు) భోజనానికి పిలిచి సామంతరాజ్యపు సెట్ మీద కుట్రచేసి, ఖర్చు రాయించేసి ఆయన రాజ్యాన్ని సొంతానికి 'జమ' చేయించుకుంటాడు. అపుడు మంచిరాజుకొడుకు పసివాడు. మంచిరాజభక్తులు వాడిని రక్షించి, అడవుల్లోకి పారిపోయి పెంచి కాంతారావుని చేస్తారు.

అందగాడైన ఆయువరాజు తిన్నగా వుండక ఒకరోజున శత్రురాజ కుమార్తెను చూసి ప్రేమించి మంచిమంచి ట్రాలీషాట్లలో ఫోటోజెనిక్ గా డ్యూయెట్లు పాడబోతాడు. అతన్ని పెంచినవాళ్ళు అది చూసి కూకలేసి, అతని జన్మకథ చెప్పి, ఫలానా పరిస్థితుల్లో తామంతా అతన్ని కోటదాటవేసి అడవులలో పెంచినవైనాన్ని ప్రకటిస్తారు. వాళ్ళవయసూ వాలకం చూడగా, ఇలా కోటదాటి వచ్చినవాటికి వాళ్ళంతా కూడా ఏడాది రెండేళ్ల వయస్సువారై వుండి వుండాలని మనలాగే యువరాజు విజయుడికీ అనిపించి వుండాలి. అందుకే అప్పటికది నమ్మినట్లు కనిపించినా నిజంగా గురి కుదరక జయమంగళకోసం బెంగ పెట్టుకునే వుంటాడు. అప్పుడీ కథకి ఏం చేయాలో తోచక సాగుదామా ఆగుదామా అనుకుంటూ వుండగా మాయలఫకీరు ప్రత్యక్షమై కథకి ధైర్యం చెప్పి కథానాయికను హడలగొట్టి ఎత్తుకపోయి బందీచేస్తాడు. హీరో విజయుడుకూడా అర్జెంటుగా వెళ్ళిపోయి అక్కడ బందీఅయిపోయి కృష్ణకుమారి 'సోలో'లువింటూ వుంటాడు.


సువర్ణసుందరిలో లాగే గుహలోపడి సాధువు దయవల్ల గడించిన మాయాతివాచీ, కమండలం, శంఖం వగైరాలతో ఏం చెయ్యాలో, అవెందుకు పనికొస్తాయో గట్టిగా తెలీక తికమకపడుతున్న బాలకృష్ణ బాధ్యత పెరుగుతుంది. హీరోపనులకి వడిగట్ట వలసి వస్తుంది. హీరోరోలు దాల్చి, శత్రురాజును ఖైదుచేసి, ఆపైన మాయాలఫకీరు గుహలో జొరబడి మాయశంఖాన్ని కొత్తమోటగావాడి ఫకీరుపళ్ళు రాలగొడతాడు. అక్కడితో మాయమాయమైపోయి, సెట్ ఇంకా ఊగి అల్లకల్లోలం అయిపోతుంది. అంతా ఊరికే ఉంటే బాగుండదని హీరో కాంతారావు ముక్కోమలతో చూడ్డతగ్గ యుద్ధంచేసి అతన్ని హతమార్చి, కథను కడచివరికి మళ్ళించచూస్తాడు. ఈలోగా రాజభక్తులు మిక్కిలినేని అండ్ కో వారు ఇతర రాజ్యాల నుండి అపారసేనా వాహినిని తెచ్చి దుష్టరాజు మీదకి దండెత్తడానికి కృషి చేశామంటారు గాని, విఠలాచారిగారు సిసిల్ డిమిల్ మతసుడు కానివాడు కావడం వల్ల, అప్పటికే ఫకీరు సెట్ మీద బోలెడు గలభా జరిగి ఉండడంవల్లా మళ్ళీ సైనిక జనాభా ఎందుకని, అంతవరకూ షాట్ ఫీల్డులో పశ్చాత్తాపంతో బోల్డు ఫీలయిపోతున్న రాజుగారు 'వాయనా వాహూతుర్నా చేసుకో' అనేస్తాడు.

బాలకృష్ణ మాయ తివాచీ ఎక్కి అందరూ రాజ్యానికి వెళ్లారనుకుంటే మీరు మళ్ళీ పొరపడగలరు. అవన్నీ మరో చిత్రానికి పనికిరాగల ప్రమాదం ఉంది.

రాజాగారూ, రాజకుమారి జయమంగళా తమ రాజ్యం వెళ్ళిపోతారు. విజయుడూ పెళ్లి బలగం అంతా వెనక బయల్దేరి రాజధానికి తరలి వెళ్ళేసరికూ, కోటలో ఉన్న దుర్జనుడు దుర్జయుడు (రాజనాల) ముక్కాయింపు కుట్రచేసి, తలిదండ్రులను ఖైదులో వేస్తాడు. దంపతులు కొట్టబట్టి వారిని ఒక్కగదిలో ఉంచాలని భయంకరమైన తెలుగు మాట్లాడుతాడు. అంత మాట అన్నందుకు శిక్షగా ఆ తరువాత విజయుడు కాంతారావుతో చేసిన ద్వంద్వ యుద్ధంలో ఎంత బాగా పోట్లాడినా చివరికి చచ్చిపోతాడు. అప్పటికే రీలాతీతం కావడంతో కథ ముగిసింది.

దర్శకుడు విఠలాచార్యగారు, తాపీగా సిమితంగా నికార్సయిన జానపద పథంలో చూపించిన ఈ కథలో నటన 'హైకీ'లో, పైస్థాయిలో సాగింది. మాటలూ అంతే. తెలుగురానివాళ్లు (మనకి రాని తెలుగుకూడా కొంత ఉంది) కథ కమామీషూ సులభంగా తెలుసుకుందికి నటన ఉపయోగపడింది. ఇది సాధించడంకోసం, ఇంతకన్న తక్కువ నటించే సామర్థ్యం ఉన్న కాంతారావు, రాజనాల, మిక్కిలినేనికూడా ఇందుకే కృషిచేశారు. బాలకృష్ణ అభిమానులందరికీ, ఇందులో అతడు చాలాసేపు కనిపిస్తాడన్నవార్త ఆశలు రేకెత్తించినా, అతని నటన చాలవరకు సంతోషపెట్టి, ఆపైన, కథ బలీయంగదా అనిపింపచేస్తుంది. అల్లు రామలింగయ్య ప్రేమలో పడడం ఒకటి ఆహ్లాదకరంగా ఉంది.

మొత్తానికి, బాగా నలిగిన జానపదపథాల షికారు తీసుకువెళ్తుంది ఈ చిత్రం. దారిలో అందమైన ప్రకృతి దృశ్యాలు కనిపిస్తాయి. హాయిగొలిపే పాటలు వినిపిస్తాయి. ★



'బాలనాగమ్మ'లో మాయలఫకీరుగా రంగారావు.



ప్రసాద్ ఆర్ట్ పిక్చర్స్ వారి "ఇల్లరికం" లో నాగేశ్వరరావు, జమున.

సంగీత వార్తావరణం

అమెరికన్ మోషన్ పిక్చర్ అకాడమీ వారు, 1958 లో ఉత్తమ సంగీత దర్శకుడుగా డిమిత్రీటియోంకిన్‌ను ఎన్నిక చేసి బహుమతి నిచ్చారు. హెమెంగ్‌వే నవల 'ఓల్డ్ మాన్ అండ్ ది సీ' చలనచిత్రానువాదానికి టియోంకిన్ సంగీత వ్యాఖ్య ఈ బహుమతిని సంపాదించిపెట్టింది. తర్‌నూన్, హైనూన్ చిత్రాలకు కూర్చిన సంగీతానికి కూడా టియోంకిన్ లోగడ అస్కార్‌లు అందుకున్నాడు. తర్డ్‌మాన్ చిత్రం అంతటికీ ఈయన ఒకేఒక వాద్యంతో-గిటార్-ఒళ్లు ఝల్లుమనిపించే సంగీతం సమకూర్చారు. 'హైనూన్' లో నేపథ్య సంగీతం, బ్లోయింగ్ వైల్డ్‌లో గేయంకూడా బహూధా ప్రశంసలందుకొన్నాయి. తోటి వారికి వరవడిపెట్టాయనిపించుకొన్నాయి.

* * *

లైమ్‌లైట్ చిత్రంలో చాప్లిన్ వినిపించిన ఇతివృత్త సంగీతవృత్తం, 'కోలంబైన్ బాలే సంగీతం, ఉత్తమశ్రేణి 'కృతు'లనతగునని సంగీతప్రియులు ప్రశంసించారు. అన్ని చిత్రాలలాగే, లైమ్‌లైట్‌కూ చాప్లినే సంగీతం రచించారు. ఇంగులో కృతికి "ఇటర్నలీ-' అని పేరు. ఇది ఏడేళ్ళనాడు రికార్డుగా, అమ్మకంలో కొత్త రికార్డులు నెలకొల్పింది. ఈనాటికి పాతబడి, పూర్వం అంతగా ప్రతిచోటా వినబడకపోతే, వినదలచుకున్నవారు-ఊళ్లో 'లైమ్ లైట్' ఆడుతున్న సినిమాకు వెళ్లవచ్చు. అది మరీ దగ్గర అనుకుంటే, విమానం ఎక్కి స్విట్‌జర్‌లాండ్‌లో చాప్లిన్ ఇంటికి వెళ్లవచ్చు. ఊనా (ఓనీల్) చాప్లిన్ ఎప్పుడూ చాప్లిన్ రికార్డు ఏదో ఒకటిపెట్టి ఉంచుతుంది. ఆ యింట్లో ప్రశాంతతకు ఉపశ్రుతిగా ఈ సంగీతం వినిపిస్తూఉంటుందిట.

* * *

'సినిమా సంగీతం' అందరికీ అభిమానపాత్రమైనదనుకోవడం పొరబాటు అని కేంద్రమంత్రి డా॥ బి. వి. కేస్కర్ మొన్న లోక్‌సభలో మాట్లాడుతూ అన్నారు. హిందీభాషా ప్రాంతాలలో యువజనులకే ఫిలిం సంగీతంమీద మోజు హెచ్చని ఆయన అభిప్రాయపడ్డారు.

తమిళులూ, బెంగాలీలూ దీన్ని అసలు పట్టించుకోరని కూడా ఆయన చెప్పారు. ఆలిండియా రేడియో, సినిమా సంగీతంపైన లలిత సంగీతంపైన కత్తికట్టిందన్న ఆరోపణలను డా॥ కేస్కర్ ఖండించారు.

జానపద సంగీతాన్ని సినీమా ఆదరిస్తే ప్రజాబాహుళ్యాన్ని రంజింపచేసే సంగీతం వస్తుందని ఆయన సూచించారు. ★

చాప్లిన్ పుట్టిన రోజు కానుక

కోట్లాది ప్రజలను ఆనందపరవశుల్ని చేయవలసి ఉన్న చార్లీచాప్లిన్, 70 వసంతాల క్రితం ఒకానొక ఏప్రిల్ 16 న జన్మించాడు. సినీమా పుటకల తరువాత కొద్దికాలంలోనే తన కార్యక్రమం ఆరంభించిన చాప్లిన్, హాస్యప్రియులకు వరసగా కానుకలు కురిపించాడు. అవన్నీ అందరూ మనసులో అపురూపంగా దాచుకునే కానుకలు. ఈసారి 70 వ పుట్టిన రోజునాడు చాప్లిన్ కొత్త కానుకను ఇవ్వదలచినట్లు ప్రకటించాడు.—ఆ కానుక పేరు 'చార్లీ'. 1936 లో 'మాడరన్ టైమ్స్' చిత్రంతో బుట్ట పంట్లాం చేతికర్ర డొక్కు టోపీ ధరించి అందరి మనసులలోనూ విహరించే కొండంత 'చిన్న మనిషి' చార్లీని, చాప్లిన్ ఉపసంహరించాడని అందరికీ తెలుసు. తరువాతి చిత్రాలు—గ్రేట్ డిక్టేటర్, వర్డో, లైమ్ లైట్, కింగ్ ఇన్ న్యూయార్క్‌లలో ఈ మనిషి లేడు.

"అలా చేయడం-అతన్ని చంపబోవడం పొరబాటే. ఆ సామాన్యుడికి ఈ అణుయుగంలో కూడా చోటు ఉంది" అంటూ, చార్లీ పాత్రతో తిరిగి ఒక హాస్యప్రధాన చిత్రం మొదలచినట్లుచాప్లిన్ ప్రకటించాడు.

దృశ్యప్రధానమైన చలనచిత్రకళకు శబ్దమే శాపం కాగలదన్న ఊహను ఒకపుడు వెలిబుచ్చిన చాప్లిన్, ఇపుడు ఈ చిత్రాన్ని రంగులలో, సకల 'హంగు'లతో తీయబోతున్నాడు. శబ్దాన్ని ఎంత సమర్థంగా, ఎంత సార్థకంగా వాడుకున్నాడో ఈసారి రంగులను కూడా అంత గొప్పగాను ఆయన ఉపయోగించగలడని, చలనచిత్ర కళపట్ల చాప్లిన్‌కుగల గురిపట్ల గురిగల వారంతా నమ్ముతున్నారు.

*   *   *

పుట్టిన రోజునాడు డెయిలీ హెరాల్డ్ పత్రికా విలేఖరితో జరిపిన గోష్ఠిలో గుర్తుంచుకో తగ్గ భలోక్తి ఒకటి ఉంది. అణ్వస్త్రాల గురించి మాట్లాడుతూ "అవి మనని సంహరించే లోగా మనమే వాటిని ఉపసంహరించి పారేద్దాం" అన్నాడాయన ★



మద్రాసులో బడిపిల్లల మధ్యాహ్న భోజనాలకై మేయరు పేరిట గల నిధికి ప్రసిద్ధ తమిళ నటుడు శివాజీగణేశన్ ఇచ్చిన లక్షరూపాయల విరాళాన్ని, గత వారం ప్రధాని నెహ్రూ గిండీ రాజ్ భవన్‌లో మేయరుకు అందచేసి, గణేశన్‌ను అభినందించారు. ఇతరరాష్ట్రాలలోకూడా ఈ పద్ధతి అనుసరిస్తే బాగుంటుందఆయనఅన్నారు. ఈ చిత్రంలో, చెక్కును ఉంచినరజిత పేటికను పరిశీలిస్తున్న నెహ్రూ, ఆయన కుడివైపున శివాజీగణేశన్, మేయరు కమలకణ్ణన్, డిప్యూటీ మేయరు తిరువెంగడం. ప్రధానికి ఎడమవేపున మద్రాసు ఆర్థికమంత్రి సి. సుబ్రహ్మణ్యం, ముఖ్యమంత్రి కామరాజ్.

★ ఖైదీ నెం. 911 ★

అనేక విధాల మెచ్చుకోతగిన సూపర్ పిక్చర్స్‌వారి "ఖైదీ నెం. 911" గత వారం బొంబాయి, సూపర్ సినిమాలో విడుదల అయింది. ముఖ్యంగా చెప్పుకో వలసినవి మూడుఅంశాలు ఈ మూడూ ఏ చిత్రం బాగుండాలన్న ముఖ్యంగా బాగుండాల్సినవే.

మొదటిది కథ. మాజిజర్నలిస్టు సి. జె. (ఫరిస్తా) పావ్రీ దీనికి కథరాశారు. బి.ఆర్. చోప్రా కొత్తచిత్రం కానూన్‌కుకూడా ఈయనే రచయిత. రెండవ అంశం ముఖ్యపాత్రధారుల నటన. షేక్ ముఖ్తర్ భారీ విగ్రహమూ, అంత ఎత్తునా అంతరించిగానూ ఉన్న ఆయన నటనా ఇంగులో ఖైదీ బిర్జూను ఉత్తమశ్రేణిపాత్రలలో నిలిపాయి. బిర్జూ జైలుకు తరచువచ్చిపోతు ఉండే ఖాతాదారే. అయినా అతని మనసు వెన్నలాటిది. అటు నేరాలు చేసేవాడి ధోరణిని పోకడలను చూపుతు ఇటు అటువంటివాడిలో ప్రేమను మంచితనాన్ని సమ్మతిగినవిధంగా నిరూపణ చేయడం చాలా కష్టమైన పని. ముక్తర్ ఈ కార్యాన్ని ప్రశంసనీయంగా సాధించాడు. అతని ప్రతిద్వంద్విగా నటించిన హీరాలాల్ కూడా అన్నివిధాలా ముఖర్‌కు దీటయిన వాడుగా నిలబడగలిగాడు వాళ్ళిద్దరు పాల్గొన్న సన్నివేశాలలో ఎవరు గొప్పగా నటించారన్నది నిర్ధారణ చేయలేమనిపిస్తుంది.

ఖైదీబిర్జూకు ఉన్న ఒక్కగా నొక్క బిడ్డ చనిపోవడంలో అతడు జైలు సూపరింటెండెంటు కొడుకుమీద పంచప్రాణాలు పెట్టుకు బతుకుతూ ఉంటాడు. ఆవేళకి కొందరు సినీదుష్టులు ఆ పిల్లడిని ఎత్తుకుపోతారు. తను వెళ్ళి వెతుకుతానంటాడు బిర్జూ. కాని సూపరింటెండెంటుఅధికారిగా అతన్ని వదిలిపెట్టడానికి ఒప్పుకోడు. చివరికి బిర్జూ ఖైదులోంచి తప్పించు పారిపోయి పిల్లణ్ణి వెతికి పట్టుకుని తిరిగి వస్తాడు. పారిపోయిన నేరానికి తిరిగి బోను ఎక్కవలసి వస్తుంది. ఈ చిత్రం పతాక సన్నివేశాలలో ఈ విచిత్ర పరిస్థితిని దర్శకుడు ఆస్పి హృదయాన్ని కదలించే విధంగా చిత్రించాడు.

ఈకథను చూసి, అంతా ఇంతేనని 'ప్రేమాయణా'భిమానులు పొరపడనక్కరలేదు సినిమాకథ అన్నాక ఈనాడు అన్నీ ఉండడం మామూలే కాబట్టి ప్రేమకథా యథాప్రకారం ఉంది. అందులో చిలకా గోరింకలు నందా, మహమూద్‌లు. ఇద్దరూ హుషారుగా నటించారు.

ఇతర నటులు గజానన్ జాగీర్దార్, హీరాలాల్ మినూముంతాజ్, హనీ ఇరానీ.

ఈచిత్రంలో బాగున్న మూడవ అంశం దత్తారాం సంగీతం. మధురమైన పాటలు వినిపించాడాయన. రెండు పాటలు చాల రోజులు మనసులో మెదుల్తునే ఉంటాయి. ఈచిత్రం ఇంకా బాగా ఉండి ఉంటే, సంగీతం మరింత రాణించేదనిపించింది. మొత్తంమీద ఒక చిత్రం మూడందాల బాగుండడం గొప్ప విషయమే. మన చిత్రాల ప్రమాణాలను తీరు తెన్నులనూ బట్టి చూస్తే 'మూడు' అనేది చాలా పెద్ద సంఖ్య.

—టచ్‌స్టోన్.

చిత్ర లేఖలు

ఆర్యా,

"బాక్సాఫీసుకూ, బహుమతు (అవార్డ్) లకూ కలయిక అసంభవము" అని వాదించే వారితో ప్రతివాదించే వారిలో నేను కొందర్ని. కాని ఇప్పుడు ఈ విషయాలలో ఇదమిత్థంగా చెప్పేందుకి వీల్లేకుండా ఉంది. దెబ్బతిన్న చిత్రానికే బహుమతి వస్తుందన్న కొండ గుర్తులు చెరిగిపోతున్నాయి. రంగులు మార్చడం కష్టంగా ఉంది.

మొదట గుమ్మెత్తిపోసిన చిత్రానికి బహుమతి వచ్చేసరికి, 'అరెరె ఇది పసిగడితే, దీన్ని ముందే మెచ్చుకున్న ఘనత మనకే దక్కించుకునే వాళ్ళంసుమీ' అని కొందరు కళాభిమానులు వాపోయి నాలిక్కరుచుకుంటున్నారు. మొత్తం మీద అందరికీ ప్రాణం ఖంగారుగా ఉంది. ఏది కళాఖండమో ఏటేటా ఏప్రిల్ నెలాఖరుదాకా పసిగట్టలేక పోతున్నారు.

అంగువల్ల ఇటుపైన నిర్మాతలు కొస్త ముందస్తుగానే 'ఇది బహుమతి నంగుకోనగల కళాఖండమూ, (బాక్సాఫీసు విజయానికి అపశకునమే అనుకోండి) అని క్లూ ఇచ్చి సాయపడాలి. ఉత్తరాదిన అప్పుడే కొందరు అలా చేస్తున్నారు; నామటుకు నేను అలాగే చేస్తాను.

వచ్చే యేడాది అవార్డు విన్నర్.
(సి. హెచ్: కామేశ్వరరావు,
విశాపట్నం)

* * *

ఆర్యా,

ముడిఫిలిం కటకట ధర్మమా అని, 1957 జూన్ తరవాత వచ్చిన చిత్రాలనే డబ్ చేయాలని శాసనం వేసి చిత్రాల దిగుమతికి ఒక విధంగా పరిమితి పెట్టారు. ఇక, స్ట్రెయిట్ గా తీసి, దేశాన్ని మరమ్మత్తుచేసి, సంఘాన్ని అరంగుళం ఉద్ధరించే చిత్రాలకు ఇరుగుపొరుగు భాషా చిత్రాల కథలను తీసుకునే టప్పుడు కూడా ఫలానా తారీఖు తరవాత వచ్చిన కథలు కాపీ చేస్తేనే కోటాయిస్తాము. అని భయం చెబితే, కొంత కాలానికైనా తెలుగులో ఒరిజనల్ కథలు పుట్టొచ్చేమోనని కొందరు గుష్టులు ప్రచారం చేస్తున్నారట. టమిల్‌లో హిట్టయిన పిచ్చర్‌ల స్టోరీల సంగతి వీళ్ళకేం తెలుసు!

—కాపీ రైటర్.



సముద్రాల రాఘవాచార్యులు

"ఏదీ చూదాం, వైన్ అండ్ వుమన్‌కు తెలుగు చెప్పండి కవిగారూ."


తములపాకు ఈనెతీయడం మొదలుపెట్టిన కవిగారు ఆ పని సాంతం ముగించి, తల పైకెత్తి "ఏముందీ మదిరా, మదవతీను" అంటూ ఆకుచిలక చుట్టి నోట్లో వేసుకున్నారు.

కష్టావధానానికి మారుపేరైన సినీరచనా వ్యాసంగరంలో పాతికేళ్ళుగా పోరాడి పాడి నెగ్గుకొస్తున్న శతావధాని సముద్రాల రాఘవాచార్యులుగారి ప్రజ్ఞా ప్రాభవాలకు, పైన పెద్దక్షరాలలో అచ్చుపడిన మాటలాట మచ్చుతునక అని ఈ వాక్యకారుడి తాత్పర్యం కాదుగాని సినిమాలో రచయితకు ఉండవలసిన వెయ్యొక్క హంగులలో ముఖ్యమైనది సమయస్ఫూర్తి అనీ, ఇది సముద్రాల సీనియర్‌లో సమృద్ధిగా ఉందనీ అది చెబుతుంది.

సముద్రాలది కవికులం.

"మా తాత కవిత్వం చెప్పాడు. మా నాన్న చెప్పాడు. నాదాకా వచ్చేవరకు, 'నాయనా, ఈ కవిత్వాలు అన్నం పెట్టే రోజులు అయిపోవచ్చాయి. నువ్వు దీని జోలికి పోవద్దు' అన్నాడు మా నాయన" అంటారు ఆయన.

సముద్రాల కవిత్వం జోలికి పోవడానికి గల కారణాలలో ఇదొకటి కావచ్చు. ఒక తెలుగుపండితుడి బలవంతం వల్ల, పధ్నాలుగోయేట ఒక పెద్దమనిషిమీదపద్యం చెప్పిన రాఘవాచార్యులు, ఆయేడాదే తోడి కుర్రాళ్ళు పురికొల్పి మేష్టరుగారు ప్రోత్సహిస్తే, యతిప్రాసల గణగణాల గురించిన బెంగ లేకుండా వందపద్యాలు గుణించి ఏవి ఎవరెవరివో గుర్తుంచుకు శతావధానం చేశారు. ఆ తరవాత చాలా యేళ్ళపాటు (1932 దాకా) ఇలా సరదాగా అవధానాలు చేశారు. ఈ అవధాన సాధనే, తరువాత తరువాత జీవితంలో శతావధానాలు చేయడానికి రూపాంతరం ధరించి దోహదం చేసిందనిపిస్తుంది. ఇలా గ్రాంథిక భాషలో పుట్టి పెరిగిన సము



విశ్వరూపావారి 'కూతురుకాపురం' లో రాజసులోచన, జగ్గయ్య.

సముద్రాల రాఘవాచార్యులు

ద్రాలకు చిన్నవాడు తండ్రిగారు చెప్పిన మాట మళ్ళీ ఒకమంచిరోజున గుర్తుకొచ్చింది. రచనా వ్యాసంగానికి ఇక 'గ్రాంధికం' తగదన్న వాదం బాగా నిలబడి బలపడుతున్న ఆ రోజులలో 'నేటి గ్రాంధికభాష' వ్యావహారికమేనని ఈయనా ఒక కేక వేసి చెన్నపట్నం వచ్చారు. తరువాతి ఆశ్రమంలో సముద్రాల జర్నలిస్టు 'ప్రజామిత్ర' బృందంలో ఒకరుగా ఉత్సాహంగా పనిచేస్తు ఉండగా, సినిమావాళ్లతో పోట్లాడుదు గాని రమ్మని రామబ్రహ్మంగారు బలవంతాన తీసికెళ్ళి 'కనకతార' లో రచయితగా కుదిర్చారు. (రుసుము రు 250. ఆనాటి స్టార్ రైటర్ తాపీ ధర్మారావుగారి రేటు రు. 400.) ఒక సెట్టుకు గ్రంథికం వ్రాసి, ఎదురుతిరిగారు సముద్రాల. రెండో చిత్రం 'గృహలక్ష్మి'కి రాసే నాటికి స్థిరపడ్డారు. 'Yon can not go' అని మొదట ఇంగ్లీషులో పుట్టే డైలాగుకు లెక్క ప్రకారం నాలుగు తెలుగు మాటలూ కవిగాడు రాసి తీరాలనే రోజులు అవి. "'వెళ్లానికి వీల్లేదు" అన్న ఒక్క ముక్క కన్న రాయడానికి వీల్లేదు" అని యువకుడు సముద్రాల పోరాడిన రోజులు అవి.

ఈ పోరాటం, రూపాంతరంలో ఈనాటికీ ఉంది. సినిమాలో సాధారణంగా ఎవరికేది తెలిసినా మానినా, రచన దగ్గరకు వచ్చేసరికి అందరూ ప్రవీణులే అయి ఉండడం, అవి ఆ ప్రకారమే జరగడం, అనక జనం నవ్విపోవడం జరిపాటే.

అందువల్ల నాటికీ నేటికీ గూడా కవి అనే శాల్తీ, బయట మాట దక్కించుకోవాలంటే, స్టుడియోలో 'మాట' నిలబెట్టుకోవాలి; నయానా భయానా, బతిమాలీ బామాలీ, బుజ్జగించీను. లోవిలువ పైవలువ కూడా గొప్పవనిపించుకొన్న పాటలు రాసి సర్వత్రా గౌరవాభిమానాలు గడించుకొన్న సముద్రాల ఈనాడు 'మాట'కు పోరాడేస్థితిని దాటిపోయారు. పెద్దవాళ్ళ 'మాట'ని కాదనే వాళ్ళు తగ్గుతూనూ ఉన్నారు.

ఇలా పోరాటాల మధ్య నెగ్గుకొస్తూన్న సముద్రాల ఇపుడు దర్శకుడుగా కొత్తభూమికను చేపట్టారు. రచయితి దర్శకత్వం తీసుకున్నప్పుడు ప్రేక్షకులకు కొత్త ఆశలు కలగడం సహజం. సముద్రాల తొలిచిత్రం వినాయక చవితి వాలుగాలిలో నే సాగిపోయింది.

సినిమాకు కథలు కల్పించడం ఆయన పని కాకపోయినా, ఉన్నకథని మాటలమీద, తెరమీదా కూడా చిత్రించే ప్రముఖపాత్రను నిర్వహిస్తున్నారు కొంట్టి, సినీభవంలో పాతికేళ్ళ పడుచువాడుగా, అనుభవశాలిగా, బాధ్యతగల రచయితగా సముద్రాల రాఘవాచార్యులుగారు కూడా ఆనాడు సినిమాలోకి వ్యావహారికం తీసుకురాబోయినట్లే,- సమకాలిక జీవితాన్ని ప్రతిబింబించే సారస్వతాన్నికూడా ప్రవేశపెట్టి ఇపుడున్న గాడి మార్చడానికి సాటివారితో తోటివారితో పాటుపడతారని ఆయన పట్టుదల సామర్థ్యం ఎరిగినవారు ఆశిస్తారు. ★

విదేశ వార్తలు

అమెరికా అధ్యక్షులలో అగ్రగణ్యుడు ఫ్రాంక్లిన్ రూజ్‌వెల్ట్ జీవితచరిత్ర ఆధారంగా డోర్‌షారీ అనే ఆయన వ్రాసిన నాటకం 'సన్‌రైజ్ ఎట్ కాంపొబెల్లో'ను వార్నర్ బ్రదర్స్‌వారు చలనచిత్రంగా నిర్మిస్తున్నారు. ముఖ్యపాత్రను మార్లాన్ బ్రాండో నిర్వహిస్తారు.

విలియం ఫాక్‌నర్ నవల 'ది సౌండ్ అండ్ ది ఫ్యూరీ'ని ట్వెంటియత్ సెంచరీ ఫాక్స్‌వారు తెరమీద కెక్కించారు. యుల్ బ్రైనర్, జోన్‌ఉడ్‌వర్డ్, మార్గరెట్ లైటన్ ఇందులో నటించారు.

1958వ సంవత్సరపు చిత్రాలలో, ఎం. జి. ఎం. వారి సంగీతచిత్రం 'షిషి'కి అమెరికన్ మోషన్‌పిక్చర్ అకాడమీ అవార్డు లభించింది. ఈచిత్రం దర్శకుడు విన్సెంట్ మినెల్లీకి ఉత్తమ దర్శకత్వానికి ఒక ఆస్కార్ వచ్చింది. ఈ చిత్రానికే మరి ఏడుబహుమతులు—కళాదర్శకత్వం, కలర్ ఫొటోగ్రఫీ, ఎడిటింగ్, నేపథ్య సంగీతం, ఉత్తమగేయం, స్క్రిప్టులకు-లభించాయి.

ఈయేటి మేటి నటీనటులుగా "ఐవాంట్ టు లివ్" చిత్రంలో నటించిన సూజన్ హేవర్డ్, "సెపరేట్ టేబుల్స్"లో ముఖ్యపాత్ర ధరించిన బ్రిటిష్ నటుడు డేవిడ్ నివెన్‌లు ఎన్నిక అయ్యారు. సహాయ నటీనటుల బహుమతులు వెండీ హిల్లర్, బర్ల్ ఐవ్స్‌లు అందుకున్నారు.

ఉద్వేగ ప్రధానమైన సంగీతరచనకై— ఓల్డ్‌మాన్ అండ్ ది సీ చిత్రానికి సంగీతం సమకూర్చిన డిమిట్రీ టియోంకిన్‌కు ఒక ఆస్కార్ ఇచ్చి గౌరవించారు. ★

వివాహం

ప్రసిద్ధ నటుడు శ్రీ రేలంగి వెంకటరామయ్య, తమ మేనల్లుడు చి॥ సూర్యనారాయణబాబుకు, చి॥ సౌ॥ సూర్యకాంతాన్ని ఇచ్చి ఏప్రిల్ 19 ఆదివారం ఉదయం మద్రాసు, మౌంట్‌రోడ్‌లోని అబాట్స్‌బరీ భవనంలో వైభవంగా వివాహం జరిపించారు. ఉదయం ముహూర్తానికీ, సాయంకాలం విందుకు పలువురు ఫిలిం ప్రముఖులు వచ్చి వధూవరులను ఆశీర్వదించారు. రాత్రి శ్రీ ఎ. ఎం. రాజా, శ్రీమతి జిక్కీలగానసభ జరిగింది.

ఖండిత

(16-వ పేజీ తరువాయి)

అదిగో, అప్పుడే తొలికోడి కూసింది. ఇంతవరకూ యింటి గడప తొక్కలేదు, మాయదారి మనిషి. ఇంతసేపూ క్లబ్బులోనే వుంటారా? ఇంతసేపూ పేకాటే! ఏ పిచ్చ పడితే ఆ పిచ్చే ఇహ. వచ్చే నాలుగురాళ్ళూ నాలుగు ఘడియల్లో తుడిచి పెట్టేస్తేనేగాని నిద్రపట్టదాయనకు.

అయినా, ఇంతవరకూ క్లబ్బులోనే వుంటారని నమ్మకం ఏముంది? మరోచోటుకి వెళ్ళకూడదూ!...ఉందిగా అవతలి వీధిలో ఓ మొగుడుపీనుగ! అంకాలమ్మలా ఇంత మొహమూ అదీ. పెళ్ళీ పెడాకులూ లేవు. ఉద్యోగం వెలిగిస్తోందిట, వెధవ ఉద్యోగం అదీను! ఆ కంపెనీ మేనేజర్ని బుట్టలో వేసుకుని, కీలుబొమ్మలా ఆడించేస్తోంది. ఈమధ్య ఈయనగారు కూడా పడ్డారు కాబోలు దాని వల్లో. అయినా, ఈయన్ని వల్లో వేసుకోని అవసరమేముంది? .. అంతే! ఆ రంగేళీతో కలిసి సినీమాకి ఉడాయించివుంటారు ... నేనిక్కడ ఎలాచస్తే ఆయనకేం?

ఒళ్లు మండిపోతోంది, ఈయనగారి వరస చూస్తూంటే! ఇంతకీ, మన బంగారం మంచిదయితే కంసాల్ని తిట్టడమెందుకు? ఆఫీసులో తిన్నగా పనిచేసుకోక దాన్ని చూసి వెకిలినవ్వులు నవ్వివుంటారు...దాని తప్పేముంది?

పోనీ, పెళ్ళికాక ముందు ఏదో అల్లరిచిల్లరిగా తిరిగితే అనుకోవచ్చు. పెళ్ళయ్యాక కూడా అదేవరసయితే ఎలా? ఆ మాత్రం ఇంగితజ్ఞానం వుండక్కర్లేదూ? మళ్ళీ చదువుకున్నారు కూడాను. ఎందుకొచ్చిన చదువు? పొయ్యిలో పెట్టడానికా? ఈ మగాళ్ళకసలు బుద్ధిలేదు. ఆదికాలం నుంచీ యిలాగే ఏడిపిస్తున్నారు ఆడాళ్ళని. ఇంతకీ, ఆయన్ని తిడితే లాభమేముంది? అంతా నా పూర్వజన్మ సుకృతం! మొహాన్నున్న గీత ఎవరు తప్పిస్తారు?

అబ్బా అప్పుడే దాసీది వచ్చేస్తోంది! తెల్లవారిపోయిందన్నమాట! మా యింటికి రాకుండా ఎదురింట్లోకి వెడుతోందేమి చెప్మా? అవును మరి, వాళ్ళు నాలుగు రూపాయలు జీతమిస్తున్నారు. మేం రెండు రూపాయలే ఇస్తున్నాం! వాళ్ళు రోజూ పళ్ళెం అన్నం పెడతారట! మేం పండుగనాడేనా పట్టెడన్నం పెట్టలేక పోతున్నాం. అందుకని వాళ్ళకే ముందు తోముతుంది అంట్లు! నాలుగు చెంబులు తోమడానికి పంపు చింతపండు కావాలి దానికి! ఎక్కడ నుంచి తేగలం? ధరలు చూస్తే ఆకాశాన్నందుకుంటున్నాయి. జీవితాలు చూస్తే సముద్రం అడుక్కి అంటుకుపోతున్నాయి! ఎనభైరూపాయల జీతం ఎనిమిదో తారీఖు వెళ్ళకుండానే హారతి కర్పూరంలా హారించుకుపోతోంది. ఆయన ఎన్ని పనులు చెయ్యాలి, ఎంతమందిని పోషించాలి? క్లబ్బులో పేకాట ఆడాలి, బ్రాకెట్టు కట్టాలి, వాళ్ళనీ వీళ్ళని సినీమాలకి తీసుకెళ్ళాలి. నాకు చీరలు కొనకపోయినా బాబీకి ఆముదం సీసాలు కొనాలి, పాల డబ్బాలు కొనాలి. నాపోరు పడలేక యింట్లోకి ఉప్పూ పప్పూ తేవాలి.

అబ్బబ్బ! హైరాన పడిపోతోంది నా ప్రాణం రామచంద్రప్రభో! ఈయనెప్పుడు కుదుటబడతారోగాని; ఈ సంసారం ఎప్పుడు ఒడ్డు చేరుతోందోగాని;

* * *

అమ్మగారూ! ఓపాలి తలుపు తియ్యండి!" అన్న కేక వినపడింది వీధిలోంచి. శారద మెల్లగా వెళ్ళి తలుపు తెరచింది. తాలూకాఫీసు ముసలిప్యూన్ ఎదురుగా కనబడ్డాడు.

"ఏం వీరన్నా! యిలా వచ్చావు?"

"నిన్న తాసీల్దారుగోరు అర్జెంటుగా పోలారం కాడికి కేంప్ ఎల్లారండి ఆరితో పాటు పంతులుగోరిని కూడా తీసికెల్లారండి. తమతో మనవి సెయ్యమన్నారండి పంతులుగోరు. నిన్న సందకాడే సెప్పవలసిందండి. మరిసిపోయాను ముసలి ముండావోడిని. ఏదీ గాపకం వుంటలేదమ్మా"

"పోనీలే వీరన్నా! బాధపడకు. మళ్ళీ ఎప్పుడొస్తానన్నారు?"

"ఈ మాపిటికి వచ్చేత్తారండి ... సెలవండమ్మా!"

"ఊఁ! మంచిది"

దీర్ఘంగా నిట్టూర్చింది శారద. ముసలి వీరన్న వెళ్ళిపోతున్నాడు. అటుచూసింది శారద "ఇదిగో వీరన్నా!" మళ్ళీ అతన్ని పిలిచింది.

"ఏమండమ్మా?"

"ఆవిడ యింకా వుందా ఆఫీసులో?"

వీరన్న నెరసిపోయిన కోరమీసాల్లోంచి చిన్న నవ్వు తొంగి చూసింది. "రమాదేవిగారేనాండి? అబ్బే...వారంరోజులు నాడే ఎల్లిపోయారండి. ఏలూరు టాన్సరయిందండి!"

"శని విరగడయింది!" అనుకుంది శారద. ఆమె హృదయం తేలిక పడింది.

ప్రాగ్దిశ పురిటినొప్పులు పడుతోంది.

బాలభానుణ్ణి ప్రసవించబోతోంది.

బలిభుక్కులు ప్రభాతగానం పాడుతున్నాయి. ★

పుస్తక సమీక్ష

"బాపిబావ" కథల దొంతర

[భోగీరలోయ: కథల సంపుటి. రచయిత అడివి బాపిరాజు. క్రౌను సైజు 130 పుటలు. వెల: రు. 1-50. ప్రాప్తిస్థానం కవితా పబ్లికేషన్స్, విజయవాడ-2.]

లలితకళారాధకులపతి అడివి బాపిరాజు గారు—చాలా గొప్పకవీ, కథానికానీక రచయిత, పాండితిగల నవలాకారుడు అని చిత్రకారులూ - చాలా గొప్ప చిత్రకారుడనీ, ఆయన రేఖలు, రూపుధరించిన కావ్యఖండాలనీ రచయితలూ ఒకప్పుడు 'అడిపోసుకున్నారు.' బాపిరాజుగారు చాలా మంచి ఫలానా అనిఅంటూ, మంచి విశేషణాన్ని మనిషికిమటుకే పట్టించి తమ చమత్కారానికి నవ్వుకోలేక ఉక్కిరిబిక్కిరైపోయిన 'ఫలానా'లూ ఉన్నారు. ఈసరాగానురాగద్వేషాల ప్రమేయంలేని సామాన్యుడు మటుకు బాపిరాజుగారి 'గీత'ని 'రాత'ని చూచినపుడల్లా ఆనందిస్తూనే ఉన్నాడు. అతని గౌరవాభిమానాలకు పాత్రులైన ఇతర రచయితలూ చిత్రకారులూ కూడా ప్రైవేటుగా బాపిబావ చిత్రకారుడనీ, కవి అనీ, రసపిపాసిఅనీ, గాయకుడుఅనీ, కళామయుడుఅనీ మెచ్చుకుంటూ అన్నమాటల వల్ల ఈ మనీషిలో బాపిరాజుగారు రెండిటా సిద్ధహస్తుడన్న నిజమైన తాత్పర్యం స్థిరపడిపోయింది. బాపిరాజుగారు గొప్పవాడే స్మీ అని ఈరోజున ఎవరూ హెచ్చరికలు- చెప్పనవసరంలేదు. భోగీరలోయ, నాగేటి చాలు, బొమ్మలరాణివంటి కథలూ, తుఫాను, గోన గన్నారెడ్డివంటి నవలలూ చదివినా, శశికళవంటి వర్ణచిత్రాలూ, కిన్నెరసాని పాటలకు బాపిబావ రేఖానువాదాలూ చూచినా ఈ భావం మనలో కలుగుతుంది. వీటితోపాటు ఒక సౌందర్యపిపాసి హృదయం లీలగా అవగతం అవుతుంది. ఆయన వాక్యాల వెనకగల గొప్ప సంస్కారం, వాటికి కండపుష్టిని చేకూర్చిన ఆయన వైదుష్యం ఎంతటివో తెలుస్తాయి. ఇవన్నీ ఒకటికాగా, వ్యక్తిగా ఆయన ఒకడూ ఒక ఎత్తు. బాపిరాజుగారి జీవన ప్రాంగణంలోకి తొంగిచూచే అవకాశం కలిగిన వారంతా ఆనందోద్వేగంతో ఇటుచూచి అది ఒకలలితకళాలయమనీ, బాపిరాజు అరుదైన ఒక వ్యవస్థఅనీ అంటారు...

ఈ చిన్నపుస్తకం ఈతరంవారికి బాపిరాజుగారిని టూకీగా పరిచయం చేయగలదు. 'భోగీరలోయ'మీద లేతరంగులలో ఆయన వేసిన ప్రణయచిత్రం, 'నాగేటి చాలు'లో "నేలనాదీ గాలినాదీ, చాలు వేచిన వాలునాదీ"అని గుండెమీద చెయి వేసుకుని పాడుకోడానికి యాదగిరిరెడ్డి పడిన బాధల గాథను పదివాక్యాలలో మలచిన శిల్పం, తెలుగువాడిబొమ్మ తెలుగువాడిచే మునుగణి చేయగలిగేలా కడుతూ ఆయన వేసిన ఉపమానాలూ మనసులో నిలచిపోతాయి. 'నిన్నటితరం'లో కథారచనాసరళిస్వరాలను ఇంతమనోహరంగా వాయించి ఎందరో యువరచయితలను సాహితీ ప్రియులను, సమ్మోహితులను చేసిన బాపిరాజుగారిపట్ల 'గురు'భావం కలుగుతుంది....

పోతే ఈనాడు రాజకీయాలవాలాలైన అన్నిరంగాలలోను ప్రమాణాలను కోల్పోతున్న ప్రమాణాలు కనీ, "స్వార్థవ్యాపార"సరళీ స్వరాలతో కలిసి కలుషితాలై అపశ్రుతి భూయిష్ఠాలైపోతున్న కళామురళీరవాలువినీ చాటుగా దిగులుపడేవారికీ, పతితలూ ప్రేక్షకులూ, శ్రోతలు చవకబారుతనాన్ని ప్రోత్సహిస్తే ఏంచేస్తామని చవటబారుతున్న సహృదయులకూ ధైర్యం చెప్పి హెచ్చరిక చేసే వాక్యాలు (బొమ్మలరాణికథలో) ఈనాడు మనం మననం చేసుకోతగ్గవి.

"మానవునిలో పశుత్వం ప్రతివ్యక్తి జీవితంలోనూ ఒకసారి పైకివచ్చినట్లుగానే ఒక సంఘజీవితంలోకూడా అప్పుడప్పుడు వస్తుంది."

"..ప్రేక్షక లోకంయొక్క హృదయస్థితినిబట్టి (కళా)ప్రదర్శనం రీతినీ మారుతూ ఉంటుంది. సంఘ కళారసజ్ఞత అధోలోకంలోకి పడిపోతూ ఉన్నప్పుడు ఆ పతనాన్ని ఆపుచేసి నిలబెట్టేబాధ్యత ప్రభుత్వంపైనా కళాస్రష్టలపైనా, జమీందారులపైనా, ధనికులపైనా ఉన్నది." ★

విశాఖపట్నం విశేషాలు

(7-వ పేజీ తరువాయి)

జలతారు, జరీ, ముఖమల్ బట్టలు ధరించి, పార్వతిగా ఓ ఉత్తమ నటీమణి ప్రక్క—స్త్రీ పాత్రధారులకు—సభ్యమైన దుస్తులు ఇవ్వకుండా-రాణించటమునకు ప్రయత్నించింది.

కీ॥ శే॥ రాఘవాచారిగారు, నటులకు చూపించిన ఒరవడి మర్చిపోయి, ఎవరిని నిలబెట్టినా బ్రహ్మాండంగా కనపడే, తెల్లమన్యను నాటకం ప్రదర్శించటము కళాభివృద్ధికి ఏమంతి సౌష్ఠవమైనపోషణ ఇయ్యగలదు?

మొన్న జరిగిన సంస్కృతీ ఉత్సవములు పూర్తిగా లలితకళలకూ, అందులోనూ—నాటకములకూ—సినిమా ప్లేబాకు ఆర్టిస్టులకూ ప్రాముఖ్యంఇచ్చి, సారస్వతాన్ని తదితర సాంస్కృతిక విషయములనూ మర్చిపోయినట్లు కనిపిస్తుంది. విశ్వకళా పరిషత్తు ఉపాధ్యక్షులు అధ్యక్షత వహించారు గనుకా, సాహిత్య ఎకాడమీ సభ్యులు శ్రీ అబ్బూరి రామకృష్ణారావుగారు వున్నారు కనుకా, ఇవి సంస్కృతీ ఉత్సవాలు అని సదస్యులు భావించాలా? ఈ ఉత్సవాలను నృత్యనాటకఉత్సవాలుఅనటం సమంజసం.

శ్రీయుతులు గ్రంథి మంగరాజుగారు అధ్యక్షులవటంవల్లనా, ఈ ఉత్సవాలలో సినిమా ప్లేబాక్ ఆర్టిస్టులకూ నర్తకులకూ ప్రాధాన్యం లభించింది?

బాల మురళీకృష్ణ పాట మొదటలేదు. తరువాతనైనా వారిని పిలిపించి వారిపాట ఏర్పాటు చేసినందుకు అభినందించాలి.

ఈ సంవత్సరము లోటుపాటులు మళ్ళీ సంవత్సరము దిద్దుకోగలరని ఆశించవచ్చునా?


"కాశ్యప" ★

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd , by S. Radha Krishna at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1 Editor S. Sambhu Prasad



ఆరాధన

చిత్రకారిణి : ఇ. ఎస్. లత—రాజమండ్రి.


మే విడుదల!
విశ్వరూపా
కూతురు కాపురం
నిర్మాత + దర్శకుడు
శేషగిరిరావు + శోభన్‌రావు